ESTD: 1999

www.voodayam.com

వుదయం

ఆదిలాబాద్ | 23-10-2026 శుక్రవారం | సంపుటి : 14 | సంచిక :41 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on

పండగ సాయన్న స్ఫూర్తితో

బహుజన సంక్షేమం

ట్యాంక్ బండ్ పై విగ్రహాల ఆవిష్కరణ
ముదిరాజులకు తగిన రాజకీయ ప్రాధాన్యత
బీసీ వర్గీకరణపై క్యాబినెట్ సబ్‌కమిటీ
వందేళ్ల తర్వాత చారిత్రాత్మక కుల గణన
సన్న బియ్యంతో కోట్లాది మందికి సంక్షేమం

హైదరాబాద్, అక్టోబర్ 22 (వుదయం) : తెలంగాణ నేలపై భూస్వామ్య దోపిడీకి, నిజాం రాజుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు పండగ సాయన్న అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పండగ సాయన్న జయంతి సభలో పాల్గొన్న ఆయన, సాయన్న అందించిన పోరాట స్ఫూర్తిని, ప్రజా సంక్షేమ పరిపాలనను గుర్తు చేసుకున్నారు.

దొరలు, భూస్వాములు పేదల భూములను ఆక్రమిస్తున్న కాలంలో వారికి అండగా నిలిచి సాయన్న ఒక సైన్యాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. సాయన్న కేవలం ధాన్యం పంచడమే కాకుండా, పేద ప్రజల ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందించిన దాత అని పేర్కొన్నారు. నిజాం పోలీసులు ఆయనను నిర్బంధించినప్పుడు నాటి వనపర్తి మహారాణి స్వయంగా నిధులు చెల్లించి విడిపించిన చరిత్ర ఆయనదని చెప్పారు. సాయన్నను అన్యాయంగా హత్య చేసినప్పటికీ, శతాబ్దం గడిచినా నేటికీ నాట్లు, కోతల సమయంలో ఆయన పాటలు మార్మోగుతూనే ఉన్నాయని తెలిపారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, పండగ సాయన్న వంటి బహుజన నాయకుల చరిత్రను గత పాలకులు కనుమరుగు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే, ట్యాంక్ బండ్ పై పండగ సాయన్న మరియు దొడ్డి కొమురయ్యల విగ్రహాలను పునఃప్రతిష్ఠిస్తామని ప్రకటించారు.

కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులు ఎంతో విశ్వసనీయమైన వారని సీఎం పేర్కొన్నారు. బ్రిటిష్ పాలన తర్వాత మళ్లీ వందేళ్లకు తమ ప్రభుత్వమే సామాజిక కుల గణనను అత్యంత పారదర్శకంగా చేపట్టిందని వెల్లడించారు. ఈ గణన వల్లనే ప్రతి కులం తమ హక్కుల కోసం గళం ఎత్తగలుగుతోందన్నారు. ఒకవేళ లెక్కల్లో ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయని భావిస్తే పూర్తి ఆధారాలు అందిస్తే సవరణలు చేస్తామని స్పష్టం చేశారు. ముదిరాజులను బీసీ డీ నుండి బీసీ ఏ వర్గంలోకి మార్చే అంశంపై తగిన గణాంకాలు లేకపోవడం వల్లనే ఆలస్యమైందని, ఈ విషయంపై రాబోయే మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చిస్తామని తెలిపారు. అంతేకాకుండా ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి, ఇతర సామాజిక వర్గాలకు ఉన్న అపోహలను తొలగిస్తూ సమగ్ర అధ్యయనం చేయిస్తామని హామీ ఇచ్చారు.

ముదిరాజులకు రాజకీయ ప్రాధాన్యత పెంచడంలో తమ ప్రభుత్వం ముందే ఉందన్న సీఎం, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే శ్రీహరి ముదిరాజ్ కు డీసీసీ అధ్యక్ష పదవితో పాటు శాసనసభ టికెట్ ఇచ్చి మంత్రిని చేశానని గుర్తుచేశారు. అలాగే నీలం మధుకు పార్లమెంట్ టికెట్ కేటాయించామని, రాబోయే రోజుల్లో ముదిరాజులకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కు సూచించారు. ప్రజా సంక్షేమం విషయంలో గత ప్రభుత్వాల కన్నా రెట్టింపు సేవలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో నందమూరి తారక రామారావు రెండు రూపాయిలకు కిలో బియ్యం అందిస్తే, తమ ప్రభుత్వం 3.48 కోట్ల మందికి నాణ్యమైన సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అధికారికంగా ఆమోదించామని తెలిపారు. నందమూరి తారక రామారావు, కలవకుంట్ల చంద్రశేఖర రావు, యడుగూరి సందింటి రాజశేఖర రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు అమలు చేసిన మంచి పథకాలను కొనసాగిస్తూనే మరింత మెరుగైన సంక్షేమాన్ని అందిస్తున్నామని స్పష్టం చేశారు. బహుజనుల, పేదల భవిష్యత్తు మారాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని, రాబోయే ఎన్నికల్లో ఆయనకు పూర్తి స్థాయిలో అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

పత్తి రైతుకు మద్దతు ధర భరోసా

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్రంలో 335 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి సేకరణ
పత్తి మార్కెటింగ్ పై ప్రత్యేక దృష్టి
ప్రాసెసింగ్, స్పిన్నింగ్ పరిశ్రమల విస్తరణకు సర్కార్ కసరత్తు
రైతులకు నష్టం లేకుండా పత్తి కొనుగోళ్లు
అందుబాటులోకి ప్రత్యేక సాంకేతిక సేవలు

హైదరాబాద్, అక్టోబర్ 22 (వుదయం) రాష్ట్రంలో పత్తి సాగు చేసిన రైతాంగానికి మద్దతు ధర దక్కేలా, కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రస్తుత మార్కెటింగ్ సీజన్ పత్తి కొనుగోళ్లపై ఆయన సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా మార్కెటింగ్ అధికారులు మంత్రికి వివరాలు వెల్లడిస్తూ, ప్రస్తుత ఖరీఫ్ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 48.20 లక్షల ఎకరాలలో పత్తి సాగైందని, దాదాపు 29.43 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రతికూల వాతావరణం, ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా పత్తి ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున రాష్ట్రంలో కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి సూచించారు.

కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు క్వింటాల్ పత్తి కనీస మద్దతు ధరను రూ.8,667గా నిర్ణయించగా, ప్రస్తుతం తెలంగాణ మార్కెట్లలో సగటు ధర రూ.9,000 వరకు పలుకుతోందని అధికారులు తెలిపారు. మార్కెట్ ధర మద్దతు ధర కంటే ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు బహిరంగ మార్కెట్లోనే విక్రయించుకోవచ్చని, ఒకవేళ ధరలు తగ్గితే భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) ద్వారా కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు జరుపుకునేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. తేమ శాతం, నాణ్యతా ప్రమాణాలు దెబ్బతినకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గతంలో ఉన్న 122 కొనుగోలు కేంద్రాలను ఈసారి 133కు పెంచినట్లు అధికారులు వివరించారు. రాష్ట్రంలోని 30 జిల్లాల పరిధిలో ఉన్న 335 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా ఖరారు చేశారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుజరాత్, మహారాష్ట్రల తరహాలో తెలంగాణలోనూ పత్తి ఆధారిత పరిశ్రమలైన స్పిన్నింగ్, ప్రాసెసింగ్, నూనె ఉత్పత్తి మిల్లుల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. పత్తి విక్రయాల్లో పారదర్శకత కోసం 'కపాస్ కిసాన్' సాంకేతిక వ్యవస్థను ఉపయోగిస్తున్నామని, లక్షలాది మంది రైతుల వివరాలను ఇందులో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కొనుగోలు వివరాలు, చెల్లింపుల సమాచారం తెలుసుకునేందుకు ఉచిత దూరవాణి సంఖ్య 18005995779 మరియు వాట్సాప్ సంఖ్య 8897281111 సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. రైతులు తమ పంటలోని తేమను పరీక్షించుకోవడానికి రైతు వేదికల్లో ప్రత్యేక పరికరాలను అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

రాజధానిలో నిరసనలు..

విదేశాల్లో రాహుల్ గాంధీ

చొరబాటుదారుల ఓట్ల కోసమే విపక్షాల నాటకాలు
ఓటు చోరీ ఆరోపణలపై కేంద్ర హోం మంత్రి తీవ్ర ఆగ్రహం
ప్రజల నడుమ ఉంటేనే విజయం సాధ్యం

న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (ఎఎంస్) : కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలో విపక్షాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఉదంతంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. రాహుల్ గాంధీ వైఖరిని తప్పుపడుతూ, కాంగ్రెస్ పార్టీ మరో మూడు దశాబ్దాల పాటు అధికారానికి ఆమడ దూరంలోనే ఉండిపోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ విదేశాల్లో ఉన్నందున తన మాటలు ఆయనకు వినపడకపోవచ్చని, ప్రతి ఆరు నెలలకోసారి విదేశాలకు ఎందుకు వెళ్తారో బహిర్గతం చేయరని వ్యాఖ్యానించారు. అది ఆయన వ్యక్తిగత విషయమైనప్పటికీ, విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాతైనా వాస్తవాలను గ్రహించాలని సూచించారు. నిరసనలు, ప్రజాందోళనల వల్ల ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదని, ప్రజల తీర్పును రాజకీయ గారడీలతో మార్చలేరని స్పష్టం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రజల మధ్యకు వెళ్లే వారి సమస్యలను తెలుసుకోవాలని, అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని హితవు పలికారు. లేని పక్షంలో మిగిలిన ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ ఉనికి కోల్పోతుందని హెచ్చరించారు. ఓటు అక్రమాలపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను హోం మంత్రి తీవ్రంగా ఖండించారు. అక్రమ చొరబాటుదారుల ఓట్లను కాపాడుకోవాలనే దురుద్దేశంతోనే రాహుల్ గాంధీ మరియు కాంగ్రెస్ మిత్రపక్షాలు పదే పదే 'ఓటు చోరీ' నాటకానికి తెర తీస్తున్నాయని ఆరోపించారు. దేశంలో భారతీయ జనతా పార్టీ మరో ముప్పై ఏళ్ల పాటు పరిపాలన సాగిస్తుందని తాను ప్రకటిస్తే, ఫలితాలు ముందుగానే ఎలా తెలుస్తాయంటూ విపక్షాలు ప్రశ్నిస్తున్నాయని పేర్కొన్నారు. తాను ఈ దేశంలోనే పుట్టి, ఇక్కడి ప్రజల మధ్యే జీవిస్తున్నానని, విదేశీ పర్యటనలు చేసే అలవాటు తనకు లేదని అమిత్ షా స్పష్టం చేశారు.

పన్నెండు లక్షల ఎకరాల్లో ఎండిపోయిన పంటలు

గజ్వేల్, అక్టోబర్ 22 (వుదయం) : రాష్ట్రంలో తీవ్రమవుతున్న కరువు పరిస్థితులపై స్పందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, భారత్ రాష్ట్ర సమితి శాసనసభాపక్ష ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించి సహాయక చర్యలు చేపడుతుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించిన చందంగా.. రాష్ట్రంలో కరువు రక్కసి విలయతాండవం చేస్తుంటే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజలను గాలికొదిలేశారని హరీశ్ రావు మండిపడ్డారు. ఇది ప్రకృతి ప్రకోపం వల్ల వచ్చిన కరువు కాదని, ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన మానవ నిర్మిత కరువు అని ఆయన స్పష్టం చేశారు. పది నెలల క్రితమే శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు ఎల్ నినో ప్రభావం వల్ల తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించినప్పటికీ, యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంలో ప్రభుత్వం నిద్రమత్తులో జోగిందని ఆరోపించారు. ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు పన్నెండు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా పత్తి పంట దిగుబడి దారుణంగా పడిపోయి, ఎకరానికి కనీసం రెండు మూడు క్వింటాళ్లు కూడా రాని పరిస్థితి నెలకొందని తెలిపారు. రైతులు పెట్టిన పెట్టుబడి కూడా దక్కక తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారన్నారు. తాగునీరు, సాగునీటి కోసం పలు జిల్లాల్లో ప్రజలు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇతర రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించడమే కాకుండా రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందిస్తున్నాయని, తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక నిధులు కేటాయించాయని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదని, కనీసం కరువు ప్రాంతాలను కూడా గురుతించలేదని నిలదీశారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడంలో విఫలమైన ప్రభుత్వం, ఇప్పుడు కరెంట్ కొందామన్నా దొరకడం లేదంటూ నేతలు ఉచిత సలహాలు, నెపాలు వెతుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. తక్షణమే కరువు మండలాలను ప్రకటించి ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

సౌదీ విమానాశ్రయంపై హూతీల దాడి

భారతీయుడి మృతి, పలువురికి గాయాలు

రియాద్: సౌదీ అరేబియాలోని దమ్మామ్ అంతర్జాతీయ విమానాశ్రయంపై బుధవారం హూతీ తిరుగుబాటుదారులు జరిపిన డ్రోన్ దాడిలో ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు ఆ దేశ పౌర విమాన యాన శాఖ ధ్రువీకరించింది. మరణించిన వారిలో ఒక భారతీయుడు ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఈ విషాదకర ఘటనలో భారతీయ పౌరులతో పాటు యెమెన్, బంగ్లాదేశ్ దేశాలకు చెందిన పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరిస్తున్నామని రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించింది. మృతి చెందిన వారి కుటుంబాలకు తీవ్ర సానుభూతి తెలియజేసిన రాయబార కార్యాలయం, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. హూతీలు ప్రయోగించిన డ్రోన్‌ను సౌదీ వైమానిక దళాలు గాల్లోనే విజయవంతంగా అడ్డుకున్నాయని సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే, కూల్చివేసిన డ్రోన్ శకలాలు విమానాశ్రయ ప్రాంగణంలో పడటంతో ఈ ప్రాణనష్టం సంభవించిందని, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని స్పష్టం చేసింది.

స్టాక్ మార్కెట్ అప్‌డేట్

వరుసగా మూడో రోజూ నష్టాల్లో వాటా మార్కెట్లు
22,700 దిగువకు చేరిన నిఫ్టీ
సెన్సెక్స్ 460 పాయింట్లు పతనం
తీవ్ర అమ్మకాల ఒత్తిడిలో ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్!

ఇంతే కదా...!



ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

ప్రధాని మోదీ, బెంజమిన్ నెతన్యాహు ఫోన్ సంభాషణ
శాంతి స్థాపనకు దౌత్యమే మార్గమని మోదీ స్పష్టీకరణ
ఇజ్రాయెల్ స్వాతంత్ర్య వేడుకలకు ప్రధాని మోదీకి ఆహ్వానం
ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతం

న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (ఎఎంస్) : పశ్చిమాసియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్‌లో సంభాషించారు. ఈ ద్వైపాక్షిక చర్చల్లో ఇరుదేశాల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కట్టుబడి ఉన్నామని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని, వైమానిక దళ పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలనం చేయాలని ప్రధాని మోదీని నెతన్యాహు ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సమాచారం. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా భద్రతా పరిస్థితులపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాలను వీలైనంత త్వరగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వివాదాల పరిష్కారానికి, శాంతి స్థాపనకు దౌత్యపరమైన సంప్రదింపులే సరైన మార్గమని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఉగ్రవాద నిర్మూలనలో భారత్, ఇజ్రాయెల్‌లు కలసికట్టుగా పోరాడుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2526 తేదీలలో ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించిన సమయంలో ఇరుదేశాల భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సమయంలోనూ ఇరువురు నేతలు సంభాషించారు. ఇటీవల ఫ్లైదుబాయ్ విమాన ఘటన అనంతరం పైలట్ మచ్చర్‌ను ఫోన్‌లో పలకరించిన నెతన్యాహు, ఆయనను ప్రపంచానికి హీరో అని కొనియాడిన సంగతిని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.



దోపిడీపై ధిక్కార గళం.. పేదల పక్షాన పండుగ సాయన్న!

- **జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు**

గద్వాల, అక్టోబర్ 22 (వుదయం బ్యూరో)
అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేదల పక్షాన నిలిచిన పాలమూరు ప్రజావీరుడు పండుగ సాయన్న ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.
పేదల కోసం పోరాటం.. ఆత్మగౌరవానికి ప్రతీక!
ప్రస్తుత మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేట మండలం మెరుగొనిపల్లెకు చెందిన పండుగ సాయన్న, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజా వీరుడిగా తెలంగాణ జానపద చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అణగారిన వర్గాలకు అండగా నిలిచి, పేదల ఆత్మగౌరవం కోసం పోరాడిన ఆయన జీవితం చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని, సమానత్వం, సామాజిక న్యాయం, సేవాభావానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్య మివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ఏవో సాయికృష్ణ, ఆర్ఐ వెంకట్, ఆర్ఎస్సైలు చంద్రకాంత్, మద్దయ్య, డీపీఓ సిబ్బంది, వివిధ విభాగాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ సంబంధం పెట్టుకొని భర్తను హత్య చేసిన భార్య

మహబూబ్ నగర్ జిల్లా - నవాబ్ పేట, అక్టోబర్ 22 (వుదయం)
అక్రమ సంబంధం కొనసాగించుటకు అడ్డుగా ఉన్న భర్తను మరింత ఎక్కువగా మద్యం తాగించి కిందపడేసి భర్త మర్మాంగాలను పిసికి హత్య చేసిన భార్య
మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట్ మండలంలోని తీగలపల్లి గ్రామానికి చెందిన పెద్దమోని శీను (50) లక్ష్మమ్మ తో 25 సంవత్సరాల క్రితం వివాహం జరిగినది. ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం కూలి పని కోసం మహబూబ్ నగర్ లోని హనుమాన్ నగర్, కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తూ గత కొంతకాలం నుంచి భార్య లక్ష్మమ్మ తాగుడుకు బానిసై మహబూబ్ నగర్ కు చెందిన ఒక వ్యక్తితో అక్రమ

సంబంధం పెట్టుకున్నది. ఇట్టి విషయాన్ని గమనించిన భర్త పెద్దమోని శీను భార్య లక్ష్మమ్మ పై అనుమానం వచ్చిన తరచూ గొడవ పడేవాడు. ఇక భర్త పెద్దమోని శీను పీడ వదిలించుకోవాలని నిర్ణయించుకొని ఉండగా అక్టోబర్ 19 సోమవారం సాయంత్రం 7 గంటలకు ఇద్దరు కలిసి మద్యం సేవించిన తర్వాత భర్త, భార్యను పై విషయాలపై నిలదీయగా ఎలాగైనా భర్తను చంపి తన అక్రమ సంబంధాలను కొనసాగించుకోవచ్చని ఉద్దేశంతో, భర్తను మరింత ఎక్కువగా మద్యం తాగించి కిందపడేసి భర్త పెద్దమోని శీను మర్మాంగాలను భార్య లక్ష్మమ్మ పిసికి అక్కడే ఉన్న అద్దంను పగలగొట్టి అద్దం ముక్కలతో మర్మాంగాలను దాడి చేసి మరియు ఎడమ కన్ను పైన పొడవగా రక్త గాయాలయి చనిపోయాడు. అప్పుడే చిన్న కొడుకును ఇంటికి వస్తుండగా చూసి ఇంట్లో నుండి పారిపోయిన ది. పరారీలో ఉన్న నిందితురాలను మహబూబ్నగర్ లోని బస్టాండ్ లో బుధవారం తెల్లవారుజామున పోలీసులు గుర్తించి రిమాండ్ కు తరలించినట్లు 2 టౌన్ సీఐ ఏజాజోదిన్ తెలిపారు.

ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

- **వరి సాగుకు దూరంగా ఉండాలి.. రైతులకు అవగాహన కల్పించాలి**
- **మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, ఏఎంసీ పాలకవర్గం**

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 22, వుదయం:
ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుని వ్యవసాయ రంగంలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈ నేపథ్యంలో వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు.
'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ కొంగరి రవి, వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి పరమేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, మండల ఏఈవో, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. రైతులకు పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ సాగు విధానాలు,

నీటి వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకుని నష్టాల ప్రమాదాన్ని తగ్గించుకునేలా అధికారులు మార్గనిర్దేశం చేయాలని పేర్కొన్నారు.

ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు, ప్రజలే నా బలం, ప్రజా సేవే నా లక్ష్యం,

- **నాల్కకల్ మండల కాగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి ,(నాల్కకల్ వుదయం ప్రతినిధి) అక్టోబర్ 22 సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం**

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి ఈ పవిత్రమైన పండుగ సందర్భంగా మనమందరం ఐక్యమత్యంతో సోదర భావంతో ముందుకు సాగుదాం కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని గౌరవిస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తూ మన సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రతి ఇంట ఆనందం వెల్లువిరియాలి ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నిండాలి మన మండలం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి ఈ దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు కొత్త విజయాలు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను శుభాకాంక్షలు తెలుపడానికి వచ్చినా ముంగి గ్రామం సర్పంచ్ అరుణ శ్రీనివాస్ రెడ్డి మరియు వివిధ గ్రామాల పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా తనను కలిసి దసరా శుభాకాంక్షలు చెప్పడం జరిగింది. అందులో అందరూ కలిసిమెలిసి సోదరుభావంతో ముందుకు సాగాలని మన మండల అభివృద్ధికి నా వంతు ప్రభుత్వ సహాయంతో నా వంతుగా కృషి చేస్తానని చెప్పడం జరిగింది, అదేవిధంగా న్యాల్కల్ రిపోర్టర్ బాబు ,జరాసంఘం రిపోర్టర్ ,యాదయ్య మర్యాదపూర్వకంగా శాలువకప్పి శుభాకాంక్షలుచెప్పడం జరిగింది వివిధ గ్రామాల పార్టీ నాయకులు తదితరులు కలసి శుభాకాంక్షలు తెలుపడం జరిగింది

అక్రమ కార్యకలాపాల కట్టడికి ప్రత్యేక నిఘా

- **ధరూర్ ఎస్ఐగా బి.తారక బాధ్యతల స్వీకరణ**

ధరూర్ అక్టోబర్ 22 (వుదయం బ్యూరో)
ధరూర్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారిస్తామని నూతన ఎస్ఐ బి.తారక పేర్కొన్నారు. ధరూర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీసీఆర్బీ ఎస్ఐగా విధులు నిర్వహించిన బి.తారక ధరూర్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న నందీకర్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో జూదం, అసాంఘిక కార్యకలాపాలు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ చర్యలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం

చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన బి.తారకకు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పండుగ సాయన్నకు ఘనంగా నివాళులు అర్పించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్
పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా గురువారం మహబూబ్‌నగర్ పద్మావతి కాలనీలో గ్రీన్‌బెల్ట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆనాటి నిజాం ప్రభుత్వ హయాంలో భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు పండుగ

సాయన్న అని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పండుగ సాయన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి, సామాజిక స్పృహ నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డి.ఆర్.ఓ. ఏ.నిర్మల, బి.సి సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో ఘనంగా తెలంగాణ వీరుడు పండుగ సాయన్న

174వ జయంతి వేడుకలు

(వుదయం ప్రతినిధి) పాపన్నపేట, అక్టోబర్ 22:
తెలంగాణ గడ్డపై నిజాం రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరించి, పేద ప్రజల పక్షాన నిలిచిన తెలంగాణ రాబిన్ హుడ్, స్వాతంత్ర్య సమరయోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలు పాపన్నపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.
మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మండల అధ్యక్షుడు కిష్టయ్య అధ్యక్షత వహించారు. ముందుగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... దొరల గడీలపై దాడి చేసి, పేదల సొమ్మును పేదలకే పంచిన మహోన్నత వ్యక్తి పండుగ సాయన్న అని కొనియాడారు. ఆయన త్యాగాన్ని, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, ముదిరాజ్ జాతి అభివృద్ధికి, ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ముశెట్టి కిష్టయ్య. ఉపాధ్యక్షుడు బుడిమె సత్యనారాయణ, యువజన మండల అధ్యక్షుడు కిరణ్, ముదిరాజ్ నాయకులు టేక్మాల్ సాయిలు, బొక్కల బాగయ్య, ఏసు వెంకటేశం, ఆంజనేయులు, విఠల్, మల్లేశం, లక్ష్మణ్ తదితర ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పునరావాసం వట్వర్లపల్లిలో 240 మంది బాండ్ పేపర్లపై సంతకాలు

అచ్చంపేట, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ATR) పరిధిలో పునరావాస ప్రక్రియలో ముందడుగు పడింది. కోర్ ఏరియాలోని వట్వర్లపల్లి గ్రామానికి చెందిన 240 మంది గ్రామస్తులు స్వచ్ఛందంగా ఎంపోయూ బాండ్ పేపర్లపై సంతకాలు చేసి అడవిని వీడి కొత్త జీవితంలోకి అడుగుపెట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (NTCA) మార్గదర్శకాల ప్రకారం టైగర్ రిజర్వ్ కోర్ ఏరియాలో నివసిస్తున్న ఏడు గ్రామాలను స్వచ్ఛందంగా తరలించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా గత కొన్ని నెలలుగా గ్రామసభలు, అవగాహన సదస్సులు నిర్వహించి పునరావాస ప్రయోజనాలు, ప్రభుత్వ ప్యాకేజీలపై అధికారులు అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమానికి డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, ఎఫ్డీఓ యశ్ చంద్రప్రకాశ్ సింగ్, ఎంపీడీఓ రామన్న, రేంజర్లు వీరేష్, ఈశ్వర్, సీఐ నాగరాజు, ఎస్ఐ జయ్యన్న, సెక్షన్, బీట్ అధికారులు, పునరావాస కమిటీ అధ్యక్షుడు సాయి, ఉప సర్పంచ్ బండ బాలరాజు, పంచాయతీ కార్యదర్శి సాయిరామ్, మాజీ సర్పంచ్ బోజియా నాయక్, పునరావాస కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.
అధికారుల తెలిపిన వివరాల ప్రకారం పునరావాసానికి అంగీకరించిన ప్రతి కుటుంబానికి రెండు ప్యాకేజీలలో ఒకటి ఎంచుకునే అవకాశం ఉంది. ప్యాకేజీ 1 కింద రూ.15 లక్షల నగదు పరిహారం, ప్యాకేజీ 2 కింద ప్రభుత్వమే భూమి, ఇల్లు, రోడ్లు, కరెంట్, నీరు, స్కూల్, హాస్పిటల్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది. ఈ సందర్భంగా డీఎఫ్ఓ రేవంత్ చంద్ర మాట్లాడుతూ ఇది బలవంతపు తరలింపు కాదని, ప్రజల స్వచ్ఛంద నిర్ణయమని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పునరావాసంతో పిల్లలకు మెరుగైన విద్య, వైద్యం లభించడంతో పాటు పులులు స్వేచ్ఛగా సంచరించేందుకు, మనిషివన్యప్రాణి సంఘర్షణ తగ్గేందుకు దోహదపడుతుందని అన్నారు.

కలెక్టరేట్‌లో పండగ సాయన్న జయంతి వేడుకలు

సంగారెడ్డి వుదయం :
సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ పోరాట యోధుడు, ముదిరాజ్ వీరుడు పండగ సాయన్న జయంతి వేడుకలను తొలిసారిగా అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నరసింహులు హాజరై పండగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, సదాశివపేట మండల అధ్యక్షుడు పట్లోళ్ల నాగేశ్వర్ పాటిల్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను

భావితరాలకు అందించాలి

- **జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**
- **పండగ సాయన్న జీవితం ధైర్యసాహసాలకు, సామాజిక చైతన్యానికి ప్రతీక**

నాగర్ కర్నూల్, అక్టోబర్ 22 (వుదయం బ్యూరో):
మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాలని, పండగ సాయన్న ముదిరాజ్ జీవితం ధైర్యసాహసాలకు, సామాజిక చైతన్యానికి ప్రతీక అని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసిన మహనీయుల జీవిత చరిత్రలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. పండగ సాయన్న చరిత్రను యువత తెలుసుకొని ధైర్యం, ఆత్మవిశ్వాసం, సేవాభావం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలన్నారు. జయంతి వేడుకలు నివాళులకే పరిమితం కాకుండా వారి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రేరణ కల్పించాలని తెలిపారు. విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమని, వెనుకబడిన వర్గాల ప్రజలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి కుటుంబం పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, డీఆర్ఓ పాండు, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, డీటీడీఓ కొటయ్య, ఆర్డీవోలు అర్చన, జనార్దన్ రెడ్డి, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ నియామకంలో ఎలాంటి అక్రమాలు జరగలేదు

- **ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఎంపిక**

కేశంపేట:
రేషన్ డీలర్ నియామక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అధికారులు ఎంపిక ప్రక్రియ నిర్వహించారని ఇటీవల రేషన్ డీలర్‌గా ఎంపికైన మల్లేష్ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామ రేషన్ డీలర్‌గా అవకాశం రావడం పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగిందని ఆయన స్పష్టం చేశారు. నియామక ప్రక్రియపై కొందరు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. అధికారులు అర్హతలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేపట్టారని తెలిపారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, పక్షపాతం లేదా అక్రమాలకు తావులేకుండా ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ప్రభుత్వంపై చిల్లర ఆరోపణలు చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మల్లేష్ యాదవ్ అన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించేలా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. రేషన్ డీలర్ నియామకంపై ఎవరికైనా అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిగిన ఎంపికను వివాదాస్పదం చేయడం తగదని, ప్రజలకు న్యాయమైన సేవలు అందించేందుకు తాను కృషి చేస్తానని మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు.

మాజీ మంత్రి హరీశ్ రావుకు దసరా శుభాకాంక్షలు

తెలిపిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి ,వుదయం
హైదరాబాద్‌లో మాజీ మంత్రివర్యులు, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కు దసరా సందర్భంగా మ్మెల్యే చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు జమ్మి ఆకులు అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆప్యాయంగా పలకరించుకుని, ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు...దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు...కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ నాయకులు , ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్ లు కార్యకర్తలు ఉన్నారు.

మాజీ మంత్రి హరీష్ రావుకు దసరా శుభాకాంక్షలు

- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**
- **మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**

గుమ్మడిదల, అక్టోబర్ 22 (వుదయం):
దసరా పండుగను పురస్కరించుకుని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. విజయదశమి పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావుతో ఆత్మీయంగా మాట్లాడి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు చక్రపాణి, కుమార్ గౌడ్, హుస్సేన్, వెంకట్ రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, మహేష్, ఫయాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్

ఫిజియోఫ్లెక్స్ ను ప్రారంభించిన రంగరాయ ప్రసాద్

బాచుపల్లి, అక్టోబర్ 22,(వుదయం ప్రతినిధి),
బాచుపల్లి క్రాంతి నగర్ లో డాక్టర్ దీపు చే ఏర్పాటు చేసిన ఫిజియోఫ్లెక్స్ సెంటర్ ను నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఎన్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఫిజియో థెరపీ సెంటర్ అందరికీ అందుబాటులో ఉంటుందని ఫిజియో థెరపి సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి మాజీ కార్పొరేటర్ రవికిరణ్ వాకలపూడి, ఆనంద్ రెడ్డి, తాళ్లూరి ప్రదీప్, కిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు పండుగల సాయన్న

రంగారెడ్డి జిల్లా
సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాబిన్‌హుడ్ 174వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణరంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరు గాంచిన పండుగల సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరై పండుగల సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ, దాదాపు 150 సంవత్సరాల క్రితం సమాజంలో చట్టపరమైన రక్షణలు పరిమితంగా ఉన్న సమయంలో నిజాం పాలనలోని నిరంకుశత్వం, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలను ఎదిరించి, పేదలు మరియు బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప మానవతావాది పండుగల సాయన్న అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను సహించలేక, పేద ప్రజల కోసం పోరాడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు.

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరమని ఆమె అన్నారు. ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతుండగా, పేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో, చట్టాలకు లోబడి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఐకమత్యం ఎంతో అవసరమని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, పండుగల సాయన్న 174వ జయంతిని నిర్వహించుకుంటున్నప్పటికీ, ఆయన ఆశయాలైన సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాలకు న్యాయం వంటి లక్ష్యాలు నేటికీ పూర్తి స్థాయిలో నెరవేరలేదని అన్నారు. పేద ప్రజల పక్షాన నిలిచి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.పండుగల సాయన్న మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మెరుగోనిపల్లి గ్రామంలో సాయమ్మ, అనంతయ్య దంపతులకు ముదిరాజ్ కుటుంబంలో జన్మించారని ఆయన వివరించారు. చిన్నతనం నుంచే మల్లయుద్ధం, గ్రామీణ క్రీడల్లో పాల్గొంటూ దృఢమైన శరీరదారుఢ్యాన్ని పెంపొందించుకున్న సాయన్న, అప్పటి నిజాం పాలనలో భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, ఇతర ఆధిపత్య వర్గాల దోపిడీని, పేద ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలను చూసి చలించిపోయారని తెలిపారు.

పంటలు పండిన తర్వాత పేద రైతుల నుంచి బలవంతంగా పన్నులు వసూలు చేయడం, వారి భూములను లాక్కోవడం వంటి అన్యాయాలను ఎదిరించేందుకు సాయన్న తన స్నేహితులతో కలిసి ఒక దళాన్ని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. సంపన్నుల నుంచి దోచుకున్న సంపదను పేదలకు పంచడంతో పాటు, పేద ప్రజల వివాహాలకు బంగారం అందించి వారికి అండగా నిలిచేవారని వివరించారు. ప్రజల్లో సాయన్నకు పెరుగుతున్న ఆదరణను సహించలేని ఆధిపత్య వర్గాలు నిజాం పాలకులతో కలిసి కుట్రపూరితంగా ఆయనను హతమార్చాయని పేర్కొన్నారు. ధనవంతుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన బహుజన వీరుడు పండుగల సాయన్న అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిపాలన అధికారి సునీల్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం, ముదిరాజ్ మహాసభ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు కాకి వేణుగోపాల్, కాకి లక్ష్మణ్, ఆనియన్ ముదిరాజ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భౌరంపేట్ నుండి శబరిమలకు గోనె రామిరెడ్డి గురుస్వామి పాదయాత్ర..

దుండిగల్, అక్టోబర్ 22,(వుదయం ప్రతినిధి),
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ గ్రామానికి చెందిన గోనె రామిరెడ్డి గురుస్వామి కేరళ లోని శబరిమల అయ్యప్ప సన్నిధానానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, అయ్యప్ప భక్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి గురుస్వామిని సన్మానించి, పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో గురుస్వామి యాత్ర సాఫీగా సాగాలని ప్రార్థించారు.

ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసిన గడ్డపోతారం నాయకులు

జిన్నారం అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి)
దసరా పండుగను పురస్కరించుకుని గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు నారబోయిన కుమార్, నారబోయిన శ్రీనివాస్ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్‌కు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

జిన్నారంలోనే డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలి

- **ప్రభుత్వ జీవో ప్రకారం చర్యలు తీసుకోవాలి**
- **బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్**

జిన్నారం అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి)
జిన్నారం మండల కేంద్రంలో ప్రభుత్వ జీవో ప్రకారం మంజూరైన డీఎస్పీ కార్యాలయాన్ని ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసేందుకు పోలీస్ శాఖ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్ అన్నారు. ప్రభుత్వం గతంలో జిన్నారంలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటుకు జీవో విడుదల చేసిన నేపథ్యంలో, అదే నిర్ణయాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలు అధికంగా ఉన్న జిన్నారం మండలంలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువవుతాయని, వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ విషయంపై పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, మేధావులు, జర్నలిస్టులు, కుల సంఘాల నాయకులు, యువత ముందుకు వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి, జారీ చేసిన జీవో ప్రకారం జిన్నారంలోనే డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. పోలీసు శాఖ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో జిన్నారంలో కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

పరిశుద్ధ కార్మికుల సేవలు వెలకట్టలేనివి
వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటా ఈర్ల రాజు ముదిరాజ్

- **దసరా సందర్భంగా మున్సిపల్ పరిశుద్ధ కార్మికులకు ఆర్థిక సహాయం అందజేసిన బీజేపీ బీరంగూడ డివిజన్ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్***

అమీన్‌పూర్:
పటాన్చెరు నియోజకవర్గం, అమీన్‌పూర్ మండలం బీరంగూడ డివిజన్, అమీన్పూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ పరిశుద్ధ కార్మికులు విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని *బీరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ గారిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ గారు కూడా కార్మికులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పండుగ కానుకగా వారందరికీ ఆర్థిక సహాయం అందజేశారు.*
ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, *"పరిశుద్ధ కార్మికులు సమాజానికి కనిపించని సేవకులు కాదు.. మన ఆరోగ్యకరమైన జీవనానికి అహర్నిశలు శ్రమించే నిజమైన సేవకులు. మనం పరిశుభ్రమైన వాతావరణంలో జీవిస్తున్నామంటే అందులో మీ కష్టం, మీ చెమట, మీ అంకితభావం ఎంతో ఉంది. మీ సేవలు వెలకట్టలేనివి. మీ శ్రమకు సమాజం ఎప్పుడూ గౌరవం ఇవ్వాలి"* అని అన్నారు.

"పండుగ అంటే కేవలం మన ఇంట్లో ఆనందం ఉండటమే కాదు.. మన చుట్టూ ఉన్న ప్రతి కుటుంబంలోనూ సంతోషం వెల్లివిరియాలి. అందుకే మీతో కలిసి ఈ పండుగ ఆనందాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో నా వంతు ఆర్థిక సహాయం అందజేశాను. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదు.. మీపై నాకున్న గౌరవానికి, ఆప్యాయతకు గుర్తు" అని పేర్కొన్నారు.
ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు పరిశుద్ధ కార్మికుల సేవలకు అత్యున్నత గౌరవం కల్పిస్తూ, కుంభమేళా సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల పాదాలు కడిగి వారి సేవలను దేశానికి చాటిచెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సమాజంలో చివరి వరుసలో ఉన్న వ్యక్తికి సైతం గౌరవం, సంక్షేమ ఫలాలు అందాలనే అంత్యోదయ స్ఫూర్తితో భారతీయ జనతా పార్టీ పనిచేస్తోందని తెలిపారు.
"ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు చూపించిన మార్గంలో నడుస్తూ, సమాజంలోని చివరి వ్యక్తి వరకు సేవలు అందించాలన్నదే నా లక్ష్యం. పరిశుద్ధ కార్మికుల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, వారి సంక్షేమం కోసం నా వంతు కృషి చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను" అని ఈర్ల రాజు ముదిరాజ్ స్పష్టం చేశారు.
రాబోయే రోజుల్లో కూడా పరిశుద్ధ కార్మికులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ, వారి కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారులతో మాట్లాడి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు.
"కార్మికుల చేతులు నగరాన్ని శుభ్రంగా ఉంచుతాయి.. వారి కుటుంబాల్లో చిరునవ్వులు నిలవడం సమాజం బాధ్యత. వారి కష్టాన్ని గుర్తించడం మాత్రమే కాదు, వారి జీవితాల్లో సంతోషాన్ని పంచుకోవడం కూడా మన కర్తవ్యం" అని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమం ద్వారా పరిశుద్ధ కార్మికుల పట్ల తనకున్న గౌరవాన్ని, ఆప్యాయతను చాటుకున్న ఈర్ల రాజు ముదిరాజ్‌ను కార్మికులు అభినందించారు.

ఈర్ల రాజు ముదిరాజ్
బీరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు

వావిలాల శివారులో మహిళ దారుణ హత్య

జిన్నారం అక్టోబర్ 22 వుదయం ప్రతినిధి)
గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని వావిలాల గ్రామ శివారులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన కలకలం రేపింది. సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి వయస్సు 35-45 ఏళ్ల మధ్య ఉంటుందని, ఆమె వివాహితగా పోలీసులు గుర్తించారు. మహిళ గొంతుపై రక్తపు మరకలు కనిపించడంతో దారుణ హత్యకు గురైనట్లు అనుమానిస్తూ పోలీసులు

దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పటాన్చెరువు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలిని ఎవరైనా గుర్తిస్తే జిన్నారం పోలీసులను 8712656750 సంప్రదించాలని కోరారు.

కోటిలో ఎఫ్ఎంజీ ఇంటర్‌న్‌ల ఆందోళన..
చిక్కడపల్లి పీఎస్‌కు తరలింపు!

- **న్యాయం అడిగితే అరెస్టులా? రూ.29,792 స్టైపెండ్ చెల్లించాలని డిమాండ్**

ముషీరాబాద్, అక్టోబర్ 22(వునదయం)
తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేపట్టిన ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ (ఎఫ్ఎంజీ) ఇంటర్‌న్‌లను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో గురువారం కోటిలోని డీఎంఈ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనలో పాల్గొన్న సుమారు 150-200 మంది ఇంటర్‌న్‌లను అదుపులోకి తీసుకుని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.అర్హులైన ఇంటర్‌న్‌లకు నెలకు రూ.29,792 స్టైపెండ్ చెల్లించాలని, జనవరి 2026నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపిన తమపై పోలీసుల చర్యను ఖండిస్తూ, "న్యాయం కోరితే అరెస్టులా?" అంటూ ప్రశ్నించారు.మాటల హామీలు కాకుండా, స్టైపెండ్ చెల్లింపులపై ప్రభుత్వం లిఖితపూర్వక ఉత్తర్వులు జారీ చేయాలని, నిరసనల్లో పాల్గొన్నందుకు ప్రతీకార చర్యలు తీసుకోవద్దని కోరారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆపేది లేదని ఎఫ్ఎంజీ ఇంటర్‌న్‌లు స్పష్టం చేశారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి..
రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలి..
అధికారులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచన
పోచారంలో వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం.. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.2,961 మద్దతు ధర..

పటాన్చెరు (వుదయం):
రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు.రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.ముత్తంగి డివిజన్ పరిధిలోని పోచారం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ముత్తంగి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో

కల్పించిన సదుపాయాలను పరిశీలించి, ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా..రైతులు పండించిన పంటను విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగాలని, రైతులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.
సన్న వడ్లకు క్వింటాలుకు రూ.2,961
ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ముత్తంగి చైర్మన్ బిక్షపతి, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, శివారెడ్డి, నరేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, రామచందర్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యువతి వేధింపుల వివాదం.. ఘర్షణలో డీఆర్‌డీఓ ఉద్యోగి మృతి!

- **చికిత్స పొందుతూ కన్నుమూత.. చిక్కడపల్లిలో కలకలం**

ముషీరాబాద్, అక్టోబర్ 22 (వుదయం):
హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి వేధింపుల ఆరోపణల నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణ విషాదాంతమైంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన డీఆర్‌డీఓ ఉద్యోగి రామ్మోహన్ (55) ఆసుప

త్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం వీధిలో నివాసముంటున్న రామ్మోహన్‌పై ఓ యువతిని వేధిస్తున్నాడనే ఆరోపణలు రావడంతో అభిజిత్ అనే యువకుడు ఆయనను ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. అభిజిత్ తోసేయడంతో రామ్మోహన్ తలకు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన రామ్మోహన్‌ను వెంటనే కాచిగూడలోని సీసీ షరాఫ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.
మృతుడి భార్య కాత్యాయిని ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువతి వేధింపుల ఆరోపణలు, ఘర్షణకు దారితీసిన పరిస్థితులు, రామ్మోహన్ మృతికి సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

KONICA MINOLTA Authorised Distributor
R.V. DIGITAL SOLUTIONS Pvt. Ltd.
TONER FREE
• Colour Copiers • B/W Digital Copiers
• Sales & Service • Rentals
• Consumables • Spares
#2-1-390/B/1, Sri Nilayam, Opp. Fever Hospital, Nallakunta, Hyderabad -44
Ph: +91 73311 82569, 98493 03489, Email: rvkm2016@gmail.com

IN THE COURT OF 2 nd ADDL. CHIEF JUDGE -CUM- MACT, CITY CIVIL COURTS. At :: Chatta Bazar, Hyderabad. MVOP No. 3130 of 2025
Between :
Umar Mohammad ....Petitioner / s.
AND
Prakash M, & Anothers ...Respondent / s.
To,
Rajesh Rathor, S/o:Lakhani Chand Lakhani Chand Rathore, Age: 41 Years,Occ: Driver, R/o:Plot No. 433, Viswakarma Colony, Dommarapochampally, Dundigal,Medchal,
Take this Notice that the petitioner herein has filed the above M.V.O.P. against you and another respondent by claiming compensation before the above mentioned Court. Hence the above M.V.O.P. is posted for your appearance and counter. If you fail to appear before the above mentioned Court on 06-11-2026 by 10.30 a.m., the matter will be decided in your absence.
(By Order of the Court)
At: Chatta Bazar, Hyderabad.
Date: 23-10-2026
Sd/-
PUTTA THIRUPATHI REDDY
(AP/52/1996)
MA (Eco), LLM (Con)
ADVOCATE
Flat No:1, Ravi Residency Apartment, H.No:13-4-48/F/1, Opp:Central Bank of India, left side to Rajadhani Theater, Vikas Nagar, Dilsukh Nagar, Hydrabad (Town & Dist.) Telangana (State), PIN:500060. Phone: 9440687160.
Mail id: putta.thirupathireddy@gmail.com

IN THE COURT OF THE PRL JUNIOR CIVIL JUDGE AT: RAJENDRANAGAR, O.S.NO. 632 of 2026
Between :
Allam Sreedhar Rao ... Plaintiff
AND
The Tahsildhar, Gandipet & another ... Defendants
To,
All Concerned
Please take notice the above named plaintiff has filed the above suit for declare him as legal heir of deceased Allam Venkat Rao and the same is posted on 02.11.2026 for appearance, if any person or persons having any objection/claim requested to appear either in person or through an Advocate before the above said court on 02.11.2026 at 10:30am, otherwise the matter will be decided in your absence as per law.
// By Order of the Court//
Sd/-
S.R.BIXAPATHI
Advocate
Flat No.306, Venkateshwara residency, RTC Colony, L.B.nagar, R.R.Dist
Cell. 9676489833

IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, HYDERABAD DISTRICT AT: HYDERABAD O.S. No. 2492 OF 2026
Between :
1. Smt. Gopi Tulasi Bai, W/o. Late Saraviah Gopi @ Sarwiah Gopi, Aged about 72 years, 2. Mr. Gopi Jaswanth Kumar, S/o. Late Saraviah Gopi @ Sarwiah Gopi, Aged about 52 years, 3. Smt. Gopi Annapurna, W/o. Mr. Venkata Ratnam Maddala, D/o. Late Saraviah Gopi @ Sarwiah Gopi, Aged about 50 years, and presently R/o. 7368 Briza Loop, San Ramon 94582, CA, USA., 4. Smt. Gopi Aparna, W/o. Mr. Praveen Darshanam, D/o. Late Saraviah Gopi @ Sarwiah Gopi, Aged about 48 years, (All above R/o. H. No. 10-2-317/27, Vijayanagar Colony, Asifnagar, Hyderabad, T.G -57. ...PLAINTIFFS
AND
1. TheTahsildar, Asif Nagar Mandal, Hyderabad District, T.G.,
2. All Concerned ...DEFENDANTS No.1 & 2
NOTICE
Please take notice that the Plaintiffs herein have filed the above suit seeking a declaration that Plaintiffs Nos. 1 to 4 are the legal heirs and successors of their deceased predecessor, Late Saraviah Gopi @ Sarwiah Gopi, S/o. Late Jamliah Gopi, who died intestate on 05-12-2025, leaving behind the Plaintiffs herein as his wife and children. If any person or persons claim to be the legal heir(s) or successor(s) of the deceased Late Saraviah Gopi @ Sarwiah Gopi, or have any objection to the grant of the declaration sought by the Plaintiffs, such person(s) may appear before the Hon'ble IX Junior Civil Judge, City Civil Court, Hyderabad District, at Hyderabad, either in person or through an Advocate, at 10:30 A.M. on 28-10-2026, and submit their objections along with relevant documentary evidence. Take further notice that, in the event of failure to appear and submit objections on the date and time specified above, the matter may be heard and decided in accordance with law, in your absence.
Given under my hand and the seal of the Court.
(BY ORDER OF THE COURT)
Sd/-
B. Hemanth Kumar (17819), Advocate
COUNSEL FOR THE PLAINTIFFS
Cell: +91 8008283837

"నక్సలిజాన్ని రూపుమాపినట్లే దేశం నుంచి మాదకద్రవ్యాల మహమ్మారిని కూడా తరిమేస్తాం. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. అన్ని రాష్ట్రాల పోలీసులు కలసికట్టుగా... రానున్న మ డేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొడతాం. డ్రగ్స్ వల్ల భవిష్యత్ తరాలు నాశనం కావడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. మాదక ద్రవ్యాలు భవిష్యత్ తరాలకు పెనుముప్పుగా మారాయి. అవి దేశ వ్యతిరేక కార్యకలాపాలకు ఆర్థిక ఆలంబన అందిస్తున్నాయి."

- అమిత్ షా, కేంద్ర మంత్రి

వే'మన' పద్యం

చిక్కియున్నవేళ సింహంబునైనను
బక్కకుక్క కరచి బాధచేయు
బలిమిలేనివేళ బంతంబు చెల్లదు
విశ్వదాభిరామ వినురవేమ



సంపాదకీయం

విదేశీ బొగ్గు ఎందుకు?

భారతదేశ విద్యుత్ రంగానికి బొగ్గు కీలక ఇంధనం. దేశీయ బొగ్గు ఉత్పత్తి గణనీయంగా ఉన్నప్పటికీ, విద్యుత్ కేంద్రాలు విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయన్న ది పరిశీలించాల్సిన అంశం. బొగ్గు నాణ్యత, సరఫరా సామర్థ్యం, విద్యుత్ డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిందే. అయితే, దేశీయ అవసరాలు తీర్చగల సామర్థ్యం ఉన్న సందర్భాల్లోనూ అధిక ధరల విదేశీ బొగ్గు కొనుగోళ్లను తప్పనిసరి చేసే విధానాల వెనుక ఉన్న ఆర్థిక హేతుబద్ధతను ప్రభుత్వం ప్రజలకు వివరించాలి.విద్యుత్ కేంద్రాలు నిర్దిష్ట శాతం విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై గతంలో పలు రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దిగుమతుల వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుందని, ఆ భారం చివరకు విద్యుత్ వినియోగదారులపై పడుతుందని ఆందోళన వ్యక్తమైంది. రాష్ట్రాల అభ్యంతరాలను పక్కనపెట్టి ఇటువంటి విధానాలను అమలు చేయడం సమాఖ్య స్ఫూర్తికి, ఆర్థిక బాధ్యతకు అనుగుణంగా ఉందా అన్నది ప్రశ్న.విదేశీ బొగ్గు దిగుమతులు, వాటి ధరల నిర్ణయం, సరఫరా ఒప్పందాల చుట్టూ గతంలో పలు తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా అదానీ గ్రూప్‌కు సంబంధించిన బొగ్గు వ్యాపార లావాదేవీలపై అంతర్జాతీయ మీడియా సంస్థలు, పరిశోధనాత్మక జర్నలిజం సంస్థలు పలు కథనాలను ప్రచురించాయి.ఇండోనేషియా నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన బొగ్గును భారతదేశానికి చేరేలోపు పత్రాల్లో అధిక ధరకు చూపించారనే ఓవర్ ఇన్వాయిసింగ్ ఆరోపణలు ఈ వ్యవహారంలో ప్రధానంగా చర్చకు వచ్చాయి. సింగపూర్, దుబాయ్ వంటి అంతర్జాతీయ వాణిజ్య కేంద్రాల్లోని మధ్యవర్తి సంస్థల ద్వారా ధరలను పెంచి చూపారన్న ఆరోపణలు కూడా పరిశీలనకు వచ్చాయి.ఈ ఆరోపణలు నిజమైతే, అది కేవలం ఒక వ్యాపార సంస్థకు సంబంధించిన వివాదం మాత్రమే కాదు. దేశ ఇంధన రంగంలో ధరల నిర్ణయం, దిగుమతుల పర్యవేక్షణ, ప్రభుత్వ నియంత్రణ వ్యవస్థల సమర్థతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తే అంశం. అయితే, ఆరోపణలు, దర్యాప్తు నివేదికల్లోని పరిశీలనలు, న్యాయస్థానాల్లో నిర్ధారణ అయిన వాస్తవాలు వేర్వేరు. అందువల్ల ఈ వ్యవహారంలో ప్రతి ఆరోపణను స్వతంత్రంగా పరిశీలించి, ఆధారాలతో నిజానిజాలను తేల్చడం అత్యవసరం.విదేశీ బొగ్గు దిగుమతులపై వివాదం కేవలం కొనుగోలు ధరలకే పరిమితం కాదు. అధిక ధరలకు ఇంధనాన్ని కొనుగోలు చేయాల్సి వస్తే విద్యుత్ ఉత్పత్తివ్యయం పెరుగుతుంది. ఆ వ్యయాన్ని విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, పంపిణీ సంస్థలు ఎంతకాలం భరించగలవు? ఆర్థిక లోటు పెరిగినప్పుడు దాని ప్రభావం ఎవరిపై పడుతుంది? ఇవే కీలకమైన ప్రశ్నలు. విద్యుత్ పంపిణీ సంస్థలు ఇప్పటికే అప్పులు, ఆదాయ లోటులు, నిర్వహణ వ్యయాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.. ఫలితంగా ఇంధన సర్దుబాటు చార్జీలు, విద్యుత్ టారిఫ్‌ల పెంపు వంటి చర్యల ద్వారా వినియోగదారులపై అదనపు భారం పడే ప్రమాదం ఉంది.తమిళనాడు, గుజరాత్ సహా వివిధ రాష్ట్రాల్లో విద్యుత్ కొనుగోళ్లు, బొగ్గు సరఫరా ఒప్పందాలు, చెల్లింపుల అంశాలు చర్చకు వచ్చిన నేపథ్యంలో, ప్రతి రాష్ట్రంలో ఆర్థిక ప్రభావాన్ని సంబంధిత గణాంకాలతో విడివిడిగా పరిశీలించాలి. వ్యవసాయ పంపింగ్, సూక్ష్మ పరిశ్రమలు, సేవా రంగాలపై కూడా పరోక్ష ప్రభావం పడవచ్చు.ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు అనుసరించే ఇంధన విధానాలకు ప్రజా ప్రయోజనాలే ప్రాతిపదిక కావాలి. ఏ సంస్థకైనా లాభాలు ఆర్జించే హక్కు ఉన్నప్పటికీ, ప్రజాధనంతో నడిచే కీలక రంగాల్లో ప్రభుత్వ నిర్ణయాలు కొందరు కార్పొరేట్ సంస్థలకు అసాధారణ ప్రయోజనాలు కల్పిస్తున్నాయన్న అనుమానాలకు తావివ్వకూడదు.బొగ్గు దిగుమతుల వ్యవహారంలో ఆరోపణలు వెల్లువెత్తినప్పుడు ప్రభుత్వాల బాధ్యత మరింత పెరుగుతుంది. దిగుమతుల అవసరాన్ని నిర్ధారించిన ప్రమాణాలేమిటి? విదేశీ బొగ్గు కొనుగోళ్లకు సంబంధించిన ధరలను ఎవరు పరిశీలించారు? . దేశ విద్యుత్ రంగ ఆర్థిక ఆరోగ్యానికి, వినియోగదారుల హక్కులకు సంబంధించిన మౌలిక ప్రశ్నలు. అవసరమైతే స్వతంత్ర దర్యాప్తు సంస్థలు, నియంత్రణ సంస్థలు, ఆడిట్ వ్యవస్థలు ఈ వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించాలి. తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. దేశ ఇంధన భద్రత పేరుతో తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజలకు ఆమోదయోగ్యమైన ఆర్థిక హేతువుతో ఉండాలి. స్వదేశీ బొగ్గు అందుబాటు, దిగుమతుల అవసరం, నాణ్యతా ప్రమాణాలు, ధరల వ్యత్యాసం, విద్యుత్ ఉత్పత్తి వ్యయం వంటి అంశాలపై సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం వెల్లడించాలి. రాష్ట్రాల అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తూ, వినియోగదారులపై అదనపు భారం పడకుండా ప్రత్యామ్నాయాలను పరిశీలించాలి. ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్నాయన్న అనుమానాలు ప్రజల్లో బలపడితే ప్రజాస్వామ్య వ్యవస్థలపై విశ్వాసం దెబ్బతింటుంది. అందుకే ఆరోపణలకు సమాధానం పారదర్శక విచారణ ద్వారానే రావాలి. వాస్తవాలను వెలికితీయడం, బాధ్యతను నిర్ధారించడం, ప్రజా ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వానికి తప్పనిసరి బాధ్యత.

రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

వేకువ కిరణాలు అక్షరాల అగ్నిధార అనుభూతుల అమృతధార"

కవిత్వం అనేది కేవలం పదాల సమాహారం కాదు; అది మానవ హృదయ స్పందనలకు, సామాజిక పరిణామాలకు, ప్రకృతి సౌందర్యానికి అక్షరరూపం. కవి తన అనుభవాలను, ఆలోచనలను, సమాజంలో తాను గమనించిన వైరుధ్యాలను కవిత్వంగా మలుస్తాడు. అందుకే కవిత్వం ఒకవైపు భావుకతకు ఆలవాలమైతే, మరోవైపు సామాజిక చైతన్యానికి వేదికగా నిలుస్తుంది. సమకాలీన కవుల రచనలను పరిశీలించినప్పుడు మానవీయ విలువలు, కుటుంబ అనుబంధాలు, స్త్రీశక్తి, సామాజిక అసమానతలు, రాజకీయ విమర్శ, ప్రకృతి పరిరక్షణ వంటి విభిన్న అంశాలు ప్రతిఫలిస్తాయి.శ్రీరామ్ కవచం వెంకటేశ్వర్లు సద్గుణాల ప్రాధాన్యాన్ని చాటిచెప్పగా, జూలూరి గౌరీశంకర్ తన 'శూన్యానికి మందు' కవితలో వ్యక్తిత్వాన్ని కోల్పోయే అధికార వ్యామోహాన్ని ప్రశ్నించినట్లు కనిపిస్తుంది. ఈ కవితా భావనలు మనిషి విలువ అతని పదవిలోనో, సంపదలోనో కాకుండా నైతిక ప్రవర్తనలో ఉంటుందని తెలియజేస్తాయి. కవిత్వం వ్యక్తిలో ఆత్మపరిశీలనను కలిగించి, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించాలి అనే సాహిత్య ప్రయోజనాన్ని ఇవి గుర్తుచేస్తాయి. ప్రకృతి చిత్రణలో తుమ్మ రాజా పల్లె అందాలను ఆత్మీయంగా ఆవిష్కరించగా, బుర్ల నాగేశ్వరరావు వసంత ఋతువును కొత్త ఆశలకు, నూతనోత్సాహానికి ప్రతీకగా నిలిపారు. చించాపట్నం రజినీకాంత్ ఆచార్య ఉగాది కవిత్వంలో ప్రకృతి సౌందర్యాన్ని పండుగ సంస్కృతితో అనుసంధానించారు. ఈ కవిత్వంలో దృశ్యాత్మకత, భావుకత, స్థానిక జీవన సంస్కృతిపై మమకారం ప్రధాన లక్షణాలుగా కనిపిస్తాయి. ప్రకృతి కేవలం అందాల వస్తువు మాత్రమే కాకుండా మానవ మనుగడకు ఆధారమనే భావన కూడా అంతర్లీనంగా వ్యక్తమవుతుంది.తల్లిదండ్రుల అనుబంధాలను చిత్రించిన కవిత్వం భావోద్వేగ సాంద్రతతో పాఠకుల హృదయాలను స్పృశిస్తుంది. వేముల వెంకటేశ్వర్లు తల్లి ప్రేమను అంతులేని అనురాగంగా అభివర్ణించగా, జార్జి మాదుగుల మాతృత్వంలోని త్యాగాన్ని, బాధను ప్రశ్నాత్మకంగా ఆవిష్కరించారు. జె.ఎస్. రవిచందర్ తండ్రి త్యాగాన్ని బిడ్డ ఎదుగుదలకు అందించే చేయూతగా చిత్రించారు. ఈ కవితల్లోని ఆత్మీయత కుటుంబ బంధాల విలువను గుర్తుచేస్తుంది. భావోద్వేగాన్ని సామాజిక స్పృహతో మేళవించడం వీటి ప్రత్యేకత.స్త్రీశక్తిని ప్రతిబింబించే కవిత్వం మహిళల సృజనాత్మకతను, సమాజ నిర్మాణంలో వారి పాత్రను గుర్తిస్తుంది. అయితే స్త్రీని కీర్తించడం మాత్రమే కాకుండా, ఆమెకు సమాన హక్కులు, గౌరవం, స్వాతంత్ర్యం కల్పించాల్సిన అవసరాన్ని కూడా ఈ రచనలు పరోక్షంగా గుర్తుచేస్తాయి.

అదే విధంగా తెలంగాణ రాజకీయ పరిస్థితులపై స్పందించిన కవులు ప్రజల ఆశలు, నిరాశలు, అసంపూర్ణ ఆకాంక్షలకు అక్షరరూపం ఇచ్చారు. ఈ విమర్శనాత్మక దృక్పథం కవిత్వాన్ని సమకాలీన జీవితానికి సన్నిహితంగా నిలుపుతుంది.కులవివక్ష, మతభేదాలు, ఆర్థిక అసమానతలపై స్పందించిన కవిత్వం మానవ సమానత్వానికి ప్రాధాన్యమిస్తుంది. మధ్యలో చిన్నప్ప పుట్టుక ఆధారంగా మనిషిని తక్కువగా చూడటంలోని అన్యాయాన్ని ప్రశ్నించారు. కడారు సైదులు అంబేద్కర్ రాజ్యాంగ భావజాలాన్ని గుర్తుచేస్తూ సామాజిక న్యాయం, సమానత్వం వంటి విలువలకు ప్రాధాన్యమిచ్చారు. పుప్పాల కృష్ణమూర్తి కూలి తల్లి ఆర్తిని, మూగజీవి వేదనను కవిత్వంలో ప్రతిబింబించడం ద్వారా కరుణ, సహానుభూతి పరిధిని విస్తరించారు. ఇక్కడ కవిత్వం బాధను వర్ణించే కళగా మాత్రమే కాకుండా, అన్యాయాన్ని గుర్తించే సామాజిక సాధనంగా ఎదుగుతుంది.ఆధునిక జీవన విధానంలోని సంక్లిష్టతలను కూడా సమకాలీన కవులు విస్మరించలేదు. ఉయ్యాల నరసయ్య పట్టణ జీవితంలోని యాంత్రికతను చిత్రించగా, కొండ్లె రవికుమార్ చరవాణి వినియోగం మానవ సంబంధాలపై చూపుతున్న ప్రభావాన్ని ప్రశ్నించారు. కవి సోమిరెడ్డి కార్పొరేట్ విద్యా విధానంలో బాల్యం కోల్పోతున్న పరిస్థితిని ప్రస్తావించారు. ఈ కవితా భావనలు సాంకేతిక అభివృద్ధి, విద్యా పోటీ మధ్య మానవీయత, సృజనాత్మకత, సహజ జీవనానుభవాలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తాయి. శిల్పపరంగా పరిశీలిస్తే ఈ కవిత్వంలో రూపకాలు, ప్రతీకలు, భావోద్వేగ వ్యక్తీకరణ, ప్రశ్నార్థక శైలి ప్రధానంగా కనిపిస్తాయి. 'పురిటి నొప్పులు', 'నిప్పు రవ్వ', 'జ్ఞానదీపం' వంటి ప్రతీకలు విస్తృతమైన భావాలను సంక్షిప్తంగా వ్యక్తపరుస్తాయి. అయితే కవిత్వం నినాదానికి పరిమితం కాకుండా భావగాఢత, భాషా సహజత్వం, శిల్పసౌందర్యం కలిగినప్పుడు మరింత ప్రభావవంతమవుతుంది.

మంత్రి ప్రగడ భరతరావు గారు 'తిలకం' పేరుతో అందించిన ముందు మాటలో వసంత ప్రకృతి వైభవాన్ని, కోకిల గాన మాధుర్యాన్ని, 1960వ దశకంలో కోదాడ పురంలో శారద సంగీత సమైక్య, శారద సాహిత్య సమైక్య వేదికల ద్వారా సంగీత సాహిత్య రంగాలలో సాధించిన సాంస్కృతిక వికాసాన్ని స్మరింపజేశారు. మరోవైపు ప్రముఖ విశ్లేషకులు పద్మ నాగేశ్వర రావు పోతుగంటి గారు తమ ముందు మాటలో అక్షరాన్ని ఆయుధంగా మలచుకొని, అన్యాయాలపై అక్షరాగ్నిని కురిపిస్తూ, సామాన్యుల కష్టాలను సహానుభూతితో చిత్రిస్తూ, ప్రకృతిపై ప్రేమను చాటుతూ, లోకకళ్యాణమే లక్ష్యంగా కవిత్వ సేద్యం చేసే కవి యాదన్న గారి సాహిత్య వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు. "పుస్తకం అమ్మ వంటిది, చదివితే కమ్మగుంటది" అనే భావనతో పుస్తక పఠనంలోని మాధుర్యాన్ని గుర్తు చేశారు.వేకువ కిరణాలుగా ఉదయించిన ఈ సాహిత్య వెలుగులు పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి, సమాజ ప్రగతికి దారిచూపే అక్షర దీపాలుగా వెలుగొందాలని ఆకాంక్షిద్దాం.సమకాలీన కవుల కలాలు సమాజంలోని సౌందర్యాన్ని మాత్రమే కాకుండా, దాని వైరుధ్యాలను, బాధలను, మార్పు ఆకాంక్షలను కూడా ప్రతిబింబిస్తున్నాయి. వారి కవిత్వంలో మానవీయత, ప్రకృతి ప్రేమ, సామాజిక న్యాయం, కుటుంబ అనుబంధాలు పరస్పరం మిళితమై ఉన్నాయి. అందువల్ల ఈ కవిత్వం సాహిత్యానుభూతిని అందించడమే కాకుండా పాఠకుడిలో ప్రశ్నించే తత్వాన్ని, ఆలోచించే శక్తిని, మార్పును కోరుకునే చైతన్యాన్ని పెంపొందిస్తుంది.మనసును తాకి, మేధస్సును మేల్కొలిపి, మానవత్వాన్ని వెలిగించేదే సార్థకమైన కవిత్వం.

డా.పుసపాటి వేదాద్రి
9912197697

బహుముఖ ప్రజ్ఞాశాలి న్యాయపతి కామేశ్వరి

న్యాయపతి కామేశ్వరి, రాఘవరావుల గురించి ఈ తరం వారికి ఎక్కువగా తెలియక పోవచ్చు. రేడియో ప్రధాన ప్రసార సాధనంగా, తెలుగు ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకు పోయిన రోజులలో రేడియో 'అక్కయ్య, అన్నయ్య'లుగా ప్రసిద్ధులైన వారిద్దరు, ఆంధ్ర బాలానంద సంఘం పేరుతో 193940 నుండి 1955 56 ప్రాంతం వరకు మద్రాసు, ఆ తరువాత హైదరాబాదు నుండి తెలుగులో బాలల సాహిత్యానికి చేసిన కృషి అనన్య సామాన్యం. ప్రత్యేకంగా వాళ్లిద్దరు కలిసి చేసిన రేడియో కార్యక్రమాలు కొ న్ని అజామరాలుగా నిలిచి పోయాయి. వారు రాసి కొంత వరకు బాణీలు కట్టిన కొన్ని పాటలు కంప్యూటర్.ఎం.వి సంస్థ ద్వారా రికార్డులుగా వెలువడ్డాయి.రేడియో అక్కయ్యగా పేరుపొందిన న్యాయపతి కామేశ్వరి (1908 1980) విజయ నగరంలోని 1908లో పండితుల, విద్వాంసుల కుటుంబంలో జన్మించారు.ప్రాథమిక విద్యాభ్యాసం తరువాత విశాఖ పట్నం లోని క్వీన్ మేరీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివారు. తిరిగి విజయనగరం మహారాజా కళాశాలలో డిగ్రీ 1932లో పూర్తిచేశారు. ఆ కాలంలో బి.ఎ. ఉత్తీర్ణులైన మొట్టమొదటి మహిళ ఆమే. తరువాత కొంతకాలం నూజివీడు ఎస్టేటులో కపిలేశ్వరపురం జమిందారిణి జగదీశ్వరమ్మలు ఇంగ్లీషు నేర్పారు. 1934లో న్యాయపతి రాఘవరావును వివాహం చేసుకున్నారు. తరువాత 1937లో మద్రాసులోని వెల్లింగ్టన్ టీచర్ ట్రైనింగ్ కాలేజీ లో ఉపాధ్యాయ శిక్షణ (ఎల్.టి.) పూర్తిచేశారు. ఇద్దరి అభిప్రాయాలు కలియడంతో

ప్రాథమిక విద్యాభ్యాసం తరువాత విశాఖపట్నం లోని క్వీన్ మేరీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివారు. తిరిగి విజయనగరం మహారాజా కళాశాలలో డిగ్రీ 1932లో పూర్తిచేశారు.

భర్తకుతోడుగా, చెన్నై రేడియో కార్యక్రమాలలోను, బాల పత్రిక నిర్వహణలోను ఆమె చురుగ్గా పాల్గొన్నారు.చెన్నై ఆకాశవాణి కేంద్రం వారు ఆటవిడుపు పేరుతో పిల్లల కార్యక్రమ నిర్వహణ చేపట్టి, ఆ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను న్యాయపతి దంపతులకు అప్పగించారు. ఆ విధంగా ఆమె రేడియో అక్కయ్యగా స్థిర పడి పోయారు. రాఘవరావు ఈమెతో పాటుగా రేడియో కార్యక్రమాన్ని నిర్వహిస్తూం డటంతో, ఆయనకు రేడియో అన్నయ్యగా పేరొచ్చింది. తరువాత ఈ కార్యక్రమం బాలానందంగా రూపాంతరం చెంది ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ద్వారా పలు సంవత్సరాలు వారిద్దరిచే నిర్వహించడం జరిగింది.ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో న్యాయపతి కామేశ్వరి స్త్రీల కార్యక్రమాలకు ప్రయోక్తగా పని చేసేవారు. ఆకాశవాణి హైదరాబాద్ లో పనిచేస్తున్న కామేశ్వరి రేడియోకు అటు పత్రికలకు, రంగస్థలానికి అనేక నాటికలు, కథలు, గేయాలు రాసేవారు. చాలా మంది బాలలను నటులగా, కళాకారులుగా తీర్చిదిద్దారు. అనేక పల్లె ప్రాంతాలలో రేడియో మహిళా మండలలు ఏర్పాటు కావడానికి కృషి చేశారు. పేద మధ్య తరగతి మహిళల అభ్యున్నతికి పాటుపడిన స్త్రీ న్యాయపతి కామేశ్వరి. ఆనాటి కేంద్ర ప్రసారశాఖ మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ప్రశంసలను కూడా ఈమె అందుకున్నారు. బొమ్మల కొలువులు ఉత్సవాలు విహార యాత్రలు నిర్వహించే వారు. సామాజిక స్పృహ కలిగించేవిగా ఉండే ఆమె రచనలలో సహజత్వం ఉట్టిపడేలా ఉండి, సజీవ రూపాలుగా రూపు దిద్దు కున్నవి. కథలు బాలలకు సులభంగా అర్థమై పోతాయి. ఈమె రాసిన కథల్లో "అనగనగా ఆకలి కథ, ఇల్లు ఇరకాటం, ఆ చంద్రం, దోమ కోతి, తాత అవ్వ కథ, అమ్మమ్మ బహుమానం, "కోతి చేష్టలు", నాలుగు ఏనుగుల కథలు ముఖ్యమైనవి. కామేశ్వరి వ్రాసే నాటికలలో ఉన్న పాత్రలు అన్నీ ఆడపిల్లల పాత్రలే ! పిల్లలను చేరదీసి మంచి అలవాట్లు ఏవో, చెడు అలవాట్లు ఏవో కామేశ్వరి విడ మరిచి చెప్పేవారు. ఆంధ్ర బాలానంద సంఘం కార్యక్ర మాల కోసం తన సొంత భవనాన్ని దారాదత్తం చేశారు. కామేశ్వరి ఆశయాల మేరకు మర్రి చెన్నారెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో జవహర్ బాల భవన్ ఏర్పాటు చేశారు. మండలి వెంకట కృష్ణారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు కామేశ్వరరావు కోరిక మేరకు ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ స్థాపన జరిగింది.1975లో తొలి అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగిన సందర్భంగా బాల సాహిత్యానికి చేసిన సేవలకు గాను ఆమెను ఘనంగా సత్కరించడమే గాక 1978లో "బాలబంధు" బిరుదుతో ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ వారు సత్కరిం చారు.1981లో కామేశ్వరి రచనలను అన్నింటినీ కలిపి " భోగి పళ్ళు " అనే సంకలనంగా తెచ్చారు. బాలానంద మహోద్యమానికి భర్త న్యాయపతి రాఘవ రావుకు సర్వవిధాలా సహకరిం చిన కామేశ్వరి తన 72వ ఏట 1980 అక్టోబర్ 23వ తేదీన ఈ లోకం వదిలి వెళ్లారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

డ్రైవర్లను గౌరవిద్దాం, ప్రయాణాన్ని ఆస్వాదిద్దాం !

వాహన డ్రైవర్లు లేదా సారథులు ప్రపంచ లాజిస్టిక్స్, ప్రజా రవాణా, రోజువారీ ఆర్థిక కార్యకలాపాలకు పునాది వంటివారు. కేవలం వాహనాన్ని నడపడానికే పరిమితం కాకుండా, వృత్తి నైపుణ్యం కలిగిన డ్రైవర్లు మానవ ప్రాణాలను కాపాడటం, వాణిజ్యాన్ని కొనసాగించడం, ప్రజా మౌలిక సదుపాయాలను సక్రమంగా వినియోగించడం వంటి అపారమైన బాధ్యతను మోస్తారు.ప్రతిరోజూ ప్రజలతో పాటు వస్తువుల సురక్షిత రవాణాను నిర్ధారించే మన డ్రైవర్ల అమూల్యమైన సేవలను గౌరవించడానికే 8వ జాతీయ సారథుల లేదా డ్రైవర్ల దినోత్సవం (నేషనల్ సారథి సమ్మాన్ దివస్) 2026ను జరుపుకుంటున్నాము. వాహన సారథుల అంకితభావాన్ని గుర్తించడానికి, రహదారి భద్రతను ప్రోత్సహించడానికి, సురక్షితమైన, మాదకద్రవ్య రహిత సమాజం కోసం మనందరి సమిష్టి బాధ్యతను పునరుద్ఘాటించడానికి మనమందరం ఏకమవుదాం. మన రవాణా వ్యవస్థకు వెన్నెముక అయిన డ్రైవర్లను అభినందిస్తూ, మరింత సురక్షితమైన మరియు బాధ్యతాయుతమైన డ్రైవర్ల కోసం కలిసి పనిచేయడానికి, జాతీయ సారథి సమ్మాన్ దివస్2026 యొక్క ఇతివృత్తం "డ్రైవర్లను గౌరవించండి, ప్రయాణాన్ని ఆస్వాదించండి" పాటించడం గత ఎనిమిదేళ్లుగా నిర్వహించుకుంటున్నాం.

దేశ్ కే సూపర్ సారథి లేదా డ్రైవర్: భారతదేశ వస్తువులు, సరఫరా గొలుసులను నిరంతరాయంగా నడిపించే చోదకులను గుర్తించి, న్యూస్18 నెట్‌వర్క్ టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ సంయుక్తంగా ఢిల్లీలో అక్టోబర్ 23వ తేదీని "జాతీయ సారథి (సమ్మాన్) దివస్"ను జరుపుకునే కార్యక్రమాన్ని ప్రకటించాయి. "దేశ్ కే సూపర్ సారథి" ప్రచారంలో భాగంగా ఢిల్లీలో జరిగిన ఈ డ్రైవర్ల సదస్సు, భారతదేశ లాజిస్టిక్స్ వ్యవస్థలో సానుభూతి పాత్రను పరిశ్రమ, రవాణా రంగ భాగస్వాములు పరిశీలించడం, డ్రైవర్ల సంక్షేమం, రహదారి భద్రత, వారి గౌరవంపై దృష్టి సారిస్తుంది. ఇది ట్రక్ డ్రైవర్ల భద్రత, ఆరోగ్యం, సముచిత గౌరవాన్ని చర్చించుట కేంద్రంగా తీసుకొని, దేశ రవాణా మరియు లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌కు వారి సహకారంపై మరింత దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు జరగడం హర్షణీయం. సురక్షితమైన పని పరిస్థితులు, సమ్మిళితత్వం, డ్రైవర్ల సంక్షేమం, వ్యాపార వృద్ధిలో సానుభూతి పాత్ర వంటి అంశాలపై చర్చించడానికి ఈ రోజు ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమ నాయకులు, రవాణా రంగ భాగస్వాములు ఒకచోట చేరారు.వాహన డ్రైవర్ల ప్రాముఖ్యత, సవాళ్లు : డ్రైవర్లు ప్రజా భద్రతకు సంరక్షకులు, వాణిజ్య, రవాణా వ్యవస్థలకు జీవనాధారం, ఆర్థిక, ఆస్తి సామర్థ్యానికి సారథులు, సాంస్కృతిక, పర్యాటక రాయబారులు. రోడ్డుపై డ్రైవర్లు ఎక్కువ గంటలు పనిచేయడం, వారికి తగినంత విశ్రాంతి, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండటం, కంటిచూపు, మొత్తం ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం వంటివి చాలా అవసరం. డ్రైవర్ల సామర్థ్యం, వారి పట్ల సానుభూతి పెంచడమే నిజమైన పురోగతి. ఇది భారతదేశ డ్రైవర్లు లేదా సారథుల కోసం సురక్షితమైన, మరింత సమ్మిళితమైన, గౌరవప్రదమైన భవిష్యత్తును నిర్మిస్తుంది. ఒక డ్రైవర్ యొక్క శారీరక, మానసిక దృఢత్వం ప్రజా భద్రతతో నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. గణాంకాల ప్రకారం, 90 శాతానికి పైగా రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదం లేదా డ్రైవర్ల చెడు ప్రవర్తన వల్లే జరుగుతున్నాయని తెలపడం విచారకరం. నైపుణ్యం గల డ్రైవర్లు తమ వ్యక్తిగత భద్రతను, తోటి ప్రయాణికుల భద్రతను, ఆత్మవిశ్వాసంతో కూడిన నిర్ణయాలను, ఒత్తిడి తగ్గింపును నిర్ధారిస్తారు. అందువల్ల, వారి సహనానికి, నైపుణ్యానికి, వాహనాన్ని సురక్షితంగా నడపడానికి డ్రైవర్ల సంఘానికి కృతజ్ఞతలు చెప్పడం మన కనీస కర్తవ్యం. మంచి డ్రైవింగ్ అనేది చూడటం, ఆలోచించడం, ఆచరించడం వంటి కార్యకలాపాల కలయికతో కూడి ఉంటుంది. ఒక మంచి డ్రైవర్ యొక్క లక్షణాలలో విద్య, యాంత్రిక పరిజ్ఞానం, బాధ్యత, ఏకాగ్రత, ముందుచూపు, సహనం, ఆత్మవిశ్వాసం వంటి అంశాలు ఉంటాయి.

మధుసూదన్ రెడ్డి
9949700037

ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్‌జంగిల్‌జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం.

గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబు పై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.కొమురం భీం స్ఫూర్తితో...దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు

జాతీయం-అంతర్జాతీయం

దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధం కావాలి

న్యూఢిల్లీ, అక్టోబరు 22 (ఎ.ఎం.ఎస్)ః
భారత్ అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తుందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం కుదుర్చుకుంటే దేశంలోని లక్షలాది మంది రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని హెచ్చరించింది. రైతు వ్యతిరేక ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్ణయిస్తే దేశవ్యాప్తంగా దీర్ఘకాలిక ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఎఐకెఎస్ ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటన, ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు జరుగుతున్న చర్చలు ఈ ఆందోళనలకు కారణమని కిసాన్ సభ పేర్కొంది. ఒప్పంద వివరాలను పార్లమెంటుకు వెల్లడించకుండానే చర్చలు కొనసాగించడం ప్రజాస్వామ్య పారదర్శకతకు విరుద్ధమని విమర్శించింది. అమెరికా పాల ఉత్పత్తులను భారత మార్కెట్లోకి అనుమతించే అంశం ఒప్పందానికి ప్రధాన అడ్డంకిగా ఉందని రూబియో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది. ఒప్పందానికి సంబంధించిన చట్టపరమైన ముసాయిదా రూపకల్పన తుది దశలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా ప్రకటించారని తెలిపింది.

సోయా, పామాయిల్ రైతులకు నష్టం

ఖరీఫ్ సీజన్‌లో సోయాబీన్ పంట కోతలు ప్రారంభమైన సమయంలోనే ముడి సోయాబీన్ నూనె, పామాయిల్‌పై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడాన్ని కిసాన్ సభ తప్పుబట్టింది. శుద్ధి చేసిన నూనెలపైనా సుంకాలను తగ్గించిందని, ఈ చర్యలు దేశీయ రైతులకు నష్టం కలిగిస్తాయని పేర్కొంది. అమెరికాలో పారిశ్రామిక స్థాయిలో వ్యవసాయం చేసే ఉత్పత్తిదారులకు భారీగా సబ్సిడీలు లభిస్తున్నాయని, వారితో భారతీయ సోయాబీన్ రైతులు పోటీపడటం కష్టమని తెలిపింది. దిగుమతులపై మరిన్ని సడలింపులు కల్పిస్తే మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లోని సోయాబీన్ రైతులు తీవ్రంగా ప్రభావితమవుతారని హెచ్చరించింది.

పాల రైతుల ఆదాయానికి గండి

అమెరికా పాల ఉత్పత్తులకు భారత మార్కెట్‌ను నియంత్రణలు లేకుండా తెరిస్తే దేశీయ పాడి రైతుల రోజువారీ ఆదాయం దెబ్బతింటుందని ఎఐకెస్ పేర్కొంది. భారీ సబ్సిడీలు పొందుతున్న విదేశీ ఉత్పత్తిదారులు తక్కువ ధరలకు ఉత్పత్తులను విక్రయించగలరని, దీనివల్ల దేశీయ పాల సేకరణ ధరలు తగ్గే ప్రమాదం ఉందని తెలిపింది. దీని ప్రభావం పాల ఉత్పత్తిపై ఆధారపడిన గ్రామీణ కుటుంబాల జీవనోపాధిపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. మొక్కజొన్న, జొన్నవంటి పశువుల దాణా పంటలు పండించే రైతులు, పత్తి రైతులతోపాటు బాదం, వాల్‌నట్, యాపిల్ సాగుదారులూ నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంది. అమెరికాకు వ్యవసాయ రంగంలో అధిక రాయితీలు కల్పించడం వల్ల భారత వ్యవసాయ మార్కెట్‌లో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం పెరుగుతుందని విమర్శించింది.

పోరాటానికి సమాయత్తం కావాలి

దేశ వ్యవసాయ రంగాన్ని పరిరక్షించి రైతుల ఆదాయానికి భరోసా కల్పించాల్సిన సమయంలో కేంద్ర ప్రభుత్వం విదేశీ వాణిజ్య ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తోందని ఎఐకెస్ విమర్శించింది. దేశీయ రైతుల ప్రయోజనాలను పరిరక్షించే విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేసింది. అమెరికా ప్రయోజనాలకు అనుకూలంగా, రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఒప్పందం కుదుర్చుకుంటే రైతాంగం నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని హెచ్చరించింది. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా దీర్ఘకాలిక పోరాటానికి అన్ని స్థాయుల్లోని రైతు సంఘాలు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఈ నెల 23న ఢిల్లీలో నిర్వహించనున్న మార్చ్‌లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎఐకెఎస్ కోరింది.

హర్మూజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై దాడి..

ఇరాన్ వెల్లడి

టెహ్రాన్ :
హార్మూజ్ జలసంధిలో ఏడు చమురు ట్యాంకర్లు దాడులకు గురయ్యాయని అధికారులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి ఏడు చమురు ట్యాంకర్లు దాడులకు గురయ్యాయని, సముద్ర మందుపాతరలను ఢీకొన్నాయని ఇరాన్ మీడియా తెలిపింది. దీంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమయ్యాయని వెల్లడించింది. ఫిబ్రవరి 28 న ఇరాన్ యుద్ధం మొదలైనప్పటి నుండి హార్మూజ్ జలసంధిలో ఒకే రోజు ఇన్ని నౌకలు దెబ్బతినడం ఇదే మొదటిసారి. ఈ వార్త వాస్తవమైతే.. ఈ జలమార్గంలో ఒకే రోజులో అత్యధిక సంఖ్యలో నౌకలు దెబ్బతిన్న ఘటన ఇదే కానుందని తెలిపింది.

చమురును తరలిస్తున్న నాలుగు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకోవడంతో అవి మంటల్లో చిక్కుకున్నాయని రివల్యూషనరీ గార్డ్ నావికాదళం ప్రకటనను ఉటంకిస్తూ, ఇరాన్ నివేదిక పేర్కొంది. మరో మూడు నావికా మందు పాతరలను ఢీకొనడంతో దెబ్బతిని నిలిచిపోయాయని తెలిపింది. అయితే ప్రాణనష్టం, ట్యాంకర్ల జెండాల గురించిన వివరాలను ఈ నివేదిక వెల్లడించలేదు. హార్మూజ్ జలసంధిలో చట్టవిరుద్ధ మార్గాల ద్వారా చమురు ట్యాంకర్ల రవాణాకు అమెరికా యత్నిస్తే.. ఆ ప్రాంతంలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని ఆ నివేదిక హెచ్చరించింది.

కొత్తగా సర్కాడియన్ డిప్రెషన్

దిల్లీ అక్టోబరు 22 (ఎ.ఎం.ఎస్)ః
శరీరంలో నిద్రమేలుకువ చక్రాలను నియంత్రించే 24 గంటల అంతర్గత గడియారంతో ముడిపడి ఉన్న కొత్త తరహా డిప్రెషన్ (మానసిక కుంగుబాటు)ను ఒక జన్యుపరమైన విశ్లేషణతో గుర్తించారు. దీనిని సర్కాడియన్ డిప్రెషన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆస్ట్రేలియన్ జెనెటిక్స్ ఆఫ్ డిప్రెషన్ స్టడీ నుంచి తీసుకున్న సమాచారాన్ని ఉపయోగించి, పరిశోధకులు డిప్రెషన్‌తో బాధపడుతున్న 10,000 మందికి పైగా వ్యక్తులపై క్లినికల్, జన్యుపరమైన విశ్లేషణను నిర్వహించారు. ''మా పరిశోధన సర్కాడియన్ డిప్రెషన్‌ను ఒక కొత్త ఉపరకంగా గుర్తించింది, ఇది మా అధ్యయనంలో దాదాపు నాల్గవ వంతు మందిని ప్రభావితం చేస్తోంది'' అని సిడ్నీ విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యయనకర్త ఎమిలియానా టోనిని చెప్పారు. దీనివల్ల ఎక్కువసేపు నిద్రపోవడం, మేల్కొన్నప్పుడు చాలా అలసటగా అనిపించడం, రాత్రిపూట ఎక్కువగా మెలకువగా ఉండటం వంటి లక్షణాలు ఏర్పడతాయి. డిప్రెషన్‌కు వాడే సాధారణ సెరటోనిన్‌ఆధారిత యాంటీ డిప్రెసెంట్‌లకు సర్కాడియన్ డిప్రెషన్ లొంగదు. పైగా ఎక్కువ దుష్ప్రభావాలు కనిపిస్తాయని పరిశోధకులు తెలిపారు. అయితే ఇది మెలటోనిన్, మెలటోనిన్‌లక్షిత యాంటిడిప్రెసెంట్‌లు, లైట్ థెరపీ వంటి చికిత్సలకు ఈ తరహా డిప్రెషన్ బాగా ప్రతిస్పందిస్తుందని పరిశోధకులు తెలిపారు. సర్కాడియన్ డిప్రెషన్ ఉన్నవారు చిన్నతనంలోనే మానసిక కుంగుబాటును అనుభవించే అవకాశం ఎక్కువగా ఉందనీ, వారిలో ఉన్మాదం, ఆత్మహత్య ఆలోచనల వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయనీ పరిశోధక బృందం కనుగొంది. ఈ రోగులు కణజాల వాపు, హృదయ సంబంధ ఆరోగ్య సమస్యలు, నాడీసంబంధ రుగ్మతలకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందని పరిశోధకులు తెలిపారు.

ఇండియన్ క్రిమినల్ గ్రూప్' వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం

ఐరాసకు భారత్ గట్టి కౌంటర్!
ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదిక తప్పులతడకగా ఉందని భారత్ తీవ్రంగా ఖండించింది. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం గురించి చేసిన ప్రస్తావనలు తోసిపుచ్చింది. దావూద్ డీకంపెనీ 'భారత్‌కు చెందిన క్రిమినల్ గ్రూప్' అని పేర్కొనడంపై మండిపడింది. ఈ మేరకు ఐరాస (UN)లో భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ రఘూ పూరి మాట్లాడారు.అల్‌ఖైదాతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై 2003లో భారత దేశానికి చెందిన డీకంపెనీ నాయకుడిని ఐరాస భద్రతా మండలి అంతర్జాతీయ ఉగ్రవాది జాబితాలో చేర్చింది. ఆ ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదికలో ఈ మాట భారత్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. '' మా

దేశం గురించి ప్రస్తావించిన కొన్ని తప్పులను మీ ముందు ఉంచుతున్నాం. 'డీ కంపెనీ' అంటూ మీరు ప్రస్తావించిన వాక్యాన్ని విడిగా చదివితే.. వాస్తవాలకు విరుద్ధమైన అర్థం వస్తుంది. 1993లో జరిగిన ఉగ్రదాడులకు సంబంధించి ఆ నేర సంస్థ, ఆ నాయకుడు భారత్‌లో మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. ఈ వాస్తవాన్ని ప్రస్తావించకపోవడం విచారకరం. ప్రత్యేక పదవులను చేపట్టిన వారి నుంచి ఇలాంటి అసమర్థ వ్యాఖ్యలు ఐరాసకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి.వాస్తవం ఏంటంటే.. 2003లో ఐరాస అతడిని ఉగ్రవాది జాబితాలో చేర్చకముందే భారత్ నుంచి పారిపోయాడు. అల్‌ఖైదా, ఒసామా బిన్‌లాడెన్‌తో ఉన్న సంబంధాల కారణంగా అతడిని ఆ జాబితాలో చేర్చింది. అప్పుడు అతడు భారత్‌లో లేడు. బిన్‌లాడెన్ ఎక్కడైతే నక్కి, ప్రాణాలు కోల్పోయాడో.. దావూద్ ఇబ్రహీం కూడా ఆ దేశంలోనే ఉన్నాడని ఐరాస జాబితాను బట్టి స్పష్టమవుతోంది'' అని రఘూపూరి తేల్చిచెప్పారు. 2001లో అమెరికాలో మారణహోమం సృష్టించిన బిన్‌లాడెన్‌కు పాకిస్థాన్ ఆశ్రయం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ దేశంలో అగ్రరాజ్యం నిర్వహించిన ఆపరేషన్‌లో లాడెన్ హతమయ్యాడు.

అంతర్జాతీయంగా నిలిచిన వెబ్‌సైట్లు.

వాషింగ్టన్
ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లోని ప్రభుత్వ, వ్యాపార సంస్థలకు చెందిన వెబ్‌సైట్లు నిలిచిపోయాయి. కీలకమైన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ జారీ కావడంతో సైబర్ దాడుల నుంచి తమ వ్యవస్థలను రక్షించుకునేందుకు ఆయా దేశాలు తాత్కాలికంగా ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందంటే.. ప్రపంచవ్యాప్తంగా వెబ్‌సైట్లు, వెబ్ అప్లికేషన్లను తయారుచేయడానికి ఉపయోగించే ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ పీహెచ్‌పీ సంబంధించి ఆగస్టులో అత్యంత తీవ్రమైన భద్రతా లోపాలు బయటపడ్డాయి. అంతర్జాతీయంగా 70 శాతానికిపైగా వెబ్‌సైట్లు పీహెచ్‌పీని వాడుతుంటాయి. కృత్రిమమేధ మోడళ్ల సహాయంతో సైబర్ సెక్యూరిటీ నిపుణులు వాటిని గుర్తించారు. వాటిని పీహెచ్‌పీ 2షెల్ అని పిలుస్తున్నారు. కాలం చెల్లిన పీహెచ్‌పీ వెర్షన్లను రన్ చేస్తున్న సర్వర్లపై హ్యాకర్లు దాడి చేసే ప్రమాదం ఉంది. ఎలాంటి పాస్‌వర్డ్‌లు లేకుండా నేరుగా సర్వర్‌లోకి ప్రవేశించి.. తమకు నచ్చిన కోడ్‌ను రన్ చేసి, నియంత్రిస్తారనే ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ వ్యవహారంపై పీహెచ్‌పీ ఫౌండేషన్ సంస్థ స్పందించింది. ఈ లోపాలు సాఫ్ట్‌వేర్ చరిత్రలోనే అత్యంత తీవ్రమైనవిగా పేర్కొంది. వెంటనే ఆయా వెబ్‌సైట్‌లను అప్‌డేట్ చేసుకోవాలని బుధవారం హెచ్చరించింది. మున్ముందు ఏఐ వల్ల ఇలాంటి లోపాలు బయటపడే అవకాశాలు ఎక్కువ అని.. ఈ అంశంపై టెక్ కంపెనీలన్నీ కలిసి పనిచేయాలని సూచించింది. పీహెచ్‌పీ జారీ చేసిన హెచ్చరికలతో అమెరికా, జపాన్‌తో పాటు ఐరోపా, ఆసియాకు చెందిన పలు దేశాలు అప్రమత్తమయ్యాయి. వెంటనే వెబ్‌సైట్లను అప్‌డేట్ చేయాలని, లేదంటే తాత్కాలికంగా నిలిపివేయాలని అమెరికాకు చెందిన ఎన్ఎస్ఏ (నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ) హెచ్చరించింది. జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియం, జపాన్ సహా పలు దేశాల నాయకుల నుంచి ఇలాంటి హెచ్చరికలు జారీ అయ్యాయి.

సౌరవ్‌దాస్, అశుతోష్ రాంకాలకు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ నోటీసులు

న్యూఢిల్లీ అక్టోబరు 22 (ఎ.ఎం.ఎస్)ః
తీహార్ జైలు నుండి విడుదలైన మరుసటి రోజే కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతలు సౌరవ్‌దాస్, అశుతోష్ రాంకాలకు ఢిల్లీ పోలీసు క్రైమ్ బ్రాంచ్ నోటీసులు జారీ చేసింది. వారిపై నమోదైన రెండు కేసుల విచారణ నిమిత్తం గురువారం మధ్యాహ్నం రాజౌరీ గార్డెన్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. వీరితో పాటు అజింక్య షిండేకు కూడా సమన్లు జారీ అయ్యాయి. అక్టోబర్ 13న బారికేడ్లతో మూసి ఉంచిన జంతర్‌మంతర్ గేట్లను ఎక్కి అక్రమంగా లోపలికి ప్రవేశించారన్న ఆరోపణలపై దాస్, రాంకాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్టోబర్ 14న వారిని ఐదురోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. అక్టోబర్ 19న మరో రెండు రోజులు పొడిగించారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందంటూ వారి జ్యుడిషియల్ కస్టడీని మరో మూడు రోజులు పొడిగించాలని ఢిల్లీ పోలీసులు కోరారు. అయితే బుధవారం ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ (ఎస్ఇఎం) విచారణను పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రితు రాజ్,

వారి పూచీకత్తులను అంగీకరించి, వారిని విడుదల చేయాలని ఆదేశించారు. కేసుల సున్నిత స్వభావం, నిష్పక్షపాత విచారణను పేర్కొంటూ సిజెపి నేతలపై ఉన్న రెండు కేసులను ఢిల్లీ పోలీసులు క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. మరుసటి రోజు ఈ సమన్లు జారీ చేయడం గమనార్హం.

మధ్యప్రదేశ్‌లో నవంబర్ 12న రాజ్యసభ ఉప ఎన్నిక

- **మధ్యప్రదేశ్‌లో నవంబర్ 12న రాజ్యసభ ఉప ఎన్నిక**

భోపాల్ అక్టోబరు 22 (ఎ.ఎం.ఎస్)ః
మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక నవంబర్ 12న నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) గురువారం ప్రకటించింది. మాజీ కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ రాజీనామాతో ఈ స్థానానికి ఖాళీ ఏర్పడింది. ఇసిఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 26న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. నామినేషన్లు దాఖలు చేయడానికి నవంబర్ 2, చివరి తేదీ కాగా, నవంబర్ 3, 2026న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి నవంబర్ 5 చివరి తేదీ. నవంబర్ 12న పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎన్నికల ప్రక్రియ నవంబర్ 16 నాటికి పూర్తవుతుంది. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థులను ఎంపిక చేసేందుకు రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఊదా రంగు (స్కెచ్ పెన్నులను) మాత్రమే ఉపయోగించాలని ఇసిఐ ఆదేశించింది.

ఫ్రాన్స్‌లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలి

పారిస్
మౌలిక వసతుల లేమి, పెరుగుతున్న ధరల వంటి సమస్యలతో ఫ్రాన్స్ మండిపోడుతోంది. ఈ అశాంతి యుత పరిస్థితులు, స్థానికంగా కర్ఫ్యూల నేపథ్యంలో భారతీయులు జాగ్రత్తగా ఉండాలని పారిస్‌లోని భారత ఎంబసీ హెచ్చరించింది. ఫ్రాన్స్‌లో నివసిస్తున్న, ఆ దేశం వెళ్లాలనుకుంటున్న ప్రయాణికులకు సూచనలు చేసింది.''నిరసన ప్రదేశాలు, జనాలు భారీగా గుమిగూడిన ప్రాంతాలకు వెళ్లొద్దు. ఎప్పటికప్పుడు స్థానిక ప్రభుత్వాలు ఇచ్చే అధికారిక అడ్వైజరీలను గమనించుకోండి. రవాణాకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోండి'' అని ఎంబసీ సూచించింది. సంబంధిత వెబ్‌సైట్ల వివరాలు షేర్ చేసింది. తమ దేశంలో జరుగుతోన్న నిరసనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ ఖండించారు రాజకీయ లబ్ధికోసమే విదేశీ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫ్రాన్స్‌లో హింసాత్మక ఘటనలకు అక్కడి ప్రభుత్వ వలస విధానాలే కారణమని ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ''అవొక మూర్ఖపు మాటలు. వాటికి

ఎలాంటి ఆమోదయోగ్యత లేదు'' అని మేక్రాన్ మండిపడ్డారు.

జనగణన మరో ఎస్ఐఆర్‌గా మారనీయకండి

- **తక్షణమే జోక్యం చేసుకోండి!**
- **జనగణన నిబంధనలకు సవరణలపై రాష్ట్రపతికి సిపిఎం లేఖ**

న్యూఢిల్లీ అక్టోబరు 22 (ఎ.ఎం.ఎస్)ః
జనగణన మరో ఎస్ఐఆర్‌గా మారకుండా చూడాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక లేఖ రాశారు. నిఘా, పౌరసత్వ నిర్ధారణ లేదా ఎన్నికల ప్రక్రియ నుండి మినహాయింపులకు జనగణన ఒక సాధనంగా మారకుండా చూడాలని కోరారు. ఇటువంటి పరిస్థితుల్లో, భారత రిపబ్లిక్ రాజ్యాంగ అధిపతిగా అత్యవసరంగా ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, తాజా సవరణలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని బేబీ ఆ లేఖలో రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ సూత్రాలకు, ప్రజా విశ్వాసానికి అనుగుణంగా వుండే పద్ధతిలో జనగణన ప్రక్రియను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జనగణన నిబంధనలు, 1990కి ఈ నెల 16వ తేదీన కేంద్ర హోం శాఖ చేసిన సవరణలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ తాము ఈ లేఖను రాస్తున్నామని బేబీ తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న జనగణన ప్రక్రియ సమగ్రత, నిష్పాక్షికత,



విశ్వసనీయతను పరిరక్షించేందుకు తక్షణమే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన రాష్ట్రపతిని కోరారు. జనగణన (సవరణ) నిబంధనల, 2026లో నోటిఫై చేసిన సవరణల ప్రకారం, జనగణన ఎన్యూమరేటర్లుగా నియమించబోయే వ్యక్తుల కేటగిరీలను గణనీయంగా విస్తరించారు. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ ప్రైవేట్ విద్యా సంస్థల టీచర్లను, సంస్థలు, సొసైటీలు, ట్రస్ట్‌ల ఉద్యోగులు, అధికారులను నియమించేందుకు ఈ సవరణలు అనుమతిస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలు, చట్టబద్ధమైన సంస్థలు, బ్యాంకులు, కంపెనీలు, ఇతర సంస్థలకు చెందిన అధికారులు, క్లర్కులు వంటి సిబ్బందిని కూడా జనగణన పనుల కోసం నియమించవచ్చు. అన్నింటికంటే అత్యంత ఆందోళన కలిగించే అంశమేమంటే, రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర పాలిత ప్రాంత పాలనా విభాగానికి చెందిన వ్యక్తులెవరైనా కూడా ఈ కార్యకలాపాలకు అనువుగా వుంటారనుకుంటే వారిని కూడా నియమించుకోవచ్చునని తెలిపారు. ఎంపిక ప్రామాణికాలు, నియమితులైన వారి నిష్పాక్షికత, పక్షపాత జోక్యానికి వ్యతిరేకంగా రక్షణలు వంటి వాటిపై తీవ్రమైన ప్రశ్నలను ఆ లేఖలో బేబీ లేవనెత్తారు. స్పష్టంగా నిర్దేశిత ప్రామాణికాలు లేదా ప్రజలకు జవాబుదారీగా వుండే రక్షణలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాల పాలనా విభాగాలకు కల్పించబడిన విచక్షణాధికారం ఏకపక్షంగా, రాజకీయంగా ఉద్దేశపూరితమైన నియామకాలు చేపట్టడానికి గణనీయంగా అవకాశం కల్పిస్తోందని విమర్శించారు. ఈ జనగణన ప్రక్రియ కింద ప్రతి ఒక్క కుటుంబం, వ్యక్తి నుండి విస్తృతమైన స్థాయిలో వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. తమకు నమ్మకం కుదరకపోతే ఆ వ్యక్తులతో అటువంటి సమాచారాన్ని పంచుకోవడానికి వారు విముఖంగా వుండవచ్చు. ప్రస్తుతమున్న రాజకీయ వాతావరణంలో తాము ఇచ్చే సమాచారాన్ని రాజకీయకోణంలో తమను విశ్లేషించడానికి ఉపయోగిస్తారని, అలాగే ప్రత్యేకంగా కొన్ని కమ్యూనిటీలను లక్ష్యంగా చేసుకుంటారని, తమ పౌరసత్వాన్ని ప్రశ్నిస్తారని లేదా తమను చట్టబద్ధమైన హక్కులు, అర్హతల నుండి బహిష్కరిస్తారన్న భయం వుంటుందని, అది నిజమేనని బేబీ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులను ముఖ్యంగా పాలక వ్యవస్థతో రాజకీయ సంబంధాలున్న వారిని నియమించడం వల్ల ఈ ప్రక్రియ విశ్వసనీయతే తుడిచిపెట్టుకుపోతుందని లేఖ పేర్కొంది.

రెండో దశ జనగణన 2027కు ఈ ఏడాది ఆగస్టు 14న నోటిఫై చేసిన ప్రశ్నావళితో కలిపి చూసినట్లైతే ఈ ఆందోళనలు మరింత తీవ్రంగా మారుతున్నాయని బేబీ స్పష్టం చేశారు. తల్లిదండ్రుల మతం, బ్యాంక్‌ఖాతాల వివరాలు, ఆధార్, ఇతర ఐడిలు, పాస్‌పోర్ట్, మొబైల్ నెంబర్‌తో సహా ఇంకా ఇతరత్రా వివరాలతో విస్తృత స్థాయిలో సమాచారాన్ని ఈ ప్రశ్నావళి కోరుతోంది. ఇలా వ్యక్తిగత వివరాలను సేకరించడాన్ని ఆపేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 24న భారత రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్‌కు సిపిఎం మెమొరాండాన్ని అందజేసింది. జనగణన డేటాను మరే ఇతర డేటాబేస్‌లతో అనుసంధానించరాదని, లేదా దేనికోసమైతే ఈ సమాచారాన్ని సేకరించారో దానికి మించి మరే ఇతర ప్రయోజనాల కోసం దాన్ని మళ్లించకుండా వుండేలా చూసేందుకు కఠినమైన రక్షణలు ఏర్పాటు చేయాలని కూడా ఆ మెమొరాండం కోరింది. జనగణన నిబంధనలకు తాజాగా సవరణలు చేసిన నేపథ్యంలో ఆ మెమొరాండంలో లేవనెత్తిన ఆందోళనలు మరింత ఆవశ్యకతను సంతరించుకున్నాయి. అస్పష్టమైన విధానాలు, ఏకపక్ష డాక్యుమెంటేషన్ అవసరాలు వంటి వాటి ద్వారా అర్హులైన పౌరులను కూడా మినహాయిస్తున్నారని ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనుభవాలు చూస్తే స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో విస్తరించిన, తగినంతగా నియంత్రించబడని ఎన్యూమరేటర్ల నెట్‌వర్క్ ద్వారా జాతీయస్థాయిలో సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే అవకాశం వుండడం అత్యంత ఆందోళన చెందే అంశమని బేబీ పేర్కొన్నారు.

జనగణన భారత ప్రజలకు సంబంధించిన జాతీయ స్థాయి ప్రక్రియ. అటువంటప్పుడు అధికారంలో వున్న పార్టీ రాజకీయ ప్రయోజనాలు లేదా ఆ పార్టీ భావజాల అనుబంధ సంస్థల రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చడానికి ఒక సాధనంగా మారేందుకు ఎంతమాత్రమూ దీన్ని అనుమతించరాదని లేఖ స్పష్టం చేసింది.

మదురోపై చిత్రహింసల అస్త్రం

- **దేశాధినేతపై ఇదే తొలి కేసు**
- **అరుదైన ఫెడరల్ చట్టం ప్రయోగించిన అమెరికా**

న్యూయార్క్: వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోపై అమెరికా ప్రాసిక్యూటర్లు విదేశాల్లో జరిగే చిత్రహింసలను నేరంగా పరిగణించే అరుదైన ఫెడరల్ చట్టాన్ని ప్రయోగించారు. ఈ చట్టం కింద అభియోగాలు ఎదుర్కొన్నవారు చాలా కొద్దిమందే కావడం గమనార్హం. మదురో (63), ఆయన భార్య సిలియా ఫ్లోర్స్ (70) గత వారం తాము నిర్దోషులమని కోర్టులో స్పష్టం చేశారు. రాజకీయ ప్రత్యర్థులను చిత్రహింసలు పెట్టేందుకు కుట్ర పన్నారని, దీనికోసమే అధికారంలో కొనసాగారనే అభియోగాన్ని ఇప్పుడు చేర్చారు. ఇప్పటికే ఉన్న మాదకద్రవ్యాల అక్రమ రవాణా అభియోగాలకు ఇది అదనం. కాగా, దీనిపై విచారణ 2027 జూన్‌లో జరగనుంది.. ఈ ఏడాది జనవరిలో కారకాస్‌లో అధ్యక్షుడు ట్రంప్ ఆదేశంతో అమెరికా సైన్యం దాడి చేసి ఈ ఇద్దరినీ కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ హయాంలోని, 1994 నాటి చిత్రహింసల నిరోధక చట్టాన్ని తెరపై తీసుకువచ్చారు. ఈ అభియోగాలు ఎదుర్కొంటున్న ఏడో వ్యక్తులు వీరే కావడం గమనార్హం. కస్టడీలో ఉన్న వ్యక్తికి తీవ్రమైన శారీరక లేదా మానసిక బాధ కలిగించే చర్యలను ఈ చట్టం నేరంగా పరిగణిస్తుంది. ఇప్పటివరకు నలుగురికి ఈ శిక

వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

మానవత్వానికి నిలువుటద్దం రెడ్‌క్రాస్ సొసైటీ
జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాల ఏర్పాటుకు చర్యలు
రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించాలి: కలెక్టరేట్‌లో తొలి మేనేజింగ్ కమిటీ సమావేశం

వరంగల్, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి) :

మానవతా విలువలకు, స్వచ్ఛంద సేవలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతీకగా నిలుస్తోందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. గురువారం నూతన కలెక్టరేట్‌లో నిర్వహించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా తొలి మేనేజింగ్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజ సంక్షేమానికి ప్రతి పౌరుడు రెడ్‌క్రాస్‌లో సభ్యత్వం తీసుకుని సేవా కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. జూనియర్, యూత్ రెడ్‌క్రాస్: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. 'ప్రణామ్' కార్యక్రమం: వయోవృద్ధుల మానసిక ఉల్లాసం, సామాజిక భాగస్వామ్యం కోసం ప్రత్యేకంగా 'ప్రణామ్' కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రక్తదాన శిబిరాలు విస్తృతంగా నిర్వహించడంతో పాటు, 'సహ ముక్త్ భారత్' లో భాగంగా మాదకద్రవ్యాల నివారణపై యువతలో చైతన్యం తేగలగాలని, నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లా కార్యాలయం, జనరిక్ మెడికల్ స్టోర్లకు విజ్ఞప్తి: నూతన కలెక్టరేట్ సముదాయంలో రెడ్‌క్రాస్ కార్యాలయానికి స్థలం, అలాగే ఎంజీఎం, నర్సంపేట, వర్ధన్నపేటల్లో జనరిక్ మెడికల్ స్టోర్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం మేరకు ఇ.వి. శ్రీనివాసరావును వరంగల్ జిల్లా రెడ్‌క్రాస్ సలహాదారుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శానబోయిన రాజ్‌కుమార్, రాష్ట్ర పాలక మండలి సభ్యులు నాడెం శాంతికుమార్, కోశాధికారి బొల్లం శివ, జిల్లా పాలక మండలి సభ్యులు, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, డీఐఈఓ శ్రీధర్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

మంత్రి సీతక్క, కలెక్టర్ బోర్డే హేమంత్
నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోగా పనులు పూర్తి చేయాలి
ప్రతి 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష

ములుగు, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి) :

జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క), జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రోడ్లుభవనాలు, నీటిపారుదల, పర్యాటక, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఎన్పీడీసీఎల్ తదితర శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల ప్రస్తుత స్థితి, పెండింగ్ కారణాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఫోన్ ద్వారా దిశా నిర్దేశం చేసిన మంత్రి సీతక్క: సమీక్షా సమావేశం సందర్భంగా మంత్రి సీతక్క ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధి, ఎకో టూరిజం పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. రాబోయే మేడారం జాతరను దృష్టిలో ఉంచుకొని రహదారుల పనులు, నూతన అతిథి గృహ నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలి. యంగ్ ఇండియా పాఠశాల, వైద్య కళాశాల, ఐటీడీఏ భవనం, గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలి. మల్లూరు ఆలయం వద్ద వసతులు, జంపన్నవాగు అభివృద్ధి, పుష్కరాలకు సంబంధించిన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలి: కలెక్టర్ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే ఆరు నెలలు పనులకు అనుకూలమైన కాలమని, దీన్ని సద్వినియోగం చేసుకుని పెండింగ్ టెండర్లను వేగవంతం చేయాలన్నారు. సాంకేతిక అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పరిశీలనలు జరపాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా అధికారులు అప్పలనాయుడు, ధర్మానాయక్, భిక్షపతి, శ్యాంసింగ్, సునీత పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

హనుమకొండ, అక్టోబర్ 22 (వుదయం జిల్లా ప్రతినిధి) :

ఈనెల 24, 26 తేదీల్లో జరగనున్న టీజీపీఎస్సీ అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్ 2), అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు.

కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్మెంట్ టెస్ట్ (CBRT) పద్ధతిలో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 వరకు, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 వరకు పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులను ఉదయం 8:30 నుండి 9:30 వరకు, మధ్యాహ్నం 1:00 నుండి 2:00 వరకు మాత్రమే పరీక్షా కేంద్రం లోనికి అనుమతిస్తారు. నిబంధనల ప్రకారం పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే (ఉదయం 9:30, మధ్యాహ్నం 2:00 గంటలకు) గేట్లు మూసివేస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరని స్పష్టం చేశారు. జిల్లాలోని ఐయాన్ డిజిటల్ జోన్ (వడ్డేపల్లి), కిట్స్ కళాశాల, ఎన్ఎస్ గ్లోబల్ టెక్నాలజీస్, నోబెల్ టెక్నాలజీస్, శ్రీ గాయత్రి డిగ్రీ & పీజీ కళాశాలల్లో పరీక్షలు జరుగుతాయి. అసిస్టెంట్ సైంటిస్ట్ పరీక్షకు 1,320 మంది, అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పరీక్షకు 1,225 మంది హాజరుకానున్నారు. ఏర్పాట్లు: కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పటిష్ట పోలీస్ బందోబస్తు, తనిఖీ వ్యవస్థలు ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, ఆర్టీసీ, పోలీస్, విద్యుత్, ఆరోగ్య శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు పాల్గొన్నారు.

కొమురం భీం, పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి ఆదర్శం

అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి
శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

నల్గొండ జిల్లా, అక్టోబరు 22 (వుదయం ప్రతినిధి):

హైదరాబాద్ లో కొమురం భీం, పండుగ సాయన్న ముదిరాజ్ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను కొనసాగించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పిలుపునిచ్చారు.

తెలంగాణ శాసనసభలోని దుద్దిళ్ల శ్రీపాదరావు సెంట్రల్ హాల్‌లో గురువారం వీరయోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి, ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీం 125వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం వారు చేసిన పోరాటాలను స్మరించుకున్నారు.

మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలి

తెలంగాణ నేల పోరాటాలకు, త్యాగాలకు, ఆత్మగౌరవానికి నిలయమని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సామాజిక అసమానతలు, దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆదివాసీల హక్కుల కోసం, అడవి, భూమి, నీటిపై వారి హక్కులను కాపాడేందుకు కొమురం భీం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆయన సాగించిన పోరాటం ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు.

పేదలు, బలహీన వర్గాలపై జరుగుతున్న దోపిడీ, అన్యాయాలను ఎదిరించి పండుగ సాయన్న ముదిరాజ్ పోరాడారని తెలిపారు. ఆదివాసీలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల యువతకు విద్య, ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. మహనీయుల చరిత్రను పుస్తకాలకే పరిమితం చేయకుండా వారి ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడిన వీరులు

కొమురం భీం ఆదివాసీల ఆరాధ్య దైవమని, గోండు బెబ్బులిగా ప్రసిద్ధి చెందిన గొప్ప పోరాట యోధుడని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఆయన సాగించిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. గిరిజనుల విద్య, సంక్షేమం, ఉపాధి అవకాశాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన గురుకులాలు, ఉన్నత విద్య, విదేశీ విద్యావకాశాలు, జోడేఘాట్ అభివృద్ధి వంటి కార్యక్రమాలు ఆదివాసీల అభ్యున్నతికి దోహదపడతాయని పేర్కొన్నారు. పండుగ సాయన్న ముదిరాజ్ నాటి నిరంకుశ పాలన, దొరల దోపిడీ, సామాజిక అన్యాయాలను ఎదిరించిన తెలంగాణ వీరుడని కొనియాడారు. పేదలు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన మండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 22.

వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పండుగ సాయన్న ముదిరాజ్ జీవిత చరిత్ర, ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు.

పండగ సాయన్న 1860 1900 మధ్య కాలానికి చెందిన వారు అని, వారు దానధర్మాలు చేసి ప్రజా నాయకుడిగా ప్రజల గుండెల్లో గుర్తింపు పొందారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ పండుగ సాయన్న జయంతి శుభాకాంక్షలు తెలిపారు. వారు గ్రామీణ క్రీడల్లో ఆరితేరిన వారిగా వారి జీవిత చరిత్ర చెబుతుందన్నారు. ఈ సందర్భంగా మేర కార్పొరేషన్ చైర్మెన్ వెంకట్రాజం మాట్లాడుతూ పండుగ సాయన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా జరుపుకోవడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (రెవెన్యూ, స్థానిక సంస్థలు), ఉప సంచాలకులు ఎ. పుష్పలత, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కె. శంకరయ్య, సంబంధిత జిల్లా అధికారులతో పాటు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, మెపా ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు వ్యవస్థాపక సభ్యులు బోనాల రమేష్, పులి రజనీకాంత్, చొప్పరి సోమయ్య, శానబోయిన రాజ్ కుమార్, పొన్నం మొగిలి, బండి సారంగపాణి, పులి రాజేష్, నవీన్, అమర్, పులి విక్రం, శ్రవణ్, మెపా హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్, ఉపాధ్యక్షులు గోనెల విజేందర్, ఆళ్ల నరేష్, గంట వినోద్ కుమార్, శిరబోయిన సతీష్, మండల సమ్మయ్య, గంగరబోయిన కిరణ్, అరవింద్, ప్రశాంత్, ఆకుల సుభాష్, శ్రవణ్, విక్రమ్ వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శిలు, తదితరులు పాల్గొన్నారు.

238 రోజుల్లో పాలనపై అంకిత్ ముద్ర

క్షేత్రస్థాయి పర్యటనలు.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
సమాచార హక్కు చట్టం అమలులో రాష్ట్రస్థాయి అవార్డుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు గుర్తింపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):

అధికారుల సమీక్షలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకోవడం.. ప్రభుత్వ శాఖల పనితీరును పర్యవేక్షించడం.. అభివృద్ధి పనుల పురోగతిపై దృష్టి సారించడం.. పారదర్శక పాలనకు ప్రాధాన్యమివ్వడం లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలల్లోనే వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ సేవల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల తనిఖీలతో పాటు భూసర్వే, ప్రజావాణి అర్జీల పరిష్కారం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులు, గోదావరి వరదల సమయంలో ప్రజల భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ జిల్లా పరిపాలనను ముందుకు తీసుకెళ్తున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో పర్యవేక్షణ

కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహించడానికే పరిమితం కాకుండా ప్రభుత్వ వైద్యశాలలు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నారు.

భూసర్వేతో సమస్యల పరిష్కారానికి చర్యలు

భూములకు సంబంధించిన వివాదాలు, రెవెన్యూ వ్యవహారాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రధాన సమస్యల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో భూసర్వే కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయంతో భూముల సరిహద్దులు, పట్టాలు, ఇతర భూ సంబంధిత అంశాలను పరిశీలిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం తగ్గించి ప్రజలకు నిబంధనల ప్రకారం సేవలు అందేలా చూడటం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం.

ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి

ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. పారదర్శక పాలనకు రాష్ట్రస్థాయి అవార్డు

ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తోంది.

రామాలయ పునరుద్ధరణ పనులపై పర్యవేక్షణ

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులు జిల్లాకు అత్యంత ప్రాధాన్యమైన అంశాల్లో ఒకటి. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ పురోగతిని పర్యవేక్షించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం, ఆలయ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడం లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయి.

గోదావరి వరదల సమయంలో అప్రమత్తత

గోదావరి వరదలు భద్రాద్రి ప్రాంత ప్రజలకు ఏటా సవాలుగా మారుతున్నాయి. వరదల సమయంలో ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరమైన చోట సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం వంటి చర్యలు కీలకంగా నిలుస్తాయి

శాఖల సమన్వయంతో అభివృద్ధికి ముందడుగు

జిల్లా అభివృద్ధిలో రెవెన్యూ, వైద్య, విద్య, అటవీ, దేవాదాయ తదితర శాఖల పాత్ర కీలకం. ప్రజా సమస్యల పరిష్కారం నుంచి ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతి వరకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. అధికారుల పనితీరును సమీక్షించడం, క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేలా చూడటం కలెక్టర్ బాధ్యతల్లో ముఖ్యమైన భాగం.

ఫలితాలే పాలనకు కొలమానం

కలెక్టర్ అంకిత్ బాధ్యతలు చేపట్టి 238 రోజులు పూర్తయిన నేపథ్యంలో జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు, తనిఖీలు, పర్యవేక్షణ చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే పాలనా పనితీరుకు అసలైన కొలమానం పూర్తయిన అభివృద్ధి పనులు, పరిష్కారమైన ప్రజా సమస్యలు, మెరుగుపడిన ప్రభుత్వ సేవలు, ప్రజలకు అందిన ప్రయోజనాలే. ఈ అంశాలకు సంబంధించిన గణాంకాలు, ఫలితాలు వెల్లడైనప్పుడు జిల్లాలో అభివృద్ధి పురోగతిని మరింత స్పష్టంగా అంచనా వేయవచ్చు.

అవార్డులు, తనిఖీలు, సమీక్షలు పాలనలో ముఖ్యమైన భాగాలే అయినప్పటికీ, వాటి ద్వారా ప్రజలకు ఎంత మేరకు ప్రయోజనం చేకూరిందన్నదే అంతిమంగా కీలకం. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమన్వయంతో ముందుకు సాగితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రగతి మరింత బలోపేతం కానుంది.

జిల్లా అభివృద్ధి కోసం స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలి
జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్

ఆరు నెలల్లో స్వల్పకాలిక లక్ష్యాలు 100 శాతం పూర్తి చేయాలి
మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెంచాలి
అన్ని శాఖల అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి పలు సూచనలు చేసిన కలెక్టర్

ఖమ్మం, వుదయం బ్యూరో అక్టోబర్- 22

:జిల్లా అభివృద్ధి కోసం అన్ని శాఖలు స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత శాఖల అధికారులు ఇప్పటికే రూపొందించిన జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రణాళికలను వివరించగా, వాటిని పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ ప్రతి శాఖ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. స్వల్పకాలిక లక్ష్యాలను ఆరు నెలల్లోగా వంద శాతం సాధించేలా, మధ్యకాలిక లక్ష్యాలను ఆరు నుంచి పన్నెండు నెలల్లో, దీర్ఘకాలిక లక్ష్యాలను పన్నెండు నుంచి ఇరవై నాలుగు నెలల్లో సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అన్ని శాఖల ప్రణాళికలకు ప్రాథమిక కార్యాచరణ సమూనా సిద్ధమైన తర్వాత ప్రతి రంగానికి అవసరమైన కన్సల్టెన్సీ సేవలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

వైద్య సేవలు మెరుగుపడాలి:

జిల్లాలో శిశు మరణాల రేటు మాతృ మరణాల రేటు తగ్గించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. గర్భిణుల నమోదు వంద శాతం పూర్తి చేయడంతో పాటు ప్రసవాల వివరాలు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితి, టీకాల కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.. సిజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు.

పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ పోషకాహార లోపం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన ప్రతి అంశంపై లక్ష్యాలు, అమలు విధానం, పర్యవేక్షణ వివరాలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని ఆదేశించారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి:

ప్రతి పాఠశాల ప్రస్తుత రేటింగ్‌ను పరిగణనలోకి తీసుకొని విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను మెరుగుపరచాలని తెలిపారు.

యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు పెంచాలి:

యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ యూనివర్సిటీ, వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పరిశ్రమలు, మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న నైపుణ్యాల డిమాండ్‌కు అనుగుణంగా శిక్షణ కోర్సులు రూపొందించాలని సూచించారు.

నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్లో ఎక్కువ మంది యువత పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, శిక్షణ పొందుతున్న యువత వివరాలు, శిక్షణ పురోగతి, సాధించిన ఫలితాలపై ప్రత్యేక రికార్డు నిర్వహించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వసతి విద్యాసంస్థల్లో త్రాగునీటి పరిస్థితిపై వారంలో నివేదిక ఇవ్వాలి:

జిల్లాలోని అన్ని వసతి విద్యాసంస్థల్లో త్రాగునీటి సదుపాయాల పరిస్థితిని వచ్చే వారం రోజుల్లోగా సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు సురక్షితమైన త్రాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పరిశ్రమలు,మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి:

జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, ఉత్పత్తులు, పారిశ్రామిక అవకాశాలను పరిగణనలోకి తీసుకొని పరిశ్రమల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో మిర్చి ఉత్పత్తి అధికంగా ఉన్నప్పటికీ, దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు తక్కువగా ఉన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిర్చి ప్రాసెసింగ్‌తో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రతిపాదిత ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుంది, ఎంత ఆర్థిక విలువ సృష్టించవచ్చు అనే వివరాలతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సమర్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు పెంచాలి:

ప్రభుత్వ కార్యాలయాల్లో హాజరు సహా సంబంధిత పరిపాలనా ప్రక్రియలను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల పనితీరు, లక్ష్యాల సాధన, సేవల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు డ్యాష్‌బోర్డు అభివృద్ధి చేయాలని తెలిపారు. దీనికి అవసరమైన సమాచారాన్ని ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల నుంచి వివరాల సేకరణకు తగిన విధానం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పట్టణాల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపరచాలి:

పట్టణ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల పనితీరు మెరుగుపరచడంత

కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పండుగ సాయన్న

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య
మంచిర్యాల జిల్లా

పెత్తందారులు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థతో పాటు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న జయంతి వేడుకలకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల అణచివేతను ఎదిరించి పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలిపారు. తెలంగాణ ప్రజావీరుడుగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి కృషి చేశారని, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయమని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల సంక్షేమానికి తోడ్పడిన ఇలాంటి మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమానత్వం, సేవాభావం, పేదల పట్ల మానవత్వం పెంపొందించుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా పరిషత్ సిఈఓ గణపతి, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

- **క్వింటాల్‌కు రూ.9,260 ధర.. రైతులకు ఇబ్బందులు కలగొద్దు**
- **కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 22:
ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేశారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో పత్తి తేమ శాతం పరీక్షించే విధానం, తూకం ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

జిల్లాలో 18 కొనుగోలు కేంద్రాలు
జిల్లాలో పత్తి కొనుగోళ్ల కోసం 18 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, 33 జిన్నింగ్ మిల్లులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర నిర్ణయించగా, ఆదిలాబాద్ మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారులు గరిష్ఠంగా రూ.9,260 వరకు ధర చెల్లిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇతర మార్కెట్లతో పోలిస్తే ఆదిలాబాద్‌లో పత్తికి మెరుగైన ధర లభిస్తోందని తెలిపారు. జమ్మికుంటలో క్వింటాల్‌కు రూ.9,250, వరంగల్‌లో రూ.9,110 వరకు ధర ఉందని వివరించారు.

తేమ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి
పత్తిలో తేమ శాతాన్ని పరీక్షించే విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. తేమ పరీక్షల యంత్రాల వినియోగంపై మార్కెటింగ్ శాఖ, సీసీఐ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. రైతులు పత్తిని బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. తేమ పరీక్షలు, తూకం, కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

రైతులకు అవసరమైన సౌకర్యాలు
కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ధరలు, కొనుగోలు వివరాలు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, రూపాయికే భోజనం పథకం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుల ప్రతినిధులతో స్థానిక పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి, కొనుగోళ్ల ప్రక్రియను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. పత్తి తూకం పూర్తయిన వెంటనే రైతులు రశీదు తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ సూచించారు. మార్కెట్ యార్డుకు పత్తి వాహనాలు రాంపూర్ మీదుగా బైపాస్ మార్గంలో రావాలని కోరారు. పంట కోతల అనంతరం మిగిలిన అవశేషాలను కాల్చవద్దని కలెక్టర్ రైతులకు సూచించారు. వాటిని నేలలో కలిపి సేంద్రియ ఎరువుగా ఉపయోగించుకోవచ్చని, పశువుల మేతకు కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. నీటి కొరత దృష్ట్యా ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, రైతు సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

పాల్గొన్న జిల్లా ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్.
నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 22అక్టోబర్ 2026

కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం బహుజన సంక్షేమ పోరాట వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో జిల్లా ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు. ముందుగా అధికారులు, ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బహుజనుల అణిచివేతపై ఆనాటి కాలంలో దొరలు, భూస్వాములు, నిజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న గొప్ప పోరాటాలు చేశారని గుర్తు చేశారు.

ఆయనను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తొలిసారిగా పండుగ సాయన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ఇలాంటి మహనీయుల జీవిత విశేషాలు నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలిపారు.

పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ, నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లలో, ఉద్యమాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని కొనియాడారు. తెలంగాణ రాబిన్ హుడ్ గా సుపరిచితుడైన సాయన్న ప్రజలను దోచుకుంటున్న దొరలు, దేశముఖ్‌లు, అధికారులు, సంపన్నుల ఆస్తులను తీసుకొని పేదలకు పంచిపెట్టాడని తెలిపారు. నాటి నిరంకుశ నిజాం అధికారులను ప్రశ్నించి, వారిని ఎదిరించి బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నించాడని వివరించారు. పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ జయంతి వేడుకలలో బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయాసంద్, ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి, కార్మిక శాఖ అధికారి రాజలింగం, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ముదిరాజ్ కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

- **అందరికీ అభివృద్ధి ఫలాలు**
- **పాలనలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ముద్ర**
- **విద్య, వైద్యం, సంక్షేమం, పర్యాటకం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ**
- **జిల్లా కలెక్టర్ గా గరిమ అగ్రవాల్ బాధ్యతలు చేపట్టి ఏడాదికాలం పూర్తి ప్రత్యేక కథనం....**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ -22
ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా పకడ్బందీ ప్రణాళిక జిల్లాలో పక్కాగా అమలవుతుంది. అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నది. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమం, పర్యాటకం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూ పరిపాలన సాగుతున్నది. జిల్లా కలెక్టర్ గా గరిమ అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించి.. ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం..

అక్టోబర్ 23, 2025వ తేదీన అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, అలాగే ఇంచార్జి కలెక్టర్ గా గరిమ అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. మొదటి రోజున అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా కార్యాచరణ సిద్ధం చేయాలని, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని జిల్లా అన్ని రంగాల్లో ముందుండేలా ప్రతి అధికారి విధులు నిర్వర్తించాలని స్పష్టం చేస్తూ.. పిలుపునిచ్చారు. అదే దిశగా ముందుకు సాగుతున్నారు జిల్లా కలెక్టర్.

ప్రజా ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా ముందుకు

అర్హుల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. నాలుగు విడతల్లో రూపాయల 5 లక్షల ఆర్థిక సహాయం విజయవంతంగా అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్ శాఖ ఏఈలు, జిల్లాలోని ఆయా మండలాల ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, మైనింగ్ శాఖ అధికారితో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచేందుకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పర్యటిస్తున్నారు. ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తూ .. లబ్ధిదారులతో మాట్లాడి వారి అనుభవాలు . నిర్మాణాల పురోగతిపై ఆరా తీస్తూ మద్దతుగా నిలుస్తున్నారు. ప్రజా ప్రభుత్వం అందించే రూ.ఐదు లక్షల్లోనే ఇండ్లను నిర్మించుకునేలా సూచనలు చేస్తున్నారు. ప్రతి లబ్ధిదారు వారి వారి మండల కేంద్రాలు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇందిరమ్మ మోడల్ హౌస్ లను తప్పనిసరిగా చూడాలని దానికి అనుగుణంగా లబ్ధిదారులు సైతం నిర్మాణాలు చేసుకోవాలని స్పష్టం చేశారు. బోధన పరిశీలన .. మెనూ తనిఖీ.. భవిష్యత్తు నిర్దేశంజిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు పరిశీలిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ అన్ని విద్యాలయాల్లో అమలు అవుతుందా లేదా అని ముందుగా పరిశీలించి.. కిచెన్లో వాటికి సంబంధించిన ఆహార పదార్థాలు సిద్ధం చేశారో లేదో పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేస్తున్నారు. విద్యార్థులను సైతం ఆరా తీసి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అడిగి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ, ఇతర అంశాలు పరిశీలించేందుకు మండల, జ...

ఎల్‌నినో నేపథ్యంలో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలి

- **విద్యుత్, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ**
- **యాసంగిలో వరి సాగు చేపట్టకుండా క్షేత్రస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన**
- **అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నిజామాబాద్, అక్టోబర్ 22 :
ఎల్‌నినో ప్రభావంను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్ అవసరాలకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. యాసంగి సీజన్‌లో వరి సాగు చేయకుండా క్షేత్రస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సంప్రదాయంగా వస్తున్న వరి పంటకు బదులుగా నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ రానున్న రోజుల్లో ఎదురయ్యే విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యల విషయమై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, వారికి దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావం అంతకంతకు తీవ్రరూపం దాలుస్తున్న దృష్ట్యా, రానున్న పరిస్థితులను ముందుగానే అంచనా వేసి తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యాసంగిలో వరి సాగుకు నీటి సరఫరా అందుబాటులో ఉండే అవకాశం లేనందున వరి సాగు చేయవద్దని గ్రామగ్రామాన రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. తక్కువ నీటితో, స్వల్ప వ్యవధిలో దిగుబడులు అందించే ప్రత్యామ్నాయ పంటల గురించి రైతులకు తెలియజేయాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆయిల్ పామ్, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి పంటల సాగు దిశగా రైతులు దృష్టి సారించేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి వివరించాలని తెలిపారు. రైతులు నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా వరి విత్తుకుంటే నష్టపోయే ప్రమాదం ఉన్నందున ముందస్తుగానే వారికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. రానున్న ఎనిమిది నుండి పది నెలలకు సంబంధించి గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి అవసరాలు, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల స్థితి, విద్యుత్ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ పనులపై ముందస్తు అంచనాలు రూపొందించాలని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ మరింతగా పెరిగే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలం వరకు జిల్లాలో ఎక్కడ కూడా ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన మంచినీటి పైప్ లైన్ల మరమ్మతులు, నూతన నిర్మాణాలు, వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవడం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తూ, నీటి సరఫరా వ్యవస్థలు సక్రమంగా పని చేసేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగ రావు, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయ కుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా వీరుడు పండుగ సాయన్న

- **కలెక్టరేట్ లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు**

జగిత్యాల అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి)
నిజాం నిరంకుశత్వానికి భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి ఆకలితో అలమటించే నిరుపేదల కడుపు నింపిన బహుజన వీరుడు ప్రజా వీరుడు తెలంగాణ రాబిన్ హుడ్ 'పండగ సాయన్న' జయంతి ఉత్సవాలను గురువారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజా వీరుడు తెలంగాణ రాబిన్ హుడ్ గా పిలవబడే పండుగ సాయన్న నిజాం నిరంకుశ పాలన కు వ్యతిరేకంగా అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు ఆనాడు నిజం ప్రభువుల ధాన్యం కారాగాన్ని కొలగొట్టి వాటిని పేదలకు పంచి పెట్టేవాడు అని అన్నారు. ధనవంతుల నుండి పెట్టు బడుదారుల వ్యవస్థ నుండి భూస్వాముల నుండి అణగారిన వర్గాలను అణిచివేతకు గురి కాకుండా వారి పై తిరుగుబాటు చేశాడన్నారు తెలంగాణ ప్రాంత వాసిగా మహబూబ్ నగర్ జిల్లాలో పుట్టిన పండుగ సాయన్న నిజాం పాలన పై అలుపెరుగని పోరాటం చేశాడని ఆయన చిన్నప్పటి నుండే పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మహనీయుడని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్ కలెక్టరేట్ ఏఓ కిషన్ సిబ్బంది బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

పేదల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న

- **కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్ ఆక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):
నిజాం కాలంలో పెత్తందార్ల అన్యాయాలకు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఎంతో మంది పేదలకు అండగా నిలిచిన నిలిచిన మహనీయుడు పండుగ సాయన్న అని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లో పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్, డీఆర్వో స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఇతర అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్మాట్లాడుతూ సొంతంగా సైన్యం ఏర్పాటు చేసుకొని దోపిడీ చేస్తున్న దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు.

సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
- **సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్***
- **వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి.. మందులు, వైద్య పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచాలి***

పెద్దపల్లి, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి)
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు
గురువారం సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు, మందుల నిల్వలు, వైద్య పరీక్షల నిర్వహణ, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు నిర్దేశించిన సమయానికి హాజరై, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓపీ సేవలను మరింత మెరుగుపరచాలని, రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని ఆదేశించారు. రోగులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

సుపత్రిలో అవసరమైన మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ముందస్తుగా తగిన నిల్వలు సమకూర్చుకోవాలని ఆదేశించారు. మందుల వినియోగం, నిల్వల వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా, రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు పరీక్షల కిట్లను సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని, నిల్వలు తగ్గకముందే వాటిని సమకూర్చుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ఆసుపత్రి ఆవరణ, రోగుల వేచిచూసే ప్రదేశాలు, వైద్య పరీక్షల గదులు, వార్డులు, శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రోగులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, వైద్య వ్యర్థాలను నిబంధనల ప్రకారం సురక్షితంగా తొలగించాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రోగులకు అవసరమైన కనీస సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులతో వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. రోగుల సమస్యలను ఓపికగా విని, వారికి అందించే వైద్య సేవల గురించి స్పష్టంగా వివరించాలని తెలిపారు. రోగులకు వైద్య సేవల విషయంలో సరైన సమాచారం అందిస్తూ, వారి పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని, ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ, లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దుకోవాలని ఆదేశించారు.జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రోగుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రభుత్వ వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత డాక్టర్ లు,తదితరులు, పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత

కామారెడ్డి/ఎల్లారెడ్డి:
కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలోని సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామంలో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వ ఉపాధ్యాయుడు మార బాల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పదిలో కర్రోల్ల స్మితశ్రీ , గుండ్ల వైష్ణవి, ఇంటర్మీడియట్‌లో పైడి శ్రీహర్ష, కుప్రియాల స్రవంతిలను ఘనంగా సన్మానించారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారికి నగదు పురస్కారాలను అందజేశారు. సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు మార బాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో మరింతగా రాణించి, ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం —— ఉజ్వల భవిష్యత్తుకు పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లాల్ సింగ్, వీడీసీ చైర్మన్ భైరవ రెడ్డి, నాయకులు సాయిలు, అశోక్, భైరవ రెడ్డి మోహన్ రెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

తాళ్లపేటలో కొనసాగుతున్న పోలీస్ పహారా -

మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

కలెక్టరేట్‌లో పండుగ సాయన్న జయంతి వేడుకలు

మహబూబ్‌నగర్
కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాటి నిజాం పాలనలో భూస్వాములు, దొరలు, దేశ్‌ముఖ్‌ల అరాచకాలను ఎదిరించి పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ పేర్కొన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సమసమాజ నిర్మాణానికి ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి, సామాజిక స్పృహ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, పరిపాలన అధికారి సువర్ణరాజు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ సాయన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి)
వనపర్తి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ పండుగ సాయన్న జీవిత చరిత్ర, ఆయన చేసిన పోరాటాలు, సమాజానికి అందించిన సేవలను

కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడి, ప్రజల మన్ననలు పొందిన మహనీయుడు పండుగ సాయన్న అని పేర్కొన్నారు. ధైర్యసాహసాలకు, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతకు ఆయన జీవితం నిదర్శనమని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ పండుగ సాయన్న ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సమానత్వం, ఐకమత్యం, ప్రజాసేవ వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని వారు పిలుపునిచ్చారు. మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పండుగ సాయన్న జీవిత చరిత్రపై కళాకారుడు రాజా రామ్ ప్రకాష్ పాడిన పాట అందరినీ ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న ధైర్యసాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకం

- **సబ్ కలెక్టర్ ఉమా హారతి**

సంగారెడ్డి, అక్టోబర్ 22:- వుదయం
అణగారిన, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఆర్‌డీఓ ఉమా హారతి అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమా హారతి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన ఆయన ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి!

- **రబీలో వరి సాగు వద్దు.. తాగునీటి అవసరాలకే జూరాల జలాలు**
- **భూసేకరణలో జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం.. అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**

గద్వాల, అక్టోబర్ 22 (వుదయం బ్యూరో)
సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసి, పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం భూసేకరణలో మరింత జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ అవార్డులు పూర్తయిన రైతులకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం చేయకుండా సకాలంలో నిధులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జూరాల నీటిపై ముందస్తు ప్రణాళిక
వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జూరాల రిజర్వాయర్‌లో తగినంత నీటిని నిల్వ ఉంచుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లోని రైతులు రబీ సీజన్‌లో వరి సాగు చేయకుండా ముందస్తుగా గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.అనధికారికంగా మోటార్లు ఏర్పాటు చేసుకుని నీటిని వినియోగించుకునే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ బోర్లు, బావుల్లో నీటి లభ్యతను పరిశీలించుకుని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

రైతులకు అవగాహన కల్పించడమే కీలకం
ఒకవైపు సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయడంతోపాటు, మరోవైపు వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా జూరాల జలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు ముందస్తు సమాచారం అందించి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, సర్వే ఏడీ నూకరాజు, ఇరిగేషన్ ఈఈలు శ్రీనివాసులు, సంజీవ్ ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీష్ రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్చెరు అక్టోబర్ 22, వుదయం .
విజయానికి ప్రతీకగా, ధర్మానికి ప్రతిరూపంగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గారు గురువారం హైదరాబాద్లోని మాజీ మంత్రి వర్యులు, సిద్దిపేట శాసన సభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని శ్రీ హరీష్ రావు గారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే జిఎంఆర్.. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

జనాభా గణన రెండో దశను పకడ్బందీగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

నాగర్ కర్నూల్, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):
నాగర్ కర్నూల్ జిల్లాలో జనాభా గణన రెండో దశను పకడ్బందీగా, సమర్థవంతంగా నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. తప్పిదాలకు తావులేకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని స్పష్టం చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ లోని ప్రధాన హాల్ లో జనగణన అధికారులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయంతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణన అత్యంత ప్రాధాన్యమైన ప్రభుత్వ కార్యక్రమమని, సేకరించే సమాచారం ప్రామాణికంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకొని విధులు నిర్వహించాలని, సమాచార సేకరణ, నమోదులో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. సందేహాలను శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలన్నారు.హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు శివరామకృష్ణ, రిషిత్ రెడ్డి జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జనగణన చార్జ్ అధికారులు, సహాయ చార్జ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఓ సుజాత, డీఈఓ రమేష్ కుమార్, ఆర్డీవోలు అర్చన, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల వేగవంతానికి కలెక్టర్ కీలక ఆదేశాలు

- **మండలానికి ఆరుగురు ప్రత్యేక అధికారుల నియామకం.**
- **ఒక్కో అధికారికి 4,5 గ్రామాల పర్యవేక్షణ బాధ్యతలు.**

పది రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ.

- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మెదక్ జిల్లా మొదటి స్థానంలో నిలవాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

మెదక్, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి.)
రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జిల్లాలో వేగవంతం కావాలని, మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణాన్ని నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను

ఆదేశించారు. గురువారం జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై కలెక్టర్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు గాను ప్రతి మండలానికి ఆరుగురు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.

గ్రామాల పర్యవేక్షణ:
ఒక్కో ప్రత్యేక అధికారికి 4 నుండి 5 గ్రామాల బాధ్యతలను అప్పగించారు. వీరు నేరుగా గ్రామాల్లో పర్యటించి పనులను పరిశీలిస్తారు. లబ్ధిదారులతో సమావేశాలు:మండలాల వారీగా ప్రతి గ్రామంలో మొదటి, రెండో విడతలో ఇంకా పనులు ప్రారంభించని లబ్ధిదారులతో నేరుగా సమావేశాలు నిర్వహించి, వారికి అవగాహన కల్పిస్తారు. రానున్న పది రోజుల్లో జిల్లాలో ఇంకా మొదలుకాని ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించేలా ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. ఆర్థిక సాయం & పొదుపు మార్గాలు: ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారులపై ప్రత్యేక చొరవ చూపి, అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇల్లు పూర్తి చేసుకునే సాంకేతిక, ఆచరణాత్మక మార్గాలను అధికారులు వివరించాలని సూచించారు.జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో ఒక్కటి కూడా నిర్మించకుండా మిగిలిపోకూడదు.

క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి తప్ప పనులు ఆగడానికి వీల్లేదు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిలో మెదక్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలన్నారు.

నిరుద్యోగులకు సువర్ణావకాశం.. 400 ఉద్యోగాల భర్తీకి అవకాశం

వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 22)
కేసీఆర్ నగర్ ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3 వాసులకు ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తున్నారు. హెచ్ఎండీఏ (HMDA) పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు (ORR), సర్వీస్ రోడ్లపై శానిటేషన్ పనుల నిర్వహణకు పురుషులు, మహిళలు కలిపి మొత్తం 400 మంది సిబ్బంది అవసరమని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉద్యోగాలకు పురుషులు, మహిళలు ఇద్దరూ అర్హులని, ఉద్యోగులకు వారానికి ఒకరోజు సెలవుతో పాటు పికప్, డ్రాప్ సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఆసక్తి ఉన్నవారు వెంటనే సంప్రదించాలని సూచించారు.
మరిన్ని వివరాలకు లక్ష్మీ నారాయణను 7386765643 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

బహుజనుల అభ్యున్నతికి చదువే ఆయుధం

- **డిఆర్ఓ నాగరాజమ్మ స్పష్టం**
- **సమీకృత కలెక్టరేట్‌లో ఘనంగా పండగ సాయన్న జయంతి వేడుకలు**

సిద్దిపేట, అక్టోబర్ 22. (వుదయం బ్యూరో)
బహుజనులపై ఏ వర్గాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయో గుర్తించి దాన్ని ఎదుర్కొనడానికి జ్ఞానమనే చదువు ఎంతో అవసరమని, బహుజన వర్గాలంతా ఉన్నత విద్యను అభ్యసించాలన్న గొప్ప సందేశాన్ని పండగ సాయన్న ఇచ్చారని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) నాగరాజమ్మ తెలిపారు. గురువారం

సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండగ సాయన్న జయంతి వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత స్వతంత్రోద్యమ కాలంలో (1900 ప్రాంతంలో) నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాట్లు, పోరాటాలు ఒక సమాంతర చరిత్ర అని, ఆ చరిత్రలో పండుగ సాయన్న పేరు సువర్ణాక్షరాలతో లిఖించదగినదని కొనియాడారు. ఆధిపత్య శక్తులపై పోరాడే క్రమంలో ఆయన ప్రజలను చైతన్యపరిచారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారి (డిబిసిడిఓ) సయ్యద్ రఫిక్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, ఏవో రాజ్ కుమార్, ముదిరాజ్ సంఘం ప్రముఖులు జంగిటి కనకరాజు, యమధర్మ, తోట్ల పరుశురాములు, గాడ్చర్ల సతీష్, రామకృష్ణ, తుపాకుల బాలరంగం, చింతమడక రాజన్న శ్రీహరి, గుర్రాల శ్రీహరి, సత్యనారాయణ, కొంతం శ్రవణ్, గాడ్చర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు ఘన సత్కారం

- **విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం.**
- **అఖిల రాజ్ ఫౌండేషన్ మండల అధ్యక్షులు సొక్కం స్వామి.**

దౌల్తాబాద్ అక్టోబర్ 22(వుదయం)
ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు సాధించి వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించడం జరిగిందని అఖిల రాజ్ ఫౌండేషన్ మండల అధ్యక్షులు సొక్కం స్వామి అన్నారు. గురువారం రాయపోల్ మండలం ఆరేపల్లి వైద్య కళాశాల ఎంబిబిఎస్ సీట్లు సంపాదించిన విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రతిభ కనబరచడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. ఆరేపల్లి గ్రామానికి చెందిన బొమ్మమేర మ్మధనియాలు దంపతుల కుమారుడు బొమ్మ అనుక్ నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించి వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. అదేవిధంగా సుమంజిగారి మమతభాస్కర్ దంపతుల కుమార్తె సుమంజిగారి ఉదయశ్రీ రామగుండం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించి వైద్య విద్యను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు.విద్య ప్రతి ఒక్కరి జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని, విద్యతోనే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించడం విద్యార్థుల కృషికి, పట్టుదలకు నిదర్శనమన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకు ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సహించాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా విద్యకు దూరం కాకుండా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం పట్టుదలతో చదివి ఉన్నత విద్యలో రాణించి తమ గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి పేదలకు అండగా నిలవాలని కోరారు.విద్యార్థులను ప్రోత్సహించడం, వారి విజయాలను గుర్తించి గౌరవించడం ద్వారా ఇతర విద్యార్థుల్లోనూ చదువుపై ఆసక్తి, పోటీతత్వం పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు అఖిల రాజ్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు, మాజీ సర్పంచ్ కరుణాకర్, కొత్తపల్లి ఉప సర్పంచ్ స్వామి, అఖిల రాజ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు దాతర్ పల్లి భాస్కర్, ఆర్గనైజర్ శ్రవణ్, బీఆర్ఎస్ నాయకులు మల్లేశం, అశోక్, గ్రామస్తులు ప్రశాంత్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కోహిర్ ప్రాంతంలో పంట తెగుళ్లపై కేంద్ర బృందం నజర్!

- **క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన.. తెగుళ్ల నివారణకు శాస్త్రవేత్తల సూచనలు**

కోహిర్, అక్టోబరు 22 (వుదయం ప్రతినిధి):
జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలకు సోకుతున్న అగ్గి తెగుళ్లపై కేంద్ర బృందం ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు, తెగుళ్ల వ్యాప్తికి గల పరిస్థితులను అధ్యయనం చేసి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, తెగుళ్లను తొలిదశలోనే గుర్తించడం ఎంతో ముఖ్యమని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ పరిశీలనలో ప్రొఫెసర్ కేజీబీ రెడ్డితో పాటు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చ్ (కేరళ) శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.పంటకు సోకిన తెగుళ్లను గుర్తించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రొఫికోనజోల్ లేదా టెబుకోనజోల్ మందులను లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పంట రకం, తెగులు నిర్ధారణ ఆధారంగా నిపుణుల సూచనల మేరకే మందులను వినియోగించాలని స్పష్టం చేశారు. కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం (CIPMC), హైదరాబాద్ అధికారులు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు, DDSKVK శాస్త్రవేత్తలు, స్థానిక వ్యవసాయ అధికారులు ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొన్నారు. పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు.

మాజీ మంత్రివర్యులు హరీష్ రావు,కే టిఆర్ గార్లను కలిసి దసరా శుభాకాంక్షలు తెల్పిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం

ఝరాసంగం అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి)
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ గారు,
విజయదశమి పండుగ సందర్భంగా ఈ రోజు హైదరాబాద్ లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ :కేటీ. రామారావు మరియు మాజీ మంత్రివర్యులు 'తన్నీరు. హరీష్ రావు' గార్లను మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం గారు ,అందరు ఆత్మీయంగా "అలయ్ బలయ్"చేసుకొని ఒకరికొకరు

ఆప్యాయంగా మాట్లాడుకున్నారు .ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్,శివకుమార్, మేఘనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పాలెంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

బిజినపల్లి, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):
బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో తెలుగు మత్స్యశాఖ సహకార సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు గురువారం నాడు ఘనంగా నిర్వహించారు.సంఘం అధ్యక్షుడు సొప్పరి కాశన్న ఆధ్వర్యంలో

సంఘ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు జంగం నారాయణ, సెక్రటరీ దొంతర మౌని నాగన్న, క్యాషియర్ కొంకలి రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు సొప్పరి బాలస్వామి, సంఘ సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

కప్రా(వూదయ ప్రతినిధి) అక్టోబర్ 22,
మాజీ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి*
రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి గారు

హాజరయ్యారు.
ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు, పార్టీ బలోపేతం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై నాయకులు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో జోగులాంబ గద్వాల ఖ్యాతిని చాటాలి!

- వాలీబాల్ జాతీయ పోటీలకు ఎంపికైన మధుప్రియకు కలెక్టర్ అభినందనలు

గద్వాల అక్టోబర్ 22 (వుదయం కరస్పాండెంట్)

జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభతో జాతీయ స్థాయిలో రాణించి జోగులాంబ గద్వాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. మానవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని మధుప్రియ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం వల్ల విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని పేర్కొన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కోటా ద్వారా అవకాశాలు లభిస్తాయని తెలిపారు. వాలీబాల్‌లో జాతీయ స్థాయికి ఎంపిక కావడంతోపాటు ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లోనూ మధుప్రియ ద్వితీయ బహుమతి సాధించడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. హిమాచల్ ప్రదేశ్‌లో త్వరలో జరగనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ హృదయరాజ్, కళాశాల ప్రిన్సిపల్ మంజుల, స్వప్న, విద్యార్థిని తల్లిదండ్రులు నాగార్జున, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే డాక్టర్. కూచకుళ్ల రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ముదిరాజుల బిడ్డ పండుగ సాయన్న స్ఫూర్తితో ముందుకు సాగాలని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్. కూచకుళ్ల రాజేష్ రెడ్డి పిలుపునిచ్చారు.

పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకుని గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ (కేసరి సముద్రం) వద్ద మత్స్యకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పండుగ సాయన్న విగ్రహానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సాయన్న బడుగు బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాడారని, ఆయన ఆదర్శాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజుల కు, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటానని, నాగర్ కర్నూల్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పెద్దలను పిలిచి భారీ ఎత్తున నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జక్కా రాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్, డీసీసీ కార్యదర్శి కావాలి శ్రీను, కౌన్సిలర్లు నిజాముద్దీన్, ఆసిఫా బేగం ఖాదర్, నజీమా ఖాజా ఖాన్, పడిగే శంకర్, అవంచ మాధవి రాజు, అర్జునయ్య, జేపీ చారి, కాజా ఖాన్, మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు తెప్పబాబు, తెప్ప తిరుపతయ్య, రుద్రయ్య, గువ్వల వెంకటయ్య, జంగయ్యకాంగ్రెస్ నాయకులు

జెట్టి ధర్మరాజు,తిరుమల్ యాదవ్, ప్రవీణ్, హమీద్ ఖాన్, శంకర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా అలై బలై నిర్వహించి తీరుతాం

- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

జోగిపేట, గురువారం:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా అలై బలై కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ స్పష్టం చేశారు. గురువారం జోగిపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.2018 నుంచి నేటి వరకు అలై బలై కార్యక్రమాన్ని స్థానిక నాయకుడిగా తానే నిర్వహిస్తూ వస్తున్నానని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ అలై బలై కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూడటం అహంకారపూరిత చర్య అని విమర్శించారు.అలై బలై కార్యక్రమాన్ని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాబోయే రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుని అలై బలై కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహిస్తామని వెల్లడించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని చంటి క్రాంతి కిరణ్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో

రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డీబీ నాగభూషణం, చాపల వెంకటేశం, అనిల్ రెడ్డి, బీర్ల శంకర్, తాజాదిన్, వెంకట్ గౌడ్, ప్రదీప్ గౌడ్, సాకిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రజకపల్లిలో లేబర్ కార్డుదారులకు వైద్య పరీక్షలు

వుదయం ప్రతినిధి నిజాంపేట

మండల పరిధిలోని రజకపల్లి గ్రామంలో గురువారం లేబర్ కార్డుదారులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి భాస్కర్ రెడ్డి తెలిపారు. లేబర్ కార్డు కలిగిన కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని

వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.

వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించాలి

- దుబ్బాక విద్యుత్ ఏడీఈ కార్యాలయం ముందు సీపీఎం ధర్నా
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి. భాస్కర్ డిమాండ్

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 22 , వుదయం:

వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి. భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక విద్యుత్ ఏడీఈ పరిధిలోని రైతులకు విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేయాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ ఏడీఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ సబ్‌ఇంజినీర్ ఆర్. రవళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి. భాస్కర్ మాట్లాడుతూ, వ్యవసాయానికి విద్యుత్ అంతరాయాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో సాగు చేసిన పంటలు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయని, ముఖ్యంగా వరి పంటకు సాగునీరు అందించడంలో విద్యుత్ కోతలు ఆటంకంగా మారుతున్నాయని పేర్కొన్నారు. సకాలంలో నీరు అందకపోతే పంట దిగుబడులు తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం రోజుకు ఏడు గంటల విద్యుత్ మాత్రమే అందిస్తూ రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపుతూ విద్యుత్ కోతలు విధించడం సరైన విధానం కాదన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవి పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో సాగు పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. దుబ్బాక విద్యుత్ ఏడీఈ వెంటనే స్పందించి తన పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నాలో సీపీఎం దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, నాయకులు రేణుక, శామవ్వ, ఎం.డి. సాజిద్, ఎం. మహేశ్, లక్ష్మీనర్సయ్య, ఎల్లారం రవీందర్, దేవయ్య, బత్తుల రాజు, సుధాకర్, వెంకటేశ్, నాగేశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న జయంతి వేడుకల్లో పండ్ల పంపిణీ

నారాయణపేట టౌన్ అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి)

తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండగ సాయన్న 174వ జయంతి వేడుకలను పురస్కరించుకొని నారాయణపేట పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తాలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డాక్టరేట్ కాకర్ల భీమయ్య మాట్లాడుతూ ఆయన సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలను నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పండగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని అన్నారు. పండగ సాయన్న చరిత్రను, ఆయన పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించడం ఎంతో ప్రాధాన్యమని పేర్కొన్నారు. సమాజంలో పండగ సాయన్నకు ఉన్న గుర్తింపును మరింత విస్తృతం చేయడంతో పాటు ఆయన జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం నిరుపేదలకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పిచ్చరాగడి తాండలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

- అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కోహీర్ అక్టోబరు 22 (వుదయం ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పిచ్చరాగడి పాత తాండ గ్రామ పంచాయతీ ఆవరణలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గురువారం భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు, సర్పంచ్ ప్రతినిధి రాథోడ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన దళిత, గిరిజన సంఘాల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబేద్కర్ ఆశయాలు, అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని నాయకులు పిలుపునిచ్చారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని తొలి గిరిజన తాండగా పేర్కొంటున్న పిచ్చరాగడిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న రాథోడ్ వినోద్ కుమార్ చొరవను నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తాండ మాజీ సర్పంచ్ చౌహాన్ చందర్, వార్డు సభ్యులు రామావత్ నర్సింలు,

రాథోడ్ సంజీవ్ కుమార్, సజ్జాపూర్ ఉప సర్పంచ్ మైసయ్య, లోకనాథం, భ్యగారి అశోక్, టీ. సంజీవులు, ప్రకాష్, సచిన్‌తో పాటు పలువురు దళిత, గిరిజన సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్య మాల ద్వారా విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయ డం, తప్పుడు ప్రచారం నిర్వహించడం, కుల, మత, ప్రాంతీయ విభేదాలను ప్రోత్సహించడం, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోస్టులు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాఎస్పీ డాక్టర్ వినీత్ హెచ్చరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఫేస్ బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో సమాజంలో అశాంతిని సృష్టించేలా, ప్రజల మధ్య విద్వేషాలను పెంచేలా, ఒక వర్గాన్ని కించపరిచేలా ఉన్న పోస్టులు, ఫొటోలు, వీడి యోలను ప్రచారం చేయ డం, ఇతరులకు ఫార్వర్డ్ చేయడం చట్టరీత్యా నేరమ ని తెలిపారు. ముఖ్యంగా, వాటి నిజానిజాలు తెలుసుకోకుండా ఇతరుల నుంచి వచ్చిన పోస్టులను షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయ డం వల్ల చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సామాజిక మాధ్యమాలను ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాల కోసం వినియోగించుకోవాలని, వ్యక్తిగత దూషణలు, విద్వేషపూరిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలకు వేదిక గా మార్చుకోవద్దని సూచిం చారు. సోషల్ మీడియా గ్రూపుల్లో అభ్యంతరక రమైన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టు లు వ్యాప్తి చెందకుండా గ్రూప్ అడ్మిన్లు అప్రమత్తం గా ఉండాలని తెలిపారు. నేర స్వభావాన్ని, సంబంధిత వ్యక్తుల పాత్రను బట్టి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో సామాజిక మాధ్యమాలపై పోలీసుల ప్రత్యేక నిఘా

కొనసాగుతోందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిని నిరంతరం పర్యవే క్షించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టినా, ఇత రులకు ఫార్వర్డ్ చేసినా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజంలో శాంతి, సామరస్యాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించా లని ఎస్పీ కోరారు.

బర్రె దొంగతనం ఆరోపణలు.. కేసు భయంతో యువకుడి సూసైడ్!

పెద్ద శంకరంపేట :అక్టోబర్ 22: (వూదయం) ప్రతినిధి.

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట బూరుగుపల్లి గ్రామంలో బర్రెను దొంగిలించాడనే ఆరోపణలు, పోలీస్ కేసు అవుతుందనే భయంతో ఒక యువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన బూరుగుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.

బూరుగుపల్లి గ్రామానికి చెందిన బోయిని సంగమేశ్వర్ (31) ఈ నెల 20వ తేదీ రాత్రి 1:00 గంటల సమయంలో కోటప్పకు చెందిన గేదెను తోలుకెళ్తుండగా, కోటప్ప తండ్రి భూమయ్య చూసి అతడిని అడ్డుకుని బర్రెను స్వాధీనం చేసుకున్నాడు. అనంతరం తెల్లవారి ఉదయం గ్రామంలో పంచాయితీ నిర్వహించి, సంగమేశ్వర్‌కు ₹50,000ల జరిమానా విధించారు.

ఈ విషయమై తనపై ఎక్కడ పోలీస్ కేసు నమోదవుతుందోనని తీవ్ర మనస్తాపానికి గురైన సంగమేశ్వర్, నిన్న సాయంత్రం తన ఇంట్లోకి వెళ్లి తలుపులు మూసి వేసుకుని, విద్యుత్ వైరుతో దూలానికి ఉరివేసుకొని చనిపోయాడు.మృతుని అన్న బోయిని దత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా ముగిసిన బీపీఎల్ సీజన్ –8 క్రికెట్ టోర్నమెంట్!

- విజేతలకు ప్రథమ ద్వితీయ రూ.40 వేలు, 30 వేలు బహుమతి!
- ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కమలాభాయ్ కమల్‌సింగ్
- బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు దారాసింగ్

చిన్నంబావి మండలం 22 వుదయం రిపోర్టర్

క్రీడాకారులను అభినందించిన గ్రామ పెద్దలు విజయదశమి వేడుకల్లో క్రీడా సంబరాలు యువతలో ఉత్సాహం నింపిన బీపీఎల్ పోటీలు విజయదశమి పండుగను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా బీపీఎల్ సీజన్-8 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వాహకులు విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీలను గ్రామ యువతను ప్రోత్సహిస్తూ ముందుండి ఈ కార్యక్రమానికి సాధ్యం పోసిన మహా వ్యక్తి, నిరాంబరుడు, ఆదర్శప్రాయుడు, బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు ధారాసింగ్, ఈ పోటీల్లో ఏడు క్రికెట్ జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. హోరా హోరీగా సాగిన క్రికెట్ మ్యాచ్‌లు క్రీడా అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆటగాళ్ల ఉత్సాహం, జట్ల మధ్య పోటీ, గెలుపు కోసం చేసిన ప్రయత్నాలతో టోర్నమెంట్ ఆసక్తికరంగా సాగింది. విజేతలకు భారీ నగదు బహుమతులు బీపీఎల్ సీజన్-8 క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలను ప్రోత్సహించేందుకు దాతలు భారీ నగదు బహుమతులను అందించారు. మొదటి బహుమతిగా రూ.40,000లను దాత ధారాసింగ్ ప్రకటించగా, రెండో బహుమతిగా రూ.30,000లను ఉపసర్పంచ్ శివ అందించారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడంతోపాటు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కమలాభాయ్ కమల్‌సింగ్ ఈ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

విజయదశమి

పండుగ సందర్భంగా క్రీడా పోటీలను నిర్వహించడం ద్వారా గ్రామంలో ఐకమత్యం, స్నేహభావం, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, సమిష్టి కృషి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం ప్రస్తుత కాలంలో యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని క్రీడాభిమానులు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విజయదశమి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన బీపీఎల్ సీజన్-8 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగియడంతో క్రీడాకారులు, నిర్వాహకులు, గ్రామస్తుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. భవిష్యత్తులోనూ ఇలాంటి క్రీడా పోటీలను మరింత ఘనంగా నిర్వహించి యువతను ప్రోత్సహించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కీతపాగ సుధాకర్, సాయి ప్రణీత్ గౌడ్, కేతపాగ విజయ్ కుమార్, గోపి నాయుడు, హోటల్ రాముడు, దేవని వెంకటేష్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం చేశారు.

నీటిని వృథా చేయొద్దు..

- రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించిన జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్,

టేక్మాల్, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి)

నీటిని వృథా చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మెదక్ జిల్లా మండల కేంద్రంలో టేక్మాల్ రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎల్లుపేట రైతు వేదికలో వివిధ గ్రామాల రైతులకు నీటి పొదుపు, సాగు భూమి సంరక్షణపై కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే వరి వైపు మొగ్గు చూపకుండా, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలైన జొన్నలు, శనగలు, తెల్ల కుసుమలు, పొద్దుతిరుగుడు, కూరగాయలను సాగు చేయాలని కోరారు. నీటి వనరులు సరిగ్గా లేకుండా పంటలు వేసి రైతులు ఆర్థికంగా నష్టపోవద్దని స్పష్టం చేశారు.ఖేత్ బచావో'తో భూసార పరిరక్షణ ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా భూసార సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ భూముల్లో పరిమితికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూసారం క్షీణించడమే కాకుండా సాగు ఖర్చులు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. రైతులందరూ తప్పనిసరిగా మట్టి నమూనా పరీక్షలు చేయించుకుని, దానికి అనుగుణంగానే యూరియా, డిఏపి వంటి ఎరువులను తగిన మోతాదులో వాడాలని సూచించారు. పంట కోతల అనంతరం మిగిలిన కొయ్యకాళ్లను వరి వ్యర్థాలు తగలబెట్టకుండా, పొలంలోనే కలియదున్నడం వల్ల నేల సారవంతం అవుతుందని వివరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ ప్రసాద్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎఫ్‌పీవో వెంకటేశం, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి సుభాష్, ఎల్లుపేట గ్రామ సర్పంచ్ ఎల్లరెడ్డిగారి మాధవి నర్సింహారెడ్డితో పాటు ఎల్లుపేట క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పండుగ సాయన్న సేవలు, పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

మెదక్ అక్టోబర్ 22 వుదయం ప్రతినిధి.)

అణగారిన, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కొనియాడారు.గురువారం మెదక్ కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్‌లో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని గుర్తుచేశారు. సామాజిక అసమానతలు, అన్యాయాలపై ప్రజల పక్షాన నిలిచి ఆయన సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సాయన్న ఏ ఒక్క వర్గానికో పరిమితం కాకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలను, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కలెక్టరేట్ ఆవరణలో డిఆర్‌వో అంబదాస్ రాజేశ్వర్.. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ వేడుకల్లో డిపిఆర్‌వో రామచంద్ర రాజు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, ముదిరాజ్ సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాలు, కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పండుగ సాయన్న జయంతిని అన్ని ప్రభుత్వ శాఖల్లో అధికారికంగా నిర్వహించాలి

నారాయణపేట అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి)

బహుజన బంధువు, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజలచే కీర్తించబడిన పండుగ సాయన్న జయంతిని కేవలం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహించడం ముదిరాజ్ సామాజిక వర్గానికి అవమానకరమని గడి మున్కన్‌పల్లి మాజీ సర్పంచ్ సుభాష్ డిమాండ్ చేశారు. పండుగ సాయన్న జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడాతు పండుగ సాయన్న కేవలం ముదిరాజుల నాయకుడే కాదని నిజం నిరంకుషానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప స్వతంత్ర సమరయోధుడన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని బూటకపు మాటలతో మభ్య పెట్టడం సరికాదన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో జయంతి వేడుకలు నిర్వహించేలా జీఓ జారిచేసి నిర్వహించినప్పుడే నిజమైన గుర్తింపు లభిస్తుందని తెలిపారు.గ్రామపంచాయతీ మొదలు విద్యా, వైద్య రెవెన

చక్కని ఆరోగ్యం

ఉపవాసం తర్వాత బరువు పెరగకుండా..!

దసరా శరన్నవరాత్రులు ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని భక్తితో సేవించిన వారంతా ఉపవాస దీక్షలు ముగించుకొని సాధారణ జీవనశైలికి అలవాటు పడుతున్నారు. అయితే ఇలా ఉపవాసం పూర్తయ్యాక కొంతమందిలో త్వరితగతిన బరువు పెరిగే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. ఆహారం విషయంలో చేసే కొన్ని పొరపాట్లే ఇందుకు కారణమంటున్నారు. ఒక్కోసారి ఇవి జీర్ణవ్యవస్థ పైనా ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందంటున్నారు. మరి, ఇంతకీ ఉపవాసం ముగిశాక బరువు పెరగడానికి గల కారణాలేంటి? ఈ సమయంలో బరువును అదుపులో ఉంచుకోవాలంటే ఏం చేయాలి? తెలుసుకుందాం రండి..

అప్పటిదాకా ఉపవాస దీక్ష చేయాలన్న లక్ష్యంతో ఆహార కోరికలను అదుపు చేసుకుంటూ ముందుకు సాగుతాం. అదే ఒక్కసారి దీక్ష విరమించాక మనసు రిలాక్సవుతుంది. ఈ సమయంలో ఆహారం విషయంలో ఎలాంటి నిబంధనలు అక్కర్లేదన్న నిర్లక్ష్యం ఎక్కువవుతుంది. నూనెలు, మసాలాలు, చక్కెర.. మొదలైనవి అధికంగా ఉండే జంక్‌ఫుడ్ పైకి మనసు లాగేలా చేస్తుంది. ఇంకేముంది? ముందూ వెనకా ఆలోచించకుండా ఆయా పదార్థాల్ని తినేస్తుంటాం. ఉపవాస దీక్ష తర్వాత వేగంగా బరువు పెరిగేందుకు ఇదీ ఓ కారణమే అంటున్నారు నిపుణులు.

అంతేకాదు.. ఆహారం విషయంలో ఇలా నిర్లక్ష్యంగా ఉండడం వల్ల ఆరోగ్యం పైనా ప్రతికూల ప్రభావం పడుతుందని చెబుతున్నారు. అదెలాగంటే.. ఉపవాసం సమయంలో ఆహారం ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల జీర్ణవ్యవస్థకు కాస్త విశ్రాంతి దొరుకుతుంది. అదే దీక్ష ముగిసిన వెంటనే ఎక్కువగా ఆహారం తిన్నా, అదీ అనారోగ్యకరమైన ఆహారం తీసుకున్నా.. జీర్ణవ్యవస్థ అందుకు అనుగుణంగా పనిచేయలేదు.. తద్వారా వాటిని సులభంగా అరిగించుకోలేదు. దాంతో వికారం, వాంతులు, మలబద్ధకం, గుండెలో మంట.. వంటి సమస్యలు తలెత్తుతాయంటున్నారు నిపుణులు.

ఉపవాస దీక్షకు అలవాటైన శరీరం తిరిగి సాధారణ జీవనశైలికి మారేందుకు కొంత సమయం పడుతుంది. కాబట్టి ఈ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే అప్పటిదాకా కొద్ది మోతాదులోనే.. సులభంగా జీర్ణమయ్యే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ నెమ్మదిగా జీర్ణశక్తిని పెంచుకుంటూ పోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పీచు, ప్రొబయాటిక్స్ ఎక్కువగా ఉండే పదార్థాల్ని మెనూలో చేర్చుకోవాలి. పప్పులు, అవకాడో, పండ్లు, నట్స్, కాయధాన్యాలు.. వంటి వాటిలో పీచు ఎక్కువగా లభిస్తుంది. ప్రొబయాటిక్స్ కోసం పెరుగు, ఇడ్లీ/దోశ.. వంటివి తీసుకోవాలి. ఇవి తేలిగ్గా జీర్ణమవడంతో పాటు అరుగుదలనూ ప్రేరేపిస్తాయి.

ఉపవాసం తర్వాత జీర్ణశక్తిని పెంచుకోవడానికి తేలిగ్గా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవడంతో పాటు.. బరువు పెరగకుండా ఉండేందుకు కొన్ని నియమాలు పాటించడమూ ముఖ్యమంటున్నారు నిపుణులు. క్రమశిక్షణ, ప్రణాళికతోనే దేన్నైనా అలవాటు చేసుకోగలుగుతాం. ఉపవాసం తర్వాత బరువు అదుపులో ఉంచుకోవాలన్నా ఇదే నియమం వర్తిస్తుంది. కాబట్టి జంక్‌ఫుడ్/చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలకు దూరంగా ఉంటూ.. ఆరోగ్యకరమైన పదార్థాలు మాత్రమే తీసుకోవాలన్న నియమం పెట్టుకుని దాన్నే అనుసరించాలి.

కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల కూడా బరువును అదుపులో ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. దీనివల్ల శరీరంలో అనవసర కొవ్వులు పేరుకుపోకుండా.. తద్వారా బరువు పెరగకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు.

తగినన్ని నీళ్లు తాగడమూ ముఖ్యమే! తద్వారా డీహైడ్రేషన్ తలెత్తకుండా జాగ్రత్తపడచ్చు.

మనసు పెట్టి తినడం వల్ల ఎక్కువ మొత్తంలో ఆహారం తీసుకోకుండా అదుపు చేసుకోవచ్చు. ఇది కూడా బరువు అదుపులో ఉంచుకునేందుకు చక్కటి మార్గమే!

బరువు అదుపులో ఉంచుకోవడానికి వ్యాయామం చక్కటి ప్రత్యామ్నాయం అంటున్నారు నిపుణులు. అయితే ఉపవాసం తర్వాత.. తేలికపాటి వ్యాయామాలతో ప్రారంభించి.. క్రమంగా తీవ్రతను పెంచుకుంటూ పోవడం వల్ల ఇటు ఆరోగ్యంపై, అటు శరీరంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు.

అయితే ఇన్ని చేసినా ఉపవాసం తర్వాత బరువు పెరిగినట్లు, ఇతరత్రా జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తినట్లు గమనిస్తే.. వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

కేశ సంరక్షణ కోసం..!

వేప వల్ల మన చర్మానికి, జుట్టుకు ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం తెలిసిందే. అందుకే దీనిని వివిధ సౌందర్య ఉత్పత్తుల తయారీలో వాడుతుంటారు. ఈ క్రమంలో – ప్రత్యేకించి కేశ సంరక్షణలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది అంటున్నారు నిపుణులు. వేపాకుల పొడిని తరచూ ఉపయోగిస్తూ ఉంటే తలలోని ఇన్ఫెక్షన్లు దూరమవుతాయంటున్నారు నిపుణులు. వేప నూనెను తలకు పట్టించడం వల్ల జుట్టు రాలే సమస్య తగ్గే అవకాశం ఉంటుందట. దీంతో పాటు జుట్టు చిట్లిపోవడం కూడా తగ్గుతుందంటున్నారు నిపుణులు.

కొన్ని వేపాకులను తగినన్ని నీళ్లలో వేసి మరిగించి, దీన్లో తేనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి అరగంట ఉంచి తర్వాత కడిగేయాలి. ఇది జుట్టుకు కండిషనర్‌గా పనిచేస్తుంది. బిరుసుగా ఉన్న జుట్టును మెత్తగా మార్చడమే కాకుండా చుండ్రును కూడా తొలగిస్తుందంటున్నారు నిపుణులు.

కొన్ని రకాల సబ్బులు, షాంపూలు, లోషన్స్, క్రీమ్స్ వంటి వాటిలో వేప నూనెను ఉపయోగిస్తారు. దీనికి చర్మాన్ని లోపలి నుంచి శుభ్రం చేసే గుణం ఉంటుంది. దీని వల్ల చర్మం కాంతిమంతంగా మారుతుంది అంటున్నారు నిపుణులు.

అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. వ్యక్తిగతంగా ఎవరికి వారు తమ జుట్టు తత్వానికి సరిపడతాయో లేదో పరిశీలించుకోవాలి. అవసరమైతే ఆయా పదార్థాలను వాడే ముందు సంబంధిత నిపుణులను సంప్రదించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం మంచిది.

ప్రసాదంగా... గుగ్గిళ్లే ఎందుకు?

దసరా... అమ్మవారికి చేసే పూజలతో పాటు ఈ పర్వదినాల్లో ఇళ్లల్లో ఏర్పాటు చేసే బొమ్మల కొలువు కూడా అంతే ప్రత్యేకం కదా! రోజూ ముత్తైదువులు, చిన్నారులు బొమ్మలను రోజుకో అలంకరణతో అందంగా ముస్తాబుచేసి, సాయంత్రం భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, గుగ్గిళ్లను (అలసందలు, సెనగలు, పెసలు, పల్లీలు కలిపి) నైవేద్యంగా సమర్పిస్తారు. ఇది ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయమే అయినా ఈ ఆచారం వెనక మహిళలకు, చిన్నారులకు మేలుచేసే ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. అవి ఏంటంటే... పండుగ పనులు, ఒత్తిడితో అలసిపోయిన మహిళలకు ఇవి తక్షణ శక్తిని అందిస్తాయి. వీటిలో ఉండే ఐరన్, ఫోలేట్‌లు రక్తహీనతను తగ్గించి, హార్మోన్ల సమతుల్యతను కాపాడతాయి. అంతేకాదు, కాల్షియం, మెగ్నీషియం ఎముకల దృఢత్వానికి తోడ్పడతాయి. ఎదుగుతున్న చిన్నారులకు ఈ గుగ్గిళ్లు పౌష్టికాహారం కూడా. ఈ వయసులో వాళ్లకు కావాల్సిన శక్తి, కండరాల దృఢత్వానికి అవసరమయ్యే ప్రొటీన్లు ఇందులో పుష్కలంగా ఉంటాయి. వీటిలో ఉండే విటమిన్లు, ఖనిజాలు వాళ్లు రోజంతా ఉత్సాహంగా, చురుగ్గా ఉండేందుకు శక్తిని అందిస్తాయి. కాగా, పోపులో వాడే జీలకర్ర, ఇంగువ వంటివి చిన్నారుల్లో జీర్ణసమస్యల్ని నయం చేస్తాయి. అందుకే వీటిని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, తర్వాత కొలువు చూడ్డానికి వచ్చిన అతిథులు, మహిళలు, చిన్నారులకు ప్రసాదంగా పెడతారట.

ఒత్తిడా.. డ్యాన్స్ చేసేద్దాం!

డ్యాన్స్ చేయాలంటే సంగీతం కావాలి. ఈ మ్యూజిక్ శరీరంలో కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్లు) స్థాయుల్ని తగ్గిస్తుంది. ఫలితంగా ఆందోళన తగ్గుతుంది.

పాట మొదలవగానే మనకు తెలియకుండానే కాళ్లు కదుపుతాం.. శరీరంలోని అన్ని అవయవాలకూ ఊపొస్తుంది. హ్యాపీ హార్మోన్లైన డోపమైన్, ఎండార్ఫిన్లు విడుదలవడమే ఇందుకు కారణం. ఇలా డ్యాన్స్ చేస్తుంటే మనసు కుదుటపడుతుంది. దీన్నే అలవాటుగా మార్చుకుంటే క్రమంగా ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత సొంతమవుతుందంటున్నారు నిపుణులు. నచ్చిన పని చేస్తున్నప్పుడు దానిపైనే పూర్తి ఏకాగ్రత పెడతాం. తద్వారా మన బాధలన్నీ మర్చిపోతాం. ఇదే విధంగా డ్యాన్స్ కూడా మానసిక సమస్యల్ని దూరం చేసి ప్రశాంతతను అందిస్తుంది.

ఒంటరిగా డ్యాన్స్ చేయడం ఇష్టం లేని వారు ఇంట్లో భాగస్వామితో కలిసి నృత్యం చేయచ్చు. ఈ క్రమంలో ఒకరి శరీరాన్ని మరొకరు తాకడం వల్ల ఆక్సిటోసిన్ అనే లవ్ హార్మోన్ విడుదలవుతుంది. ఇది మనసుకు సాంత్వన చేకూర్చుతుందంటున్నారు నిపుణులు.

రోజూ ఒకే రకమైన జిమ్ వ్యాయామాలంటే ఎవరికైనా బోరే! అదే డ్యాన్స్‌లో అయితే విభిన్న భంగిమలు ప్రయత్నించచ్చు. ఇది పరోక్షంగా ఒత్తిడినీ దూరం చేస్తుంది.

డ్యాన్స్ క్లాసుల్లో చేరడం వల్ల మన చుట్టూ ఉన్న వారితో అనుబంధాన్ని పెంచుకోవచ్చు. ఇదీ ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ఓ మార్గమే అంటున్నారు నిపుణులు.

కొంతమంది తమకు ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనల్ని తమలోనే దాచుకుంటారు. దానివల్ల మానసికంగా మరింత ఇబ్బంది పడుతుంటారు. అదే భావోద్వేగాల్ని డ్యాన్స్ రూపంలో వ్యక్తపరిస్తే మనసు కాస్త కుదుటపడుతుంది.

మానసిక సమస్యల కారణంగా ఆయా శారీరక కండరాలపై ఒత్తిడి పడుతుంది. అదే డ్యాన్స్ వల్ల ఈ కండరాలు కాస్త రిలాక్సవుతాయి.. శరీరంలో శక్తి స్థాయులూ పెరుగుతాయి. పరోక్షంగా ఇది మానసిక ప్రశాంతతను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

నృత్యం శరీరంలో సెరటోనిన్ స్థాయుల్ని పెంచుతుందని, ఫలితంగా ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత సొంతమవుతుందని పలు పరిశోధనలూ రుజువు చేశాయి.

అలాగే డ్యాన్స్‌తో శరీర అవయవాలకూ చక్కటి వ్యాయామం అందుతుంది. కాబట్టి ఇటు శరీరానికి దృఢత్వాన్ని అందిస్తూనే.. అటు మానసికంగా ప్రశాంతతను సొంతం చేసుకోవాలంటే ఓ అరగంట పాటు నృత్యం చేయండి. తద్వారా అటు సరదాగా ఎంజాయ్ చేయచ్చు.. ఇటు ఒత్తిడినీ దూరం చేసుకోవచ్చు.. అంటున్నారు నిపుణులు.

ఏకాగ్రతను పెంచే... జ్ఞానముద్ర

తిప్పి పెట్టండి. ఇప్పుడు చేతి వేళ్లను పూర్తిగా తెరిచి ఉంచాలి. బొటనవేలు కొనను, చూపుడువేలు కొనతో సున్నితంగా తాకండి. మిగిలిన మూడు వేళ్లను చాచి ఉంచండి. కళ్లను మూసి ఉంచండి. దీనిద్వారా ప్రశాంతతను అనుభూతి చెందుతారు. దీర్ఘశ్వాసలు చేస్తూ, శ్వాస మీదనే ధ్యాస ఉంచండి. వేళ్ల కొనలద్వారా ప్రవహించే ఆ దివ్యశక్తిని అనుభూతి చెందండి. 10–15 నిమిషాలైనా ఈ స్థితిలో స్థిమితంగా ఉండే ప్రయత్నం చేయండి. తర్వాత శవాసనంలో పడుకొని విశ్రాంతి పొందండి.

ఉపయోగాలు: మెదడుని చురుగ్గా, ఉత్సాహంగా ఉంచుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మానసికంగా దృఢంగా ఉంటారు.

మ్యాట్‌పైన సౌకర్యవంతంగా కూర్చోండి. వేయగలిగితే పద్మాసనం/వజ్రాసనంలో కూర్చోండి. వెన్నెముకను నిటారుగా పెట్టాలి. చేతుల్ని మీ మోకాళ్లపై ఉంచి అరచేయి పెట్టి ఆకాశంవైపు

మెనోపాజ్.. వీటి గురించి అవగాహన పెంచుకోవాలి!

మెనోపాజ్‌కు చేరువవుతోన్న మహిళల సమస్యలు ఒకటా, రెండా.. చాలానే ఉంటాయి. అయితే వీటి గురించి స్పష్టమైన అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి లక్షణాలు కనిపిస్తే మహిళలు ఆందోళన చెందుతుంటారు. మరోవైపు వీటి గురించి డాక్టర్‌తో పంచుకోవడానికీ సిగ్గుపడుతుంటారు. అయితే ఈ సిగ్గు, బిడియం వదిలి.. మెనోపాజ్ గురించి ముందుగానే అవగాహన పెంచుకుంటే.. ఈ దశలోనూ ఆరోగ్యంగా, సౌకర్యంగా ఉండచ్చంటున్నారు నిపుణులు. ఇందుకోసం డాక్టర్‌ను సంప్రదించి మెనోపాజ్ గురించి కొన్ని ప్రశ్నలు అడగడం తప్పనిసరి అంటున్నారు. ఆ లక్షణాల్ని ఎలా అధిగమించాలి?

ప్రతి మహిళ జీవితంలో మెనోపాజ్ సహజం. సాధారణంగా 40–50 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు ఈ దశకు చేరుకుంటారు. కొంతమందిలో ఇంకా ముందే ఈ ప్రక్రియ జరుగుతుంది. దీన్ని 'ప్రిమెచ్యూర్ మెనోపాజ్'గా పిలుస్తారు. ఏదేమైనా ఈ దశలోకి ప్రవేశించే క్రమంలో మహిళల్లో కొన్ని సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. నెలసరి క్రమం తప్పడం, రాత్రుళ్లు ఉన్నట్లుండి చెమటలు పట్టడం, వెజైనా పొడిబారిపోవడం, లైంగిక కోరికలు తగ్గిపోవడం, అలసట, నీరసం, చిరాకు, ఒత్తిడి, జీర్ణ సంబంధిత సమస్యలు.. ఇలా ఈ దశలో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. నిజానికి ఈ సమస్యలన్నీ సహజంగా తలత్తేవే అయినా.. వీటిని అదుపు చేసుకొని ఆరోగ్యంగా ఉండే ప్రత్యామ్నాయ మార్గాలూ ఉన్నాయంటున్నారు నిపుణులు. అందుకే మెనోపాజ్ దశలోకి ప్రవేశించే మహిళలు ముందుగానే వీటి గురించి డాక్టర్‌ని అడిగి తెలుసుకోవాలి. ఈ క్రమంలో ఆహారం, వ్యాయామం, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులేంటో తెలుసుకొని.. ముందు నుంచే వాటిని పాటించాలి. అప్పుడే ఈ దశనూ సౌకర్యవంతంగా దాటేయగలుగుతాం.

మెనోపాజ్ దశలోకి ప్రవేశించే మహిళల శరీరంలో హార్మోన్ల స్థాయుల్లో జరిగే మార్పుల వల్లే ఆయా లక్షణాలు కనిపిస్తుంటాయట. వీటిని దూరం చేసుకోవడానికి కొంతమంది హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ వంటి చికిత్సలు సూచిస్తుంటారు. నిజానికి ఇవి అవసరమా? మీ శరీరతత్వానికి ఇవి నప్పుతాయా? అన్న విషయం డాక్టర్‌ని అడిగి తెలుసుకోవాలి. అంతేకాదు.. వీటి వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాల గురించి కూడా అవగాహన పెంచుకుంటే.. మీ చుట్టూ ఉన్న మహిళలకు వీటి గురించి చెప్పచ్చు. ఇక హార్మోన్ థెరపీ తీసుకోని వారు వీటికి ప్రత్యామ్నాయంగా ఉన్న ఇతర మార్గాల గురించీ డాక్టర్‌ని అడిగి తెలుసుకోవడం ఉత్తమం. మెనోపాజ్ దశలోకి ప్రవేశించిన మహిళల్లో గుండె సంబంధిత సమస్యలు వచ్చే ముప్పు ఎక్కువని పరిశోధనలు చెబుతున్నాయి. అలాగే ఈ దశలో ఆస్టియోపొరోసిస్ బారిన పడేవారూ ఎక్కువేనని నిపుణులు అంటున్నారు. అందుకే వీటి గురించి ముందుగానే అవగాహన పెంచుకోవడం వల్ల గుండె, ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చంటున్నారు. ఈ క్రమంలోనే ఆయా అవయవాల పనితీరు, ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి ఎలాంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలో డాక్టర్‌ని అడిగి.. వాటిని చేయించుకోవాలి. ఏవైనా సమస్యలుంటే వాటికి మందులు వాడడం, ఆహారం–వ్యాయామ నియమాల్లో చేసుకోవాల్సిన మార్పుల గురించీ అడిగి తెలుసుకొని.. వాటిని పాటించడం ముఖ్యం. ఇలా చేసుకొనే మార్పులే ఇటు గుండె, ఎముకల్నీ దృఢంగా చేస్తాయి.. మరోవైపు మెనోపాజ్ దశలోనూ సౌకర్యవంతంగా ఉండేలా చేస్తాయి. మెనోపాజ్ దశలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్.. వంటి లైంగిక హార్మోన్ల స్థాయులు చాలావరకు తగ్గిపోతాయట. దీనివల్ల కొందరిలో వెజైనా పొడిబారిపోయి శృంగార కోరికలు తగ్గుతాయి. అయితే ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అటు లైంగిక ఆరోగ్యం దెబ్బతింటుంది.. మరోవైపు అనుబంధానికీ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ విషయంలో సిగ్గుపడకుండా సంబంధిత నిపుణులను సంప్రదించాలి. అలాగే ఈ దశలో కొంతమంది వివిధ రకాల చికిత్సలు తీసుకోవడం, లూబ్రికెంట్స్/క్రీమ్స్ వాడడం.. వంటివి చేస్తారు. ఇవి మంచివేనా అన్న విషయం వాడే ముందే డాక్టర్‌ని అడిగి తెలుసుకోవాలి. మెనోపాజ్ దశలో శరీరంలో తలెత్తే హార్మోన్ల మార్పుల కారణంగా కొందరిలో మానసిక ఆరోగ్యం పైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. ఫలితంగా ఒత్తిడి, ఆందోళన, చిరాకు, మూడ్ స్వింగ్స్.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటిని అధిగమించే మార్గాల గురించీ డాక్టర్‌ని అడిగి తెలుసుకోవడం మంచిది.

అందంగా మెరిసేలా..!

పండగైనా, ప్రత్యేక సందర్భమైనా అమ్మాయిల మనసు అందం మీదకే మళ్లుతుంది. రోజూ కనిపించే కంటే మరింత అందంగా మెరిసిపోవాలనుకుంటారు. అందుకే పార్లర్లు, స్పా సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఇంట్లోనే లభించే కొన్ని సహజసిద్ధమైన పదార్థాలతో వందలు, వేలు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండానే అందంగా మెరిసిపోవచ్చు అంటున్నారు నిపుణులు.

చాలామంది ఇంట్లో బాగా పండిన అరటిపండ్లు తినడం ఇష్టం లేక పడేస్తుంటారు. కానీ అలా బాగా మగ్గిన అరటిపండు అందాన్ని ఇనుమడింపజేయడంలో కీలక పాత్ర పోషిస్తుందట. ఈ క్రమంలో ఒక బౌల్‌లో కొద్దిగా అరటిపండును గుజ్జులా చేసి అందులో కొన్ని పాలు పోసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని ముఖం, మెడకు పట్టించి ఒక పది నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. ఆపై ఈ ప్యాక్ ఆరిపోయేంత వరకు అలాగే ఉంచుకోవాలి. ఇప్పుడు చల్లటి నీటితో కడిగేసుకుంటే సరిపోతుంది. ఇలా క్రమం తప్పకుండా ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల చర్మానికి తేమ అందుతుంది. తద్వారా చర్మం పొడిబారే సమస్య నుంచి బయటపడచ్చు

అంటున్నారు నిపుణులు. ఏ కాలమైనా మనల్ని వేధించే సమస్య మొటిమలు, మచ్చలు. వీటివల్ల ఎంత ప్రకాశవంతంగా ఉన్న ముఖమైనా అందవిహీనంగా కనిపిస్తుంది. మరి అలాంటప్పుడు కీరాదోసను ప్రయత్నించి చూడండి అంటున్నారు నిపుణులు. ఇందుకోసం కీరాను చిన్న చిన్న సన్నటి స్లైసుల్లా కట్ చేసి ఓ గంట పాటు ఫ్రిజ్‌లో పెట్టేయండి. ఆ తర్వాత వాటిని ముఖంపై పరచుకొని, కళ్లపై పెట్టుకొని ఇరవై నిమిషాల పాటు సేదదీరండి. ఇప్పుడు స్లైసులు తొలగించి చల్లటి నీటితో ముఖం కడిగేసుకుంటే అలసట మాయమై చర్మం తిరిగి ప్రకాశవంతంగా మారుతుందని చెబుతున్నారు. కొంతమందికి జుట్టు పొడిబారిపోయి గడ్డిలా కనిపిస్తుంటుంది. దాంతో అందం దెబ్బతింటుంది. అయితే ఇందుకోసం తేనెతో తయారు చేసిన ఈ హెయిర్ మాస్క్ చక్కగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. అరకప్పు చిక్కటి పాలు తీసుకొని అందులో రెండు టీస్పూన్ల తేనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల దాకా పట్టించి అరగంట పాటు అలాగే ఉంచుకోవాలి. ఆపై చల్లటి నీటితో కడిగేసుకుంటే సరిపోతుంది. పాలు, తేనె జుట్టు తేమను కోల్పోకుండా కాపాడతాయి అంటున్నారు నిపుణులు.

అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

అమ్మలూ... ఇవి చూసుకోండి!

గర్భధారణలో రకరకాల సమస్యలు ఎదుర్కొనే మహిళల సంఖ్య పెరుగుతోంది. అయితే, ఇది అంతటితో ఆగితే పర్వాలేదు. కానీ, భవిష్యత్తులో అనేక వ్యాధులకు కారణమయ్యే ప్రమాదం అధికమని బీఎమ్‌జే మెడిసిన్‌లోని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రెగ్నెన్సీలో వచ్చే మధుమేహం, అధిక రక్తపోటు, ప్రసవానంతర డిప్రెషన్ వంటివి... తరవాతి కాలంలో కార్డియో మెటబాలిక్– రీనల్ అంటే... టైప్ 2 డయాబీటీస్, హృద్రోగాలు, అధిక రక్తపోటు, కిడ్నీ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతాయంటున్నారు శాస్త్రవేత్తలు. నెలలు నిండకముందు బిడ్డ పుట్టడం, గర్భస్రావం, మృతశిశు జననం, ప్లాసెంటల్ అబ్రప్షన్ (ప్రసవానికి ముందే గర్భాశయం లోపలి గోడ నుంచి ప్లాసెంటా వేరుపడటం), గర్భధారణ వయసు కన్నా తక్కువ లేదా ఎక్కువ బరువుతో శిశువులు జన్మించడం... వంటి సమస్యలు ఉన్నప్పుడు ఈ కార్డియో మెటబాలిక్ రీనల్ వ్యాధుల్లో కనీసం ఒకటైనా దాడి చేసే ప్రమాదం ఉందట.

ఈ పరిశోధన కోసం శాస్త్రవేత్తలు 2000– 2022 మధ్య కాలంలో గర్భవతుల ఆరోగ్య సమాచారాన్ని తీసుకున్నారు. గర్భధారణ సమయంలో వచ్చే అధిక రక్తపోటు, ప్రీ–ఎక్లాంప్సియా వల్ల భవిష్యత్తులో వారికి అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం మూడు రెట్లకు పైగా ఉండగా, కిడ్నీ వ్యాధి బారిన పడే ప్రమాదం రెండు రెట్లు పెరిగింది. జెస్టేషనల్ డయాబీటీస్ వల్ల టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం ఏడు రెట్లు ఎక్కువగా ఉండటంతోపాటు, అధిక రక్తపోటు, హృదయ సంబంధ వ్యాధుల రేటు కూడా పెరిగింది. ఇక, ప్రసవానంతర డిప్రెషన్ ఉంటే, ఈ నాలుగు రకాల కార్డియో మెటబాలిక్ రీనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం 35–56శాతం పెరిగిందట. కాబట్టి, ప్రెగ్నెన్సీలోనే కాదు, ఆ తరవాత కూడా సమస్యలు రాకుండా ఉండాలంటే జాగ్రత్త అవసరం. ముందు నుంచి వైద్యుల సూచనతో ఆరోగ్య జీవనశైలిని అనుసరిస్తూ ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకోవడం మంచిది.

ఇ-ముద్రా షేర్లు 35% పతనం!

డిజిటల్ సర్టిఫికేషన్ అథారిటీ ఇ-ముద్రా లిమిటెడ్‌కు చెందిన షేర్ల పతనం కొనసాగుతోంది. కంపెనీ జారీ చేసిన పబ్లిక్ కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (పీకేఐ) ప్రైవేట్ కీస్ బహిర్గతం అయినట్లు తేలడంతో కంపెనీ షేర్లు నేడు భారీగా పతనమయ్యాయి. గురువారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో ఎన్ఎస్ఈలో షేరు విలువ ఏకంగా 18 శాతం మేర క్షీణించి 351.35 వద్ద ట్రేడవుతోంది. గడిచిన రెండు సెషన్లలో వీటి విలువ 35 శాతం మేర పతనమైంది.

కార్ల అమ్మకాల్లో 21.9% క్షీణత: ఫాడా

నవరాత్రి సీజన్‌లో దేశీయంగా వాహన రిటెయిల్ విక్రయాల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. ఈనెల 11-20 తేదీల్లో దేశవ్యాప్తంగా వాహన రిజిస్ట్రేషన్‌లు, గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 6.52% తగ్గాయని వాహన డీలర్ల సమాఖ్య ఫాడా తెలిపింది. ప్రయాణికుల వాహనాల (పీవీలు-కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) విక్రయాలు 21.91% క్షీణించాయి. గతేడాది నవరాత్రి తొలిరోజే జీఎస్‌టీ రేట్ల కోత అమల్లోకి రావడంతో అప్పట్లో షోరూమ్‌లకు కొనుగోలుదారులు పోటెత్తారని, అప్పటి అధిక విక్రయాల (అధిక బేస్) కారణంగా ఈ ఏడాది వార్షిక విక్రయాల్లో క్షీణత కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. వాణిజ్య వాహనాలు, ట్రాక్టర్ల అమ్మకాలు స్వల్పంగా పెరిగాయి. గతేడాది నవరాత్రి 11 రోజుల పాటు సాగగా, ఈసారి 10 రోజులే ఉంది. అప్పట్లో రోజువారీ సగటున 1.09 లక్షల వాహనాలు అమ్ముడవ్వగా.. ఈసారి 1.12 లక్షలు విక్రయమయ్యాయని ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ తెలిపారు. విద్యుత్ వాహన రిటెయిల్ విక్రయాలు 26.78% పెరిగి 1,17,437 యూనిట్లకు చేరాయి. పండగ విక్రయాల్లో విద్యుత్ వాహనాల వాటా గతేడాది 7.7% నుంచి ఈసారి 10.5 శాతానికి పెరిగింది.

మూడో రోజూ నష్టాల్లో సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ పెరిగి బ్యారెల్ 112 డాలర్లకు చేరింది. దీంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. ఆ ప్రభావం సూచీలపై పడడంతో వరుసగా మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఉదయం 73,343.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,709.69) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 73,005.11 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 460.30 పాయింట్ల నష్టంతో 73,249.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 123.70 పాయింట్ల నష్టంతో 22,687.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.82గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బ్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 112 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4087.81 వద్ద ట్రేడవుతోంది.

దిగొచ్చిన బంగారం, వెండి..

బంగారం, వెండి కొనాలనుకునే వారికి తీపివార్త. పండగల వేళ వీటి ధరలు దిగొస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులతో ఈ లోహాల ధరలు తగ్గుతున్నాయి. చమురు మంటల భగభగలతో ద్రవ్యోల్బణ భయాలు, ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చనే ప్రచారంతో వాటి గిరాకీ తగ్గుతోంది. గురువారం ఉదయం హైదరాబాద్ విపణిలో మేలిమి 10 గ్రాముల పసిడి ధర రూ. 1,47,348 పలుకుతోంది. కేజీ వెండి ధర రూ.2.06 లక్షలకు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ (Gold) ధర నేడు 4089 డాలర్లకు దిగొచ్చింది. దాదాపుగా వారం రోజుల కనిష్ఠాలకు చేరింది. ఇక వెండి కూడా ఔన్సు ధర 56.32 డాలర్లకు పడిపోయింది. గోల్డ్ ఫ్యూచర్స్‌లో 10 గ్రాముల ధర రూ. 1.44 లక్షలుగా ఉంది. సిల్వర్ ఫ్యూచర్స్ కేజీ ధర రూ. 2.03లక్షల వద్ద ట్రేడవుతోంది.

స్పేస్‌ఎక్స్, టెస్లా మెగా విలీనం!

ప్రపంచంలోనే అతిపెద్ద విలీనానికి తెరలేస్తోంది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్, టెస్లా ఏకమయ్యే అవకాశాలున్నాయి. ఈ రెండు సంస్థలూ లక్ష కోట్ల డాలర్లకు పైగా విలువ కలిగినవే కావడం విశేషం. విద్యుత్ కార్ల దిగ్గజం టెస్లా విలువ 1.5 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.142.5 లక్షల కోట్లు) కాగా, స్పేస్ ఎక్స్ విలువ దాదాపు 2 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.190 లక్షల కోట్లు)గా ఉంది. ఈ రెండూ కలిస్తే, రూ.332.5 లక్షల కోట్ల (3.5 లక్షల కోట్ల డాలర్ల) విలువతో ప్రపంచంలోనే అతిపెద్ద భాగస్వామ్య సంస్థ ఏర్పడుతుందనడంలో సందేహం లేదు. ఈ రెండు కంపెనీలూ చిప్ సెట్లు, ఏఐ, ఇతర సాంకేతిక ప్రాజెక్టులపై పనిచేస్తున్నందున.. విలీనం వల్ల ప్రయోజనం కలుగుతుందని ఇరు సంస్థలకూ నీఈఓగా వ్యవహరిస్తున్న మస్క్ చెబుతున్నారు. టెస్లాకు చెందిన కార్లు, రోబోలు, సెల్ఫ్ డ్రైవింగ్ సాంకేతికతను, స్పేస్‌ఎక్స్‌కు చెందిన రాకెట్లు, డేటా సెంటర్లు, శాటిలైట్లు, టెలికం కార్యకలాపాలను కలపడం వల్ల, మార్స్‌పై నగరాన్ని ఏర్పాటు చేయాలన్న మస్క్ మిషన్‌లో ఒక అడుగు ముందుకు వేసినట్లవుతుంది. తాజా పరిణామాల మధ్య భారత కాలమాన ప్రకారం బుధవారం రాత్రి 11:30 గంటలకు స్పేస్ ఎక్స్ షేర్లు 7% లాభంలో, టెస్లా షేర్లు 3.6% లాభంలో ట్రేడవుతున్నాయి.

మెటాకు రూ. 2.3 లక్షల కోట్ల ఫైన్..

టెక్ దిగ్గజం మెటాక్‌కు భారీ షాక్ తగిలింది. న్యూ మెక్సికో కోర్టు 25 బిలియన్ డాలర్లు (రూ.2.3 లక్షల కోట్లు) పెనాల్టీ విధించింది. డేటా గోప్యత విషయంలో యూజర్లను కంపెనీ తప్పుదారి పట్టించిందని మెటా (Meta)పై ఆరోపణలు రాగా.. ఈ కేసులో న్యూ మెక్సికో కోర్టు తాజాగా దోషిగా తేల్చింది. ఆ పెనాల్టీ మొత్తాన్ని న్యూమెక్సికో రాష్ట్రానికి చెల్లించాలని ఆదేశించింది. అమెరికా చరిత్రలో ఒక కంపెనీపై విధించిన జరిమానాల్లో ఇది ఒకటిగా నిలిచింది. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో మిలియన్ల కొద్దీ ఫేస్‌బుక్ (ప్రస్తుతం మెటా) వినియోగదారుల డేటాను కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ సేకరించి, రాజకీయ ప్రచారాల కోసం దుర్వినియోగం చేసిందనేది ప్రధాన ఆరోపణ. ఇదొక బ్రిటిష్ కన్సల్టింగ్ సంస్థ. యూజర్ల సమ్మతి లేకుండా ఆ డేటా తీసుకోవడం అప్పట్లో పెను సంచలనమైంది. ఆ సంస్థకు చెందిన మాజీ ఉద్యోగి ద్వారా ఆ విషయం ప్రపంచానికి తెలిసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలేగాకుండా, బ్రెగ్జిట్ రిఫరెండం, భారత్, కెన్యా, నైజీరియా ఎన్నికల్లో కూడా ఈ సంస్థ జోక్యం చేసుకుందని ఆరోపణలు వచ్చాయి.

ఈ డేటా ఉల్లంఘనలపై న్యూ మెక్సికో అటార్నీ జనరల్ రౌల్ టోరెజ్ 2021లో మెటాపై దావావేశారు. యూజర్ల డేటా ఎవరి చేతికి వెళ్తుందనే విషయంలో కంపెనీ అబద్ధాలు చెప్పిందని ఆరోపించారు. ఈ కేసులో మెటాకు 219 బిలియన్ డాలర్ల మేర పెనాల్టీ పడుతుందని వార్తలు వచ్చాయి. అయితే, ఆ మొత్తాన్ని 25 బిలియన్ డాలర్లకు తగ్గిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఇదే కేంబ్రిడ్జ్ అనలిటికా కేసులో 2019లో మెటాపై 5 బిలియన్ డాలర్ల పెనాల్టీ పడింది. దానిని యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ విధించింది.

ఈ పెనాల్టీ మెటా (Meta) స్పందించింది. తాము అప్పీల్ వెళ్తామని, అక్కడ విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తంచేసింది. ఈ తీర్పుతో న్యూ మెక్సికో రాష్ట్రంలో వ్యాపారం చేయడాన్ని క్లిష్టంగా మార్చేస్తున్నారని పేర్కొంది. మెటా కంపెనీ విలువ రెండు ట్రిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఈ పెనాల్టీ విలువ భారీగానే ఉన్నప్పటికీ.. కంపెనీ విలువపై పెద్దగా ప్రభావం చూపదని విశ్లేషకులు చెప్తున్నారు. అప్పీళ్లతో కేసు సాగదీస్తుంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

స్మృతి సేన క్లీన్‌స్వీప్

స్మృతి మంధాన కెప్టెన్ అయ్యాక ఆడిన తొలి టీ20 సిరీస్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు క్లీన్‌స్వీప్ చేసింది. మూడో టీ20లో 92 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసిన భారత్.. సిరీస్‌ను 3-0తో చేజిక్కించుకుంది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్.. 7 వికెట్లకు 216 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ హర్మన్‌ప్రీత్ (91 నాటౌట్; 41 బంతుల్లో 10×4, 5×6), షెఫాలి వర్మ (69; 37 బంతుల్లో 6×4, 5×6) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. కెప్టెన్ స్మృతి మంధాన బ్యాటింగ్‌కు దిగకుండా, యువ బ్యాటర్ అనుష్క శర్మ (28)ను ఓపెనర్‌గా పంపింది. జింబాబ్వే బౌలర్లలో బిజా 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం నందని శర్మ (3/18) విజృంభించడంతో జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 124 పరుగులే చేసింది. షార్న్ మేయర్స్ (60) టాప్ స్కోరర్.

శీతల్ జోడీకి స్వర్ణం.. చరిత్ర సృష్టించిన స్వాతి..

పారా ఆసియా క్రీడల్లో భారత్ నాలుగో రోజూ మెరుగైన ప్రదర్శన చేస్తోంది. ఇవాళ ఇప్పటికే రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుంది. దీంతో భారత్ 73 పతకాలతో ఐదో స్థానంలో నిలిచింది. ఇందులో 17 స్వర్ణాలు, 22 రజతాలు, 34 కాంస్యాలు ఉన్నాయి. మహిళల వ్యక్తిగత విభాగంలో రజతం సాధించిన శీతల్ దేవి.. మిక్స్‌డ్ డబుల్స్‌లో తోమన్ కుమార్‌తో కలిసి స్వర్ణం సొంతం చేసుకుంది. ఫైనల్‌లో భారత్ 151-148 తేడాతో ఇండోనేషియాను ఓడించింది. మహిళల డిస్కస్ త్రో ఎఫ్54 విభాగంలో భారత్ అథ్లెట్ సువర్ణ రాజ్ 15.66 మీటర్లు విసిరి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం నెగ్గిన ఆమె.. మహిళల కాంపౌండ్ విభాగంలోనూ బంగారు పతకం కైవసం చేసుకుంది. ఫైనల్‌లో సింగపూర్ ఆర్చర్ అలిమ్ నుర్ స్యాహిదాపై 142-139 తేడాతో విజయం సాధించింది. దీంతో పారా ఆసియా క్రీడల్లో శీతల్ దేవి ప్రయాణం పసిడితో ముగిసింది. ఆసియా పారా గేమ్స్‌లో పోటీ పడిన మొదటి భారత డబ్ల్యూ1 ఆర్చర్ స్వాతి చౌదరి. W1 అంటే.. తీవ్రమైన శారీరక వైకల్యాలు ఉన్న వీల్‌ఛైర్ ఆర్చరీ విభాగం. వీల్‌ఛైర్‌లో కూర్చొని పోటీపడతారు. ఈ విభాగంలో స్వాతి ఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించింది. మొదటి సెట్‌ను గెలుచుకున్న ఆమె.. ఆ తర్వాత లయను కోల్పోయింది. చివరికి 4-6 తేడాతో ఓడిపోయి రజతం సాధించింది. బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ ఎస్ఎల్3 విభాగంలో సంజనా కుమారి కాంస్యం నెగ్గింది. అంతకుముందు పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4 కేటగిరీలో అభిజీత్, సుహాస్ యతిరాజ్ కాంస్యాలను సాధించారు. వీరిద్దరూ తమ సెమీఫైనల్ మ్యాచుల్లో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌హెచ్6 విభాగంలో కృష్ణ నాగర్ - నిత్య శ్రీ జోడీ కాంస్యంతో సరిపెట్టుకుంది. ఇండోనేషియాకు చెందిన రినా మార్లినా - సుభన్ 14-21, 18-21 తేడాతో భారత జోడీపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్ 3 కేటగిరీలో మనీషా రామ్‌దాస్ - ప్రమోద్ భగత్‌కూ కాంస్యమే వచ్చింది.

హైదరాబాద్‌దే పైచేయి

ఆంధ్రతో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్‌దే పైచేయి. బుధవారం ఆ జట్టు 267 పరుగుల తేడాతో భారీ విజయాన్నందుకుంది. 398 పరుగుల ఛేదనలో ఆంధ్ర తేలిపోయింది. తనయ్ త్యాగరాజన్ (6/35) విజృంభించడంతో కనీసం పోటీ ఇవ్వలేక.. 130 పరుగులకే కుప్పకూలింది. 7/2తో బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు.. హేమంత్ రెడ్డి (27), రికీ భుయ్ (26) ఆచితూచి ఆడటంతో మరో కోల్పోకుండా 50 మార్కును చేరుకుంది. అయితే భుయ్ ఔటయ్యాక ఆంధ్ర పతనమైంది. తనయ్ స్పిన్ మాయాజాలానికి తలవంచిన బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. 100లోపే 7 వికెట్లు పడటంతో ఆతిథ్య జట్టు ఓటమి ఖాయమైపోయింది.

కేవీ శశికాంత్ (23) కాసేపు ప్రతిఘటించాడు. అనికేత్ రెడ్డి (3/57).. తనయ్‌కు సహకరించాడు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 275 పరుగులకు ఆలౌటవగా.. ఆంధ్ర 184కు పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 306/7కు డిక్లేర్ చేసింది. మ్యాచ్‌లో మొత్తం 11 వికెట్లు, ఒక అర్ధసెంచరీ (53 నాటౌట్)తో జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించిన తనయ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

పంజాబ్ విజయం: ఛత్తీస్‌గఢ్‌తో మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. 86 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆ జట్టు కెప్టెన్ ఉదయ్ సహారన్ (40), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (24) రాణించడంతో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంతకుముందు ఫాలో ఆన్ ఆడుతూ 123/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఛత్తీస్‌గఢ్.. 335 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో పంజాబ్ 456 పరుగులు చేయగా.. ఛత్తీస్‌గఢ్ 206కే కుప్పకూలి ఫాలోఆన్‌లో పడింది.

ముంబయి ఘనంగా..: హిమాచల్ ప్రదేశ్‌ను ముంబయి చిత్తుగా ఓడించింది. ఆ జట్టు ఇన్నింగ్స్ 97 పరుగుల తేడాతో గెలిచింది. 244 పరుగుల లోటులో ఉన్న హిమాచల్ ప్రదేశ్ 144/3తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. మోహిత్ అవస్థి ధాటికి తాళలేకపోయింది. 291కే ఇన్నింగ్స్ ముగించింది.

భారత్ శుభారంభం..

న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన తొలి టీ20లో కివీస్‌పై నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో టీమ్‌ఇండియా ఆరు వికెట్లను కోల్పోయి 19.4 ఓవర్లలో 230 పరుగులు చేసి గెలిచింది. సంజు శాంసన్ (67: 33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకం చేయగా.. నమన్ ధిర్ (42: 15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రేయస్ అయ్యర్ (42: 28 బంతుల్లో ఒక ఫోర్, ఒక సిక్స్), అభిషేక్ శర్మ (29: 12 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (24: 14 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్) విలువైన పరుగులు చేశారు. తిలక్ వర్మ (6), ఇషాన్ కిషన్ (1) విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో బ్రాస్‌వెల్ 2, శాంట్నర్ 2, ఫెర్గూసన్, ఆడమ్ మిల్నే చెరో వికెట్ తీశారు.

అలసటే అసలైన సవాల్..

కేవలం 48 గంటల్లోనే మ్యాచ్

టీమ్‌ఇండియా బెంగళూరు నుంచి న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చ్‌కు చేరిన 48 గంటల్లో తొలి టీ20 సమరం మొదలుకానుంది. దీంతో ఫ్యాన్స్ కూడా ఇంత హడావుడిగా షెడ్యూల్ ఉండటంపై ఆందోళన చెందుతున్నారు. అయితే శ్రేయస్ అయ్యర్ మాత్రం ఈ ఒత్తిడి తమపై పెద్దగా ప్రభావం చూపబోదని తేల్చి చెప్పాడు. జట్టు నిరంతర ప్రయాణాలకు ట్యూన్ అయి ఉంటుందని పేర్కొన్నాడు.

'గతంలో కూడా మేము ఇలా ఆడిన సందర్భాలున్నాయి. ప్రయాణించడం.. ఆ వెంటనే

మ్యాచ్ ఆడటం.. అక్కడి కండిషన్లకు అలవాటు పడటం సరదాగా ఉంటుంది. ప్రయాణ బడలిక అనే కారణాన్ని పక్కనపెట్టి మ్యాచ్ గెలవడంపై దృష్టిపెట్టాం. ఇక భువి అనుభవం జట్టుకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటివరకు బౌలింగ్‌లో అనుభవలేమి కనిపించింది. అతడు గత రెండేళ్లలో ఐపీఎల్‌లో విజయాలు సాధించాడు. ఈ ఫార్మాట్‌లో తన డామినేషన్ నిరూపించుకొన్నాడు'' అని శ్రేయస్ పేర్కొన్నాడు.

దౌత్య అవసరాలు, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇటీవల కాలంలో క్రికెట్ షెడ్యూల్ ఒత్తిడిగా మారిందనడానికి న్యూజిలాండ్ సిరీస్ ఉదాహరణ. 43 రోజులపాటు సాగే ఈ పర్యటనలో ఐదు టీ20లు, ఐదు వన్డేలు ఆడనుంది.

శ్రేయస్ అయ్యర్‌ను మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో పోల్చడం సరికాదని మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ అభిప్రాయపడ్డాడు. ''సూర్య సమయంలో చాలా సిరీస్‌లు భారత్‌లో జరిగాయి. కానీ, శ్రేయస్ కెప్టెన్సీ చేపట్టాక ఇంగ్లాండ్, జింబాబ్వే, జపాన్ వెళ్లారు. ఇప్పుడు న్యూజిలాండ్ పర్యటనలో ఉన్నారు. చాలా టీ20లు విదేశాల్లో ఆడారు. ఇప్పుడు న్యూజిలాండ్‌లో శ్రేయస్ విజయం సాధిస్తే.. కెప్టెన్‌గా అతడి స్థాయి పెరుగుతుంది'' అని పేర్కొన్నారు.

హ్యాపీ బర్త్ డే టు ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ..ప్రభాస్

వుదయం సినిమా: బాక్సాఫీస్ రికార్డులు తిరగ రాసిన "బాహుబలి" ప్రభాస్పాన్ ఇండియాకు తెలుగు సినిమాను నడిపిస్తున్న నాయకుడు (సలార్) ప్రభాస్తన నటనతో ప్రేక్షకుల మనసు గెలిచే సైనికుడు (ఫౌజీ) ప్రభాస్టాలీవుడ్ ను కొత్త యుగంలోకి తీసుకెళ్తున్న 'కల్కి' ప్రభాస్గార్లింగ్స్ గర్వపడేలా చేయాలనేదే ఆయన "స్పిరిట్" క్రేజ్, స్టార్ డమ్ లో ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్అలుపులేకుండా భారీ పాన్ ఇండియా చిత్రాలు చేస్తూ తన అభిమానులను, ప్రేక్షకులను సంతోషపెడుతున్నారు ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్, రెబల్ స్టార్ ప్రభాస్. ప్రతిష్టాత్మక చిత్రాల్లో నటిస్తూ భారతీయ సినిమా కీర్తిని కొత్త శిఖరాలకు చేరుస్తున్నారు ప్రభాస్. ఈశ్వర్ సినిమాతో మొదలైన ప్రభాస్ సిల్వర్ స్క్రీన్ జర్నీ 24 ఏళ్లుగా బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ సక్సెస్ ఫుల్ గా కొనసాగుతోంది. అందరినీ ప్రేమించే తత్వమే ప్రభాస్ ను అందరూ ఇష్టపడే డార్లింగ్ లా మార్చేసింది. స్టార్ గా ప్రభాస్ స్టామినా బాక్సాఫీస్ రికార్డులు చెబితే, అందరూ ప్రేమగా పిలిచే డార్లింగ్ అనే మాట వ్యక్తిగా ఆయన గొప్పదనం చూపిస్తుంది. ప్రభాస్ కొత్త సినిమా వచ్చిందంటే అది ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులకు మరో చరిత్రను లిఖించినట్లే. రెబల్ స్టార్ భారీ లైనప్, ఆ సినిమాల్లో శ్రమతో, అంకితభావంతో, నటనా ప్రతిభతో తను చేస్తున్న క్యారెక్టర్స్, బ్యాక్ టు బ్యాక్ ఈ హ్యూజ్ మూవీస్ చేసేందుకు ఆయన పడుతున్న కష్టం...ఇవన్నీ ప్రభాస్ ను మరో స్టార్ అందుకోలేనంత ఎత్తులో నిలబెడుతున్నాయి. ఆయన అభిమానులు గర్వించేలా చేస్తున్నాయి.పాన్ ఇండియా స్టార్ డమ్ దాటేసి గ్లోబల్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నారు రెబల్ స్టార్ ప్రభాస్. ఆయన నటించే ప్రతి సినిమా ఎల్లలు దాటి ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేస్తోంది. ప్రభాస్ లా ప్రాంతీయ సినిమా హద్దులు దాటి గ్లోబల్ రేంజ్ కు వెళ్లిన స్టార్ హీరోస్ చాలా కొద్దిమందే కనిపిస్తారు. బాహుబలి సినిమాతో మొదలైన ప్రభాస్ పాన్ ఇండియా జర్నీ దిగ్విజయంగా కొనసాగుతోంది. థియేట్రికల్, డిజిటల్, శాటిలైట్, ఓవర్సీస్ బిజినెస్..ఇలా ఏ విషయంలో చూసినా ప్రభాస్ మరే స్టార్ హీరో అందుకోలేనంత స్థాయికి చేరుకున్నారు.ప్రభాస్ సినిమాలు బాలీవుడ్ స్టార్స్ తో పోటీ పడేంతగా నార్త్ లో కలెక్షన్స్ సాధిస్తున్నాయి. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, ఛరిష్మా ఉత్తరాది ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. అందుకే బాలీవుడ్ లో తన సినిమాలతో బాక్సాఫీస్ రికార్డులు క్రియేట్ చేస్తున్నారు ప్రభాస్. తమిళ, మలయాళ, కన్నడలోనూ స్థానిక స్టార్ హీరోలతో ప్రభాస్ సినిమాలు పోటీ పడటం నిజమైన పాన్ ఇండియా ట్రెండ్ కు నిదర్శనంగా నిలుస్తోంది. ఓవర్సీస్ లోనూ ప్రభాస్ ఆకర్షణకు తిరుగులేదు.

వుదయం సినిమా MOVIE TIME!

"కిల్లర్" ట్రైలర్ రిలీజ్ ఈవెంట్

వుదయం సినిమా: జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ "కిల్లర్". ఈ చిత్రంలో మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, అయినాబత్తిన దశరథ మాధవ్, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. "కిల్లర్" సినిమా ఈ నెల 30న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతోంది. ఓవర్సీస్ లో "కిల్లర్" మూవీని ఓఎంజి పిక్చర్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ రోజు ఈ చిత్ర ట్రైలర్ ను పవర్ డైరెక్టర్ హరీశ్ శంకర్ చేతుల మీదుగా హైదరాబాద్ లో గ్రాండ్ గా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలోచీఫ్ ఎడిటర్ బి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ – పూర్వాజ్ గారి సినిమాలకు వర్క్ చేయడానికి నేను ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తుంటాను. ఆయన సినిమాలు క్రియేటివ్ గా ఉంటాయి. ఆయన వర్క్ పరంగా చాలా ఫ్రీడమ్ ఇస్తారు. మా జ్యోతి గారు ఒక సోదరుడిలా చూసుకుంటారు.

"జయహో రామానుజ" సినిమా ప్రీ రిలీజ్

వుదయం సినిమా: లయన్ డా. సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా "జయహో రామానుజ". ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్ లో సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు.

అమెరికా నటి జో శర్మ హీరోయిన్ గా నటిస్తుండగా..సుమన్, ప్రవల్లిక ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ నెల 24న "జయహో రామానుజ" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనటి, నిర్మాత ప్రవల్లిక మాట్లాడుతూ – మా "జయహో రామానుజ" సినిమా ఈ నెల 24న రిలీజ్ కు వస్తోంది. సినిమాను రూపొందించడం ఒకెత్తు అయితే అది రిలీజ్ చేయడం మరో ఎత్తు. మా సినిమాకు అగ్రెసివ్ ప్రమోషన్స్ చేస్తున్నాం. ఈ నెలలో రిలీజైన పెద్ద సినిమాలతో పోటీగా ప్రమోషన్స్ చేస్తున్నాం. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ దగ్గర కూడా ప్రచారం నిర్వహించాం. సమసమాజం కోసం రామానుజాచార్యుల వారు చేసిన ప్రయత్నం ఏంటి, ఈ క్రమంలో వారు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు వంటి అంశాలను మా సినిమాలో చూపిస్తున్నాం. ఈ సినిమాలో నేను కృష్ణుడు, నారదుడు, రఘునాథస్వామి వంటి మూడు రోల్స్ లోనూ నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. రామానుజాచార్యుల వారి జీవితం గురించి మా సినిమా ద్వారా ఇప్పటి తరానికి తెలుస్తుందని నమ్ముతున్నాం అన్నారు.ప్రొడ్యూసర్ నాగబాల సురేష్ మాట్లాడుతూ – పౌరాణిక నేపథ్య చిత్రాలు రూపొందించడం చాలా కష్టం. రామానుజాచార్యుల వారి జీవితాన్ని తెరపైకి తీసుకొచ్చే ఒక పెద్ద ప్రయత్నం చేస్తున్నారు లయన్ సాయి వెంకట్. వెంకటేశ్వరస్వామి దయ ఉంటే తప్ప ఆయన ఈ సినిమా చేసేవారు కాదు. ఆయనకు ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా. అన్నారు.ఏపీ ఫిలింఛాంబర్ అధ్యక్షులు ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ – "జయహో రామానుజ" సినిమాలో చరిత్రనే కాదు గొప్ప సందేశాన్ని కూడా చూపించబోతున్నారు లయన్ సాయి వెంకట్ గారు. ఈ సినిమాను ప్రేక్షకులంతా చూసి ఆదరించాలి. రామానుజాచార్యుల వారి గురించి తెలుసుకోవాలని కోరుతున్నా అన్నారు.డైరెక్టర్ వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ – ఇటీవలే హనుమాన్ అంశ్ అని బాలీవుడ్ లో ఒక గొప్ప మూవీ వచ్చింది. ఇప్పుడు తెలుగులో సాయి వెంకట్ గారు జయహో రామానుజా చిత్రంతో అలాంటి గొప్ప ప్రయత్నం చేయడం అభినందనీయం. ఈ సినిమా రిలీజ్ అయ్యాక జరిగే విజయోత్సవాలను మనం చూస్తాం. ఇలాంటి మంచి సినిమాలు ఇప్పుడున్న సమాజానికి చాలా అవసరం అన్నారు.బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ – మన మధ్య కుల, మత అడ్డు గోడలు వద్దు అని వెయ్యేళ్ల కిందటే చెప్పిన మహనీయుడు రామానుజాచార్యుల వారు. ఆయన జీవిత కథను లయన్ సాయి వెంకట్ రూపొందించడం గొప్ప ప్రయత్నం. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ అభినందించాలి.

"సమ్మర్ హాలిడేస్" రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్

వుదయం సినిమా: కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నవంబర్ 6న "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు ఈ చిత్ర రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లాడుతూ – "సమ్మర్ హాలిడేస్" సినిమాకు సైన్ చేసినప్పుడు మొదట్లో ఈ సినిమాకు వర్క్ చేయడం ఈజీ అనుకున్నా కానీ ఈజీ కాదు చాలా హార్డ్ వర్క్ చేయాల్సివచ్చింది. సాంగ్స్ కు మీరు ఇస్తున్న రెస్పాన్స్ చూశాక హ్యాపీగా అనిపిస్తోంది. నా వరకు మొత్తం వర్క్ కంప్లీట్ అయ్యింది. మా సినిమాను నవంబర్ 6న పెద్ద మనసు చేసుకుని థియేటర్స్ లో చూడాలని ప్రేక్షకుల్ని కోరుకుంటున్నాం. ఒక మంచి ఫీల్ గుడ్ మూవీ. సినిమా చూస్తున్నంతసేపు మీ నోల్టాల్జిక్ మూవ్ మెంట్స్ గుర్తుకువస్తాయి. అన్నారు.బాల నటుడు రోహన్ రాయ్ మాట్లాడుతూ – మా సినిమా ఇప్పటికే రిలీజ్ కావాల్సింది. మా స్నేహితులు అడిగితే సమ్మర్ కు అని చెప్పాను. ఆ తర్వాత దసరా హాలీడేస్ అని చెప్పాను. ఇప్పుడు నవంబర్ 6న అని చెబుతుంటే వాళ్లు నమ్మడం లేదు. ఖచ్చితంగా నవంబర్ 6న మా సినిమా రిలీజ్ కు వస్తోంది. మేము సక్సెస్ మీట్ జరుపుకోవాల్సిన టైమ్ లో రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తున్నాం.

'రుద్రవనం పీఎస్' ట్రైలర్ విడుదల..

వుదయం సినిమా: 'క్రైమ్‌ను ఫాలో అయితే జరిగింది మాత్రమే తెలుస్తుంది.. కానీ క్రిమినల్‌ని ఫాలో అయితే జరగబోయేది కూడా తెలుస్తుంది' అంటున్నారు రుద్రవనం సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ శివ కుమార్. ఇంతకీ ఈ శివ కుమార్ ఎవరు? ఇతను ఎవర్ని ఫాలో కావాలనుకుంటున్నాడనే విషయం తెలుసుకోవాలంటే మాత్రం అక్టోబర్ 30 నుంచి జీ5లో ప్రీమియర్ కాబోతోన్న ఒరిజినల్ 'రుద్రవనం పీఎస్' చూడాల్సిందే. రుద్రవనం ఊరిలో ఓ తల లేని మృత దేహం దొరుకుతుంది. తర్వాత ఓ వ్యక్తి కనిపించకుండా పోతాడు. దీంతో ఈ కేసుని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఎలా గైనా చేధించాలనుకుంటారు. కేసుని డీల్ చేసే ఎస్ఐ శివకుమార్ ఆ కేసు వెనుక ఉన్న నిజాలను తెలుసుకునేందుకు రంగంలోకి దిగుతాడు. ఒక్కో ఆధారం బయటపడుతున్న కొద్దీ అవినీతి, స్థానిక రాజకీయాలు, ఎన్నో ఏళ్లుగా బయటకు రాని రహస్యాలు వెలుగులోకి వస్తాయి. చివరకు ఈ పోరాటం కేవలం ఓ కేసుకే పరిమితం కాదు.. అది వ్యక్తిగత పోరాటంగా మారుతుంది. పైకి కనిపించే దానికంటే ఎన్నో రహస్యాలను దాచుకున్న ఓ ఊరులో ఉన్న అసలు రహస్యమేంటనేది తెలుసుకోవాలంటే అక్టోబర్ 30 నుంచి జీ5 ఒరిజినల్‌గా స్ట్రీమింగ్ కానున్న 7 ఎపిసోడ్ల తెలుగు మినీ సిరీస్ 'రుద్రవనం పీఎస్' చూడాల్సిందే. విజయదశమి రోజున మేకర్స్ ఈ ఒరిజినల్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో పోలీసులకు సవాలు విసిరిన కేసు.. దాన్ని వారు ఎలా చేధించారనేలా ఉండే కంటెంట్ ఒరిజినల్‌పై ఆసక్తిని పెంచుతోంది.

డీఆర్ఆర్ ప్రొడక్షన్స్ తొలి చిత్రం ప్రారంభం

వుదయం సినిమా: డీఆర్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న తొలి చిత్రం 'ప్రొడక్షన్ నంబర్ 1' దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. డాక్టర్ దామోదర్ నేరేళ్ల తన డ్రీమ్ ప్రాజెక్టుగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శశాంక్ దువ్వూరు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవి శివతేజ, భాస్కర్ పరమాత్ముని, సుబ్రహ్మణ్యం అల ప్రధాన పాత్ర ల్లో నటిస్తుండగా, నేహా పఠాన్ కథానాయికగా కనిపించనున్నారు. స్నేహం, ప్రేమ, కుటుంబ అనుబంధాలతో పాటు సైన్స్ ఫిక్షన్ అంశాలను మేళవిస్తూ విభిన్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది.డ్రీమ్ ప్రాజెక్టుగా సినిమా నిర్మాణంఇండియన్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (ఐఏఎంఏ) వ్యవస్థాపకులు, సీఈఓ డాక్టర్ దామోదర్ నేరేళ్ల వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్నారు. గత 26 ఏళ్లుగా యూకే, అమెరికాలో వైద్య వృత్తిలో కొనసాగుతున్న ఆయనకు సినిమాలపై చిన్నప్పటి నుంచే ప్రత్యేక ఆసక్తి ఉంది. మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. తన సినిమా ప్రయాణం గురించి నిర్మాత డాక్టర్ దామోదర్ నేరేళ్ల మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే సినిమాలంటే ఎంతో ఇష్టమని తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'ఖైదీ' సినిమా చూడటానికి పాఠశాలకు వెళ్లకుండా వరంగల్ వెళ్లిన రోజులు కూడా ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. ఇన్నాళ్లుగా తనలో ఉన్న సినిమా కలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నానని, తన డ్రీమ్ ప్రాజెక్టు దసరా రోజున ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు.దర్శకుడు శశాంక్ దువ్వూరు చెప్పిన కథ తనకు ఎంతగానో నచ్చిందని, ప్రేమ, స్నేహం, కుటుంబ విలువలతో పాటు మంచి సందేశాన్ని అందించే అంశాలు ఇందులో ఉన్నాయన్నారు.

"ఆలోచన" చిత్రం సెన్సార్ పూర్తి ..

వుదయం సినిమా: పి.ఎస్.జె ఫిలిమ్స్ కో బ్యానర్ లో ప్రదీప్ కుమార్, శ్రీనివాస్ గుండబోయిన నిర్మించిన చిత్రం "ఆలోచన". సీనియర్ నటులు స్వర్గీయ జి.వి.నారాయణ రావు, ప్రసాద్ బాబు, నరసింహరాజు, రాజన్ హరి , మహర్షి రాఘవ, జయలలిత, బెన్నీ సుధాకర్, జెన్నీ, సుజనా రెడ్డి, మాధవి, అనుపమ స్వాతి, జస్సి అద్వైక, హసిత, ప్రసాద్ రామ్,నరేంద్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సురేందర్ చాచా కథ, స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వం వహించారు. ఇటీవల ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ ను పద్మశ్రీ మురళి మోహన్ గారు విడుదల చేశారు, "ఆలోచన" టీజర్ ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ గారు విడుదల చేశారు, "భజేగోవిందం" పాటను శ్రీ శ్రీ శ్రీ చిన్నజీయర్ స్వామి వారు విడుదల చేశారు అలాగే "అమ్మ" సాంగ్ ను అక్కినేని అమల విడుదల చేశారు.ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని యు/ఏ సర్టిఫికెట్ పొందిన ఆలోచన సినిమా త్వరలో థియేటర్స్ లో విడుదలకు సిద్ధంగా ఉంది, మేకర్స్ రిలీజ్ డేట్ ను త్వరలో ప్రకటించాబోతున్నారు. సమాజంలో జరిగే కొన్ని ఆసక్తికరమైన వాస్తవిక జీవితాలు, స్నేహానుభంధాల ఆధారం చేసుకొని దర్శకుడు సురేందర్ చాచా ఈ సినిమాను తెరకెక్కించారు. లైఫ్ ఆఫ్టర్ రిటైర్మెంట్ అనే ఒక కాన్సెప్ట్ తో "ఆలోచన" సినిమా కథ కథంశాలు ఉండబోతున్నాయి.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.